


PRAJA PRASHNA
# ప్రజాప్రశ్న
RNI : TELTEL/2021/80267 తెలుగు దినపత్రిక




సంపుటి: 5 సంచిక: 62, పేజీలు - 08
మంగళవారం, ఆగష్టు 5, 2025 వెల: 5 రూ/.
హైదరాబాద్ | ప్రజల పక్షాన ప్రశ్నించే పత్రిక | HYDERABAD

# అసెంబ్లీకి కాళేశ్వరం రిపోర్ట్

## చర్యలపై అప్పుడే నిర్ణయం

- ఈ మూడు బ్యారేజీల నిర్మాణం మాజీ సీఎం కేసీఆర్ ఏకైక నిర్ణయం
- కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణమే అవసరం లేదని నివేదించిన నిపుణుల కమిటీ
- చట్ట విరుద్ధమైన కాంట్రాక్టులు, సవరించిన అంచనాలు



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అవకతవకలపై జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ఇచ్చిన రిపోర్టును అసెంబ్లీలో ప్రవేశ పెడతామని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. మంత్రివర్గ సమావేశం అనంతరం కేబినెట్ మంత్రులతో కలిసి మీడియా సమావేశంలో రేవంత్ పాల్గొన్నారు. నివేదికలోని ముఖ్య అంశాలను మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మీడియాకు వివరించిన తర్వాత రేవంత్ మాట్లాడారు. 665 పేజీల నివేదికను సభ్యులందరికీ ఇస్తామని అసెంబ్లీ సమావేశాల్లో సభ్యులందరూ స్వేచ్ఛగా తమ అభిప్రాయాలు చెప్పవచ్చన్నారు. కమిషన్ రిపోర్టు ఇచ్చిన వెంటనే మంత్రి వర్గ సమావేశాన్ని ఏర్పాటు చేసి నివేదికను ఆమోదించామని తెలిపారు. ఎలాంటి ఊహాగానాలుక తావు లేకుండా ఉండకూడదనే ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. తమ ప్రభుత్వం పారదర్శకంగా ఉండాలని అనుకుంటోందని తెలిపారు.కాళేశ్వరం నిర్మాణం జరిగిన మూడేళ్లలో మేడిగడ్డ కుంగిపోయిందని. అన్నారం, సుందిల్ల లో పగుళ్లు వచ్చాయన్నారు. లక్ష కోట్ల ప్రాజెక్టు కూలిపోవడం తో విచారణ చేస్తాం అని మేము చెప్పామని మాట ప్రకారం కమిషన్ విచారణ కి ఆదేశించామని రేవంత్ గుర్తు చేశారు. కమిషన్ ఏడాదిన్నర పాటు విచారణ జరిపి అన్ని విషయాలను కూలంకుషంగా పరిశీలించి నివేదిక ఇచ్చిందన్నారు. ఊహాగానాలకు తావు లేకుండా ఉండటానికి సంక్షిప్తంగా వివరాలు వెల్లడించామని తెలిపారు. పూర్తి రిపోర్టును అసెంబ్లీలో ప్రవేశ పెట్టిన తర్వాత సభ్యులందరూ స్వేచ్ఛగా అభిప్రాయాలను వెల్లడించే అవకాశం ఇస్తామన్నారు. అందరి అభిప్రాయాలను బట్టి తదుపరి కార్యాచరణ చేపడతామన్నారు.నివేదికపై అన్ని పార్టీల అభిప్రాయాలు సూచనలు తీసుకున్న తర్వాత అందరి అభిప్రాయంతోనే చర్యలు తీసుకుంటామన్నారు. కేసీఆర్, హరీష్ రావు కూడా తమ అభిప్రాయాలను కూడా చెప్పవచ్చన్నారు.నివేదిక సూచనలను ప్రభుత్వం పాటిస్తుందని సీఎం రేవంత్ స్పష్టం చేశారు. ఇది ప్రభుత్వ నివేదిక కాదన్నారు. ఇండిపెండెంట్ జ్యూడిషియల్ రిపోర్ట్ అని గుర్తు చేశారు. వ్యక్తిగత ద్వేషంతో ఎలాంటి నిర్ణయాలు తీసుకునేది లేదన్నారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందే ఈ ప్రాజెక్టుల నిర్మాణంపై విచారణ చేయిస్తామని తమ మేనిఫెస్టోలో స్పష్టం చేశామని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. కమిషన్ కేసీఆర్, హరీష్‌రావు సహా అనేక మందిని జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ప్రశ్నించిందని రేవంత్ గుర్తు చేశారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ వారి హయాంలోనే కూలిందని రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. కాళేశ్వరం కమిషన్ నివేదికకు తెలంగాణ కేబినెట్ ఆమోదం తెలిపిందన్నారు.

## రాహుల్ గాంధీపై సుప్రీంకోర్టు ఆగ్రహం

### అసలైన భారతీయులు అలా మాట్లాడరంటూ చురకలు



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలను సుప్రీంకోర్టు తప్పుపట్టింది. ఆయన కనుక నిజమైన భారతీయుడు అయితే కనుక ఇలాంటి మాటలు మాట్లాడరు అని సుప్రీం కోర్టు వ్యాఖ్యానించింది. చైనా సైనికులు భారత భూభాగాన్ని ఆక్రమించారంటూ కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ గతంలో చేసిన వ్యాఖ్యలపై సుప్రీంకోర్టు ఇలా వ్యాఖ్యానించింది. రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలను సుప్రీంకోర్టు సోమవారం తీవ్రంగా ఖండించింది. చైనా 2 వేల కిలోమీటర్ల మేర భారత భూభాగాన్ని ఆక్రమించిందని రాహుల్ చేసిన వ్యాఖ్యలను ధర్మాసనం తప్పుపట్టింది. 2020లో గాల్వాన్ లోయలో చైనా సైనికులతో జరిగిన ఘర్షణ సందర్భంలో భారత సైన్యం గురించి లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలపై ఆయనపై క్రిమినల్ పరువు నష్టం కేసు పిటిషన్ దాఖలైంది.

2లో..

# ప్రజల తలసరి ఆదాయం పెంపుపై పకడ్బందీ కార్యక్రమాలు

## - సీఎం చంద్రబాబు దిశానిర్దేశం



**అమరావతి (ప్రశ్న న్యూస్)** విజన్, పీపుల్, నేచర్, టెక్నాలజీలకు ప్రాధాన్యత ఇచ్చి పాలన చేస్తే అత్యుత్తమ ఫలితాలు వస్తాయని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. నాణ్యమైన జీవన ప్రమాణాలను సాధించే లక్ష్యంగా ప్రణాళికలు రూపొందించుకోవాలని సీఎం సూచించారు. రాష్ట్ర స్థూల ఉత్పత్తి, కీ పెర్ఫార్మెన్స్ ఇండికేటర్స్ పై ప్రణాళికా శాఖతో పాటు వివిధ శాఖల ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి సచివాలయంలో సోమవారం సమీక్ష నిర్వహించారు.

### 229 నాటికి రూ.5.42 లక్షల తలసరి ఆదాయం లక్ష్యం

తలసరి ఆదాయం పెంచడం ద్వారా ప్రజల జీవన ప్రమాణాలు పెంచాలని సీఎం అన్నారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో తలసరి ఆదాయం రూ. 3,47,871 సాధించాలని, దానికి అనుగుణంగా 2029 నాటికి రూ. 5.42 లక్షలు తలసరి ఆదాయం వచ్చేలా లక్ష్యంగా పెట్టుకోవాలని ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు. ప్రభుత్వ శాఖలు ఆయా రంగాల్లో ముందస్తు ప్రణాళికలు రూపొందించి అమలు చేయాలి. స్వల్ప, మధ్య, దీర్ఘ కాలిక లక్ష్యాలకు అనుగుణంగా విజన్ తో పనిచేయాలని సూచిచారు. ఫ్యామిలీ ఒక యూనిట్ గా తీసుకుని పథకాలు, కార్యక్రమాలు రూపొందించాలి కనీస అవసరాలు అందించాలి. పథకాలతో పాటు వారి ఆదాయాలు పెరిగేలా చర్యలు తీసుకోవాలి. పర్యావరణానికి మేలు చేసే విధంగా ప్రభుత్వ విధానాలు, ప్రజల ఆలోచనలు ఉండాలి. సహజ వనరులను రక్షించుకుంటూ ప్రకృతిని కాపాడుకోవాల్నారు. పీపుల్, విజన్, నేచర్, టెక్నాలజీ అంశాలకు పాలనలో ప్రాధాన్యం ఇస్తూ సమన్వయంతో పనిచేస్తే అత్యుత్తమ ఫలితాలు వస్తాయని ఆ దిశగా అధికారులు, ఆయా శాఖలు పనిచేయాలని అని సీఎం

2లో..

## బీఆర్ఎస్‌లో రాజీనామాల పర్వం

### - మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు గుడ్ బై



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) అవినీతి ఆరోపణలు, వరుస విచారణలతో సతమతమవుతున్న బీఆర్ఎస్ పార్టీకి తాజాగా మరో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. పార్టీకి చెందిన కీలక నేతలు, అచ్చంపేట మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు, అలంపూర్ మాజీ ఎమ్మెల్యే అబ్రహం బీఆర్ఎస్‌కు రాజీనామా చేశారు. తమ రాజీనామా లేఖలను బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు పంపించారు. ప్రస్తుతం నాగర్‌కర్నూల్ జిల్లా బీఆర్ఎస్

2లో..

## కాళేశ్వరం రిపోర్టుతో అటెన్షన్

### - ఫామ్‌హౌస్‌లో కీలక నేతలతో కేసీఆర్ మంతనాలు



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** కాళేశ్వరం అవకతవకలపై జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ రిపోర్టు కేబినెట్ ముందుకు రానున్న సమయంలో బీఆర్ఎస్ చీఫ్ కేసీఆర్ రంగంలోకి దిగారు. పార్టీ ముఖ్య నేతలతో ఫామ్ హౌస్ లో సమావేశం అయ్యారు. కేటీఆర్, హరీష్ రావు, జగదీష్ రెడ్డి , ప్రశాంత్ రెడ్డి వంటి నేత నేతలు ఫామ్ హౌస్ లో ఉన్నారు. వారితో కేటీఆర్ రెండు, మూడు గంటల పాటు విస్తతంగా చర్చలు జరిపారు. కాళేశ్వరం రిపోర్టులో ప్ధానంగా కేసీఆర్ తప్పులు చేశారన్న రిపోర్టు వచ్చిందన్న ప్రచారం జరుగుతూతూండటంతో తదుపరి తీసుకోవాల్సిన రాజకీయ నిర్ణయాలపై చర్చలు జరుపుతున్నట్లుగా తెలుస్తోంది.
తెలంగాణకు తలమానికంగా నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ పార్టీ కుట్రలు చేస్తోందని అన్ని నిబంధనల ప్రకారమే జరిగినా చట్టబద్ధత లేని కమిటీని నియమించి కేసీఆర్ ను టార్గెట్ చేసే

2లో..

## కుంకీ ఏనుగుల తొలి ఆపరేషన్ విజయవంతం

- పంటలను నాశనం చేస్తున్న ఏనుగులను తరిమికొట్టిన కుంకీలు
- సరిహద్దు రైతులకు ఇది పెద్ద భరోసా అన్న పవన్ కల్యాణ్
- ఆపరేషన్ విజయవంతం చేసిన అటవీ సిబ్బందికి అభినందనలు



**అమరావతి (ప్రశ్న న్యూస్)** ఆంధ్రప్రదేశ్‌లో ఏళ్ల తరబడి రైతులను వేధిస్తున్న ఏనుగుల సమస్యకు పరిష్కారం చూపే దిశగా ప్రభుత్వం కీలక ముందడుగు వేసింది. రాష్ట్రంలో తొలిసారిగా చేపట్టిన 'ఆపరేషన్ కుంకీ' విజయవంతమైందని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ప్రకటించారు. చిత్తూరు జిల్లా, బంగారుపాళ్యం మండలం మొగిలి ప్రాంతంలో పంటలను ధ్వంసం చేస్తున్న అడవి ఏనుగుల గుంపును శిక్షణ పొందిన కుంకీ ఏనుగులు విజయవంతంగా అడవిలోకి తరిమికొట్టాయని వెల్లడించారు. ఈ ఆపరేషన్ సఫలం కావడంతో సరిహద్దు ప్రాంతాల రైతులకు భరోసా లభించినట్లయిందని పేర్కొన్నారు."గత 15 రోజులుగా మొగిలి ప్రాంతంలోని మామిడి తోటలపై అడవి ఏనుగుల గుంపు దాడులు చేస్తూ తీవ్ర నష్టం కలిగిస్తోంది. ఈ సమాచారంతో అప్రమత్తమైన అటవీ శాఖ అధికారులు 'ఆపరేషన్ కుంకీ'కి శ్రీకారం చుట్టారు. శనివారం రాత్రి

2లో..

## భారత లైఫ్ సైన్సెస్ రాజధానిగా హైదరాబాద్

### - 1 ట్రిలియన్ డాలర్ ఎకానమీ లక్ష్యమన్న సీఎం రేవంత్



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన 20 నెలల్లోనే చేసిన ప్రయత్నాల ఫలితంగానే హైదరాబాద్ ప్రపంచ స్థాయి గ్లోబల్ జీసీసీ రాజధానిగా ఎదిగిందని, నేటి ఈ కార్యక్రమమే అందుకు నిదర్శనం అని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. తెలంగాణను 1 ట్రిలియన్ డాలర్ ఎకానమిగా తీర్చి దిద్దడమే లక్ష్యంగా పనిచేస్తున్నాం, 2047 నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ ఎకానమీగా తీర్చిదిద్దుతాం అన్నారు. ఎలీ లిల్లీ గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ ప్రారంభించిన అనంతరం సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడారు. సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, ఇది తెలంగాణ రైజింగ్ 2047 దిశగా మేం వేసిన మరొక ముఖ్యమైన అడుగు. తెలంగాణ లైఫ్ సైన్సెస్ రంగంలో ఈరోజు చరిత్రక మైలురాయిగా నిలిచిపోతుంది. కాంగ్రెస్ ప్రభుత్వ చిత్తశుద్ధి, దృష్టికోణం,

2లో..

## బీసీ రిజర్వేషన్లపై బీజేపీ అధ్యక్షుడి కీలక ప్రకటన

### - 42% రిజర్వేషన్లు పూర్తిగా బీసీలకే ఇస్తామంటే మద్దతిస్తామని స్పష్టీకరణ



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామని చెప్పినప్పుడు, అందులో 10 శాతం ముస్లింలకు ఇస్తామని కాంగ్రెస్ చెప్పలేదని, పూర్తిగా బీసీలకే రిజర్వేషన్లు ఇస్తే తాము పూర్తిస్థాయిలో మద్దతు ఇస్తామని తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు

2లో..

## లోకేష్ పిల్లవాడు

- బనకచర్లను అడ్డుకుని తీరుతాం
- కోమటిరెడ్డి కీలక వ్యాఖ్యలు



2లో..

## ఆదాయం కాదు, ఆరోగ్యమే ముఖ్యం

### ఏపీ కొత్త బార్ పాలసీపై సీఎం చంద్రబాబు

- గీత కార్మికులకు బార్లలో 10 శాతం రిజర్వేషన్
- లాటరీ పద్ధతి ద్వారా బార్ లైసెన్సుల కేటాయింపు
- సెప్టెంబర్ నాటికి రాష్ట్రవ్యాప్తంగా నాటుసారా నిర్మూలన లక్ష్యం



అమరావతి (ప్రశ్న న్యూస్) మద్యం పాలసీ అనగానే దేశంలో ఏ రాష్ట్ర ప్రభుత్వాలైనా ఆదాయం గురించి చూస్తాయని కానీ మద్యం పాలసీ అంటే ఆదాయమే కాదని ప్రజల ఆరోగ్యమే ముఖ్యమనే విషయాన్ని గుర్తుపెట్టుకోవాలని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. ఆల్కహాల్ కంటెంట్ తక్కువ ఉన్న మద్యం ద్వారా మద్యం వినియోగదారుల ఆరోగ్యాన్ని చాలా వరకు కాపాడవచ్చు అని సీఎం అన్నారు. మద్యం పాలసీ అంటే ఆదాయం మాత్రమే అని భావించొద్దని ప్రజల ఆరోగ్యాలు ప్రధానమైన అంశమనే విషయాన్ని కూడా గుర్తుపెట్టుకోవాలని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో నాణ్యత లేని మద్యం కారణంగా కొన్ని లక్షల కుటుంబాలు నష్టపోయాయన్న విషయాన్ని సీఎం గుర్తుచేశారు. పేదల ఇల్లు, ఒళ్లు గుల్ల కాకుండా చూడాల్సిన అవసరం ఉందని సీఎం స్పష్టం చేశారు. సోమవారం నాడు సీఎం చంద్రబాబు సచివాలయంలో ఆబ్కారీ శాఖపై సమీక్ష చేపట్టారు.

2లో..

# రాహుల్ గాంధీపై సుప్రీంకోర్టు ఆగ్రహం

ఈ కేసులో విచారణను ముగిస్తున్న సందర్భంగా సుప్రీంకోర్టు తీవ్ర వ్యాఖ్యలు చేసింది. అసలైన భారతీయులెవరు ఇలాంటి వ్యాఖ్యలు చేయరంటూ రాహుల్ గాంధీని మందలించింది. చైనా మన భూభాగాన్ని ఆక్రమించిందని మీకెలా తెలిసిందని ధర్మాసనం సూటిగా ప్రశ్నించింది.

### రాహుల్ గాంధీపై సుప్రీంకోర్టు తీవ్ర వ్యాఖ్యలు

జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ ఎజి మసిహ్‌లతో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం రాహుల్ గాంధీకి ఈ కేసులో తాత్కాలిక ఉపశమనం కలిగించింది. కానీ కాంగ్రెస్ నేత చేసిన వ్యాఖ్యలను న్యాయమూర్తులు తీవ్రంగా వ్యతిరేకించారని లైవ్ లా నివేదించింది.

### సుప్రీం ధర్మాసనం ప్రశ్నల వర్షం..

రాహుల్ గాంధీ తరపున సీనియర్ లాయర్ అభిషేక్ మను సింఘ్వి వాదనలు వినిపించారు. ప్రతిపక్ష నేత సమస్యలను లేవనెత్తలేకపోతే అది మరింత దురదృష్టకర పరిస్థితి అవుతుందన్నారు. “మీడియాలో, పత్రికల్లో ప్రచురితమయ్యే విషయాలను ఆయన ప్రస్తావించకపోతే, ఆయన ప్రతిపక్ష నేత కాలేరు” అని వాదించారు. అయితే రాహుల్ గాంధీ ఆ అంశాలను పార్లమెంటులో కాకుండా సోషల్ మీడియాలో ఎందుకు ప్రస్తావించారని జస్టిస్ దత్తా ప్రశ్నించారు. ముఖ్యమైన విషయం అనుకుంటే పార్లమెంట్‌లో ప్రస్తావించాలని, సోషల్ మీడియా పోస్టులతో ఏం ప్రచారం చేయాలనుకుంటున్నారని ధర్మాసనం మండిపడింది. 2000 చదరపు కిలోమీటర్ల భారత భూభాగాన్ని చైనా ఆక్రమించినట్లు మీకెలా తెలిసిందని జస్టిస్ దత్తా రాహుల్ లాయర్ సింఘ్వీని అడిగారు. మీరు ఆ ప్రాంతంలో ఉన్నారా.? రాహుల్ గాంధీ వ్యాఖ్యలు నిజమనడానికి మీ దగ్గర ఏదైనా విశ్వసనీయమైన విషయం ఉందా? లేకుండా ఎందుకు మాట్లాడుతున్నారు అని ధర్మాసనం అడిగింది. చేస్తున్నారు. రాహుల్ గాంధీ నిజమైన భారతీయుడైతే, అలాంటి మాటలు అనరని చురకలు అంటించారు.

### రాహుల్ గాంధీ పిటిషన్‌ను తిరస్కరించిన అలహాబాద్ హైకోర్టు

ప్రశ్నలు అడిగినందుకు ఒకరిని ఇబ్బందిపెట్టడానికి ఇలాంటి ఫిర్యాదులు చేయడం ఒక మార్గం అని రాహుల్ గాంధీ లాయర్ సింఘ్వీ అన్నారు. బీఎన్ఎస్ఎస్ లోని సెక్షన్ 223 ప్రకారం, కోర్టు క్రిమినల్ ఫిర్యాదుపై చర్యలు చేపట్టే ముందు నిందితుడిని విచారించాలని అన్నారు. ఈ కేసులో అలా జరగలేదని.. సెక్షన్ 223 గురించి ఈ వాదనను హైకోర్టులో ఇంతకుముందు లేవనెత్తలేదని జస్టిస్ దత్తా గుర్తించారు. కోర్టు ఈ విషయాన్ని పరిగణనలోకి తీసుకుని నోటీసు జారీ చేసింది. పరువు నష్టం కేసులో మే 29న అలహాబాద్ హైకోర్టు రాహుల్ గాంధీ పిటిషన్‌ను తోసిపుచ్చింది. ఈ ఏడాది ఫిబ్రవరిలో లక్నోలోని ఒక ఎంపీ ఎమ్మెల్యే కోర్టు జారీ చేసిన సమన్ల ఉత్తర్వులను సైతం తోసిపుచ్చింది.

ప్రజల తలసరి ఆదాయం పెంపుపై పకడ్బందీ కార్యక్రమాలు
సూచించారు.

### ఉత్పత్తులకు విలువ జోడింపే కీలకం

“వివిధ రంగాల్లో రోజువారీగా మారే పరిణామాలకు.. మార్పులకు అనుగుణంగా కార్యక్రమాలు ఉండాలి. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో వస్తున్న మార్పుల మేరకు ప్రణాళికలు రూపొందించుకోవాలి. మన ఉత్పత్తులకు విలువ జోడింపు అనేదే కీలకం. దాని ద్వారానే రాష్ట్ర స్థూల ఉత్పత్తి గణనీయంగా పెరుగుతుంది. మైనింగ్, వ్యవసాయ ఉత్పత్తుల్లో జీవీఏ ప్రధానమైన అంశం. జీఎస్డీపీ వృద్ధి అయితేనే ప్రజలకు సంక్షేమం, అభివృద్ధి అందించగలం. వివిధ రంగాల్లో ఉత్తమ ఫలితాలు వచ్చేలా కార్యాచరణ చేయాలి.” అని చంద్రబాబు సూచించారు. ప్రస్తుతం ఉద్యాన పంటల ద్వారా రూ. 1,26,098 కోట్ల రూపాయల జీవీఏ వచ్చిందని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. ఆక్వా అనుబంధ పరిశ్రమ ద్వారా రూ. 1.12 లక్షల కోట్ల మేర జీవీఓ జోడించినట్టు అధికారులు వెల్లడించారు.

### రాష్ట్రంలో మెరుగైన జీవన ప్రమాణాలే లక్ష్యం

ఆర్థికాభివృద్ధితో పాటు రాష్ట్రంలోని ప్రజలకు నాణ్యమైన జీవన ప్రమాణాలు ముఖ్యమని సీఎం స్పష్టం చేశారు. “అత్యధిక తలసరి ఆదాయం కలిగిన రాష్ట్రంగా ఏపీ తయారు కావాలి. బెటర్ సొసైటీ, బెటర్ లివింగ్ స్టాండర్డ్స్ తీసుకువచ్చేలా ప్రభుత్వ శాఖలు పని చేయాలి. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రమాణాలు ఎలా నిర్దేశిస్తున్నారో పరిశీలించండి. ప్రతీ రంగంలోనూ ఏపీ ముఖ్య భూమిక పోషించాలి. గ్రామస్థాయి నుంచి కుటుంబం వారీగా పర్యవేక్షణ జరగాలి. లబ్దిదారులకు రాష్ట్ర ప్రభుత్వంతో పాటు కేంద్రం ఇచ్చే నిధులకు సంబంధించిన సమాచారాన్ని క్రోడీకరించండి. ప్రతీ కుటుంబం తాలూకు ఆర్థిక, ప్రజారోగ్య వివరాలు నమోదు కావాలి. ఫారెస్టు గ్రీన్ కవర్, ఎయిర్ క్వాలిటీ, తలసరి విద్యుత్ వినియోగం ఇలా అన్ని అంశాలను ఆయా శాఖలు నమోదు చేయాలి. కేవలం ఆదాయం, సంపద సృష్టికి మాత్రమే పరిమితం కావొద్దు.” అని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

### ప్రతీ విభాగానికీ ఓ ఇండికేటర్

ఆగస్టు 15 నుంచి ప్రభుత్వం అందించే 700 సేవలు ఆన్ లైన్ లో అందుబాటులో ఉంచాలి. కేవలం 60 లక్షల జనాభా, పరిమితమైన వనరులతో సింగపూర్ దేశం అంతర్జాతీయంగా విజయాలు సాధిస్తోందని చంద్రబాబు గుర్తు చేశారు. భారత్ లో 140 కోట్లకు పైగా జనాభా, అపారమైన వనరులతో చాలా విజయాలు సాధించే అవకాశం ఉంది. బయటి ప్రపంచం చూడకుండా మనకు మనమే తెలివైన వాళ్లని భావించుకోవడం సరికాదు. ఆర్టీజీఎస్ ద్వారా వచ్చే సమచారాన్ని క్రోడీకరిస్తే అది అతిపెద్ద సంపద అవుతుంది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా ఆ సమాచారాన్ని విశ్లేషించి వినియోగించుకుని ప్రభుత్వ శాఖల సామర్థ్యాన్ని పెంచుకునే అవకాశముందన్నారు.

# బీఆర్ఎస్‌లో రాజీనామాల పర్వం

పార్టీ అధ్యక్షుడిగా ఉన్న గువ్వల బాలరాజు రాజీనామా గులాబీ పార్టీలో తీవ్ర చర్చకు దారితీసింది. గువ్వల బాలరాజు రాజీనామా వెనుక ఉన్న కారణాలపై పార్టీలో తీవ్ర చర్చ జరుగుతోంది. ఎలాంటి ముందస్తు ప్రకటన లేకుండా చడిచప్పుడు చేయకుండా ఆయన పార్టీని వీడటం ఆశ్చర్యం కలిగిస్తోంది. ఇటీవల టీబీజేపీ చీఫ్ రామచందర్ రావు, మహబూబ్‌నగర్ ఎంపీ డి.కె. అరుణలతో గువ్వల బాలరాజు భేటీ అయిన తర్వాతే ఈ రాజీనామా నిర్ణయం వెలువడింది. ఈ పరిణామాల నేపథ్యంలో ఆయన ఈ నెల 9న బీజేపీలో చేరతారనే ప్రచారం జోరుగా సాగుతోంది. బీఆర్ఎస్‌లో కష్టకాలంలో కీలక నాయకులు పార్టీని వీడటం ఆ పార్టీకి తీరని నష్టం చేకూర్చే అవకాశం ఉంది.

### అలంపూర్ మాజీ ఎమ్మెల్యే అబ్రహం కూడా రాజీనామా..

గువ్వల బాలరాజు బాటలోనే అలంపూర్ మాజీ ఎమ్మెల్యే అబ్రహం కూడా బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేశారు. 2023 తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో టికెట్ దక్కకపోవడంతో అప్పటి నుంచి అబ్రహం పార్టీపై తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. ఆయనకు బదులుగా విజయుడికి అలంపూర్ ఎమ్మెల్యే టికెట్ ఇవ్వడంతోనే అబ్రహం పార్టీతో సంబంధాలు తెంచుకుంటున్నారని అప్పట్లోనే ప్రచారం జరిగింది.

అప్పట్లో కూడా అబ్రహం బీజేపీలో చేరబోతున్నారని పెద్ద ఎత్తున మీడియాలో వార్తలు వచ్చాయి. ఇప్పుడు గువ్వల బాలరాజుతో కలిసి రాజీనామా చేయడంతో, అబ్రహం కూడా కాషాయ తీర్థం పుచ్చుకోనున్నట్లు రాజకీయ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసిన గువ్వల బాలరాజు తన నిర్ణయం వెనుక ఉన్న మానసిక సంఘర్షణను రాజీనామా లేఖలో వెల్లడించారు. ఈ నిర్ణయం అంత సులువుగా తీసుకున్నది కాదని, ఎంతో ఆలోచించి, ఎన్నో విషయాలను పరిగణనలోకి తీసుకున్న తర్వాతే బాధతో పార్టీ నుంచి తప్పుకుంటున్నట్లు ఆయన పేర్కొన్నారు. బాలరాజు తన లేఖలో గత రెండు దశాబ్దాలుగా కేసీఆర్ నాయకత్వంలో పనిచేయడం తనకు ఎంతో గర్వకారణం అని తెలిపారు. ఈ సుదీర్ఘ ప్రయాణంలో ఎన్నో విషయాలు నేర్చుకున్నానని కేసీఆర్ వల్లే తాను ఈ స్థాయిలో ఉన్నానని కృతజ్ఞతలు తెలియజేశారు. ప్రస్తుతం పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు దానిని వీడటం తనకు బాధగా ఉన్నప్పటికీ భవిష్యత్తు కోసం ఈ కఠిన నిర్ణయం తప్పలేదని లేఖలో స్పష్టం చేశారు.

### బీఆర్ఎస్ అంతర్గత పరిస్థితి..

అసెంబ్లీ ఎన్నికల ఓటమి తర్వాత పార్టీలో నాయకత్వ పరంగా కొంత గందరగోళం నెలకొంది. పార్టీ అధ్యక్షుడు కేసీఆర్ క్రియాశీలకంగా లేకపోవడం కేటీఆర్, హరీష్‌రావుల మధ్య సమన్వయం లోపించడం వంటి అంశాలు పార్టీని బలహీనపరుస్తున్నట్లు విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. అధికార కాంగ్రెస్ పార్టీ చేపట్టిన ‘ఆపరేషన్ ఆకర్ష్’ బీఆర్ఎస్‌కు పెద్ద తలనొప్పిగా మారింది. చాలామంది ఎమ్మెల్యేలు, కీలక నేతలు పార్టీని వీడి కాంగ్రెస్‌లో చేరుతున్నారు. ఇది కార్యకర్తల మనోధైర్యాన్ని దెబ్బతీసే అవకాశం ఉంది.

అంతే కాకుండా పార్టీ నాయకురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత బహిరంగంగానే పార్టీ అధిష్టానంపై వ్యతిరేక రాగం పాడుతున్నారు. ‘లిల్లీపుట్ నాయకులు’ అంటూ ఆమె చేసిన వ్యాఖ్యలు పార్టీలో అంతర్గత విబేధాలను స్పష్టం చేస్తున్నాయి. ఫోన్ ట్యాపింగ్, కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతి ఆరోపణలు, భూముల వ్యవహారాలపై ప్రభుత్వం విచారణలు వేగవంతం చేయడం, కేసులు నమోదు చేయడం బీఆర్ఎస్ నాయకులను ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. నాయకుల వలసలు, అంతర్గత కలహాలు, కేసుల భయంతో కార్యకర్తలు గందరగోళంలో ఉన్నారు. పార్టీ భవిష్యత్తుపై స్పష్టత లేకపోవడంతో చాలామంది సైలెంట్ అయ్యారు. ఈ పరిణామాలన్నీ బీఆర్ఎస్‌ను ఒక క్లిష్ట పరిస్థితిలోకి నెట్టాయి.

# కాళేశ్వరం రిపోర్టుతో అటెన్షన్

ప్రయత్నం చేస్తున్నారని బీఆర్ఎస్ నేతలు అనుమానిస్తున్నర్నా. కాళేశ్వరం ప్రాజెక్టు అనేది మేడిగడ్డ బ్యారేజీ మాత్రమే కాదని కానీ కాంగ్రెస్ పార్టీ మొత్తం కాళేశ్వరం కూలిపోయిందన్న ప్రచారాన్ని విస్తృతంగా చేస్తోందని కేసీఆర్ భావిస్తున్నారు. అందుకే కాంగ్రెస్ కుట్రలను రాజకీయందా ఎదుర్కోవాల్సి ఉందన్నారు.స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపు కష్టంగా మారిందని అందుకే కాళేశ్వరం నివేదిక పేరుతో హడావుడి చేస్తున్నారన్న అభిప్రాయాన్ని కేసీఆర్ వ్యక్తం చేసినట్లుగా తెలుస్తోంది. జస్టిస్ ఘోష్ కమిషన్ రిపోర్టు కేబినెట్ ముందుకు రాక ముందే మీడియాలో ప్రచారం కావడంపై కుట్ర ఉందని కేసీఆర్ అనుమానిస్తున్నారు. బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నేతలపై తప్పుడు ప్రచారం చేసేందుకే కమిటీ రిపోర్టును లీక్ చేశారన్న అభిప్రాయం వినిపస్తోంది. కాళేశ్వరం పేరుతో బీఆర్ఎస్ పై కుట్రలు చేస్తున్నారని ప్రభుత్వం తీరును ప్రజల్లోకి తీసుకెళ్లాలని కేసీఆర్ పార్టీ నేతలుక సూచించారు. కాళేశ్వరం నుంచి లక్ష ఎకరాలకు నీళ్లిచ్చామని ప్రజలు ఈ అంశాలను మర్చిపోరని కేసీఆర్ అభిప్రాయపడ్డారు.

### కాళేశ్వరం రిపోర్టులో ఏముందంటే.?

కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అక్రమాలకు మాజీ సీఎం కేసీఆర్ జవాబుదారు అని జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ప్రభుత్వానికి సమర్పించిన నివేదికలో పేర్కొంది. కేసీఆర్ మాజీ మంత్రులు హరీష్ రావు, ఈటల రాజేందర్ కూ బాధ్యత ఉందని తెలిపింది. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణాన్ని క్యాబినెట్ ఆమోదం లేకుండా చేపట్టారని అప్పటి నీటిపారుదల మంత్రి హరీష్ రావు, అప్పటి ఆర్థిక మంత్రి ఈటల రాజేందర్‌లు సైతం దీనికి బాధ్యులు అని కాళేశ్వరం కమిషన్ నివేదించింది. ప్రభుత్వం ఏర్పాటుచేసిన పీసీ ఘోష్ కమిషన్‌ను ఉద్దేశపూర్వకంగా తప్పుదారి పట్టించినందుకు, తప్పుడు నివేదికలు ఇచ్చినందుకు ఆరుగురు నీటిపారుదల ఇంజనీర్లపై చట్టపరమైన చర్య తీసుకోవాలని కూడా తమ నివేదికలో కమిషన్ సిఫార్సు చేసింది. రాజకీయంగా వ్యక్తిగత నిర్ణయాలు, ఇటు నిర్మాణ సంస్థతో ప్రాజెక్టు అధికారులు కుమ్మక్కు కావడంతో మేడిగడ్డ బ్యారేజీ నిర్మాణంలో జాధనం దుర్వినియోగమైందని కమిషన్ నివేదికలో పేర్కొంది. తెలంగాణ కేబినెట్ భేటీలో జస్టిస్ పీసీ ఘోష్ నివేదికపై సమగ్రంగా చర్చ జరగనుంది.

# ఆదాయం కాదు, ఆరోగ్యమే ముఖ్యం

మంత్రులు కొల్లు రవీంద్ర, కొండపల్లి శ్రీనివాస్, అధికారులు ఈ సమీక్షకు హాజరయ్యారు. ప్రస్తుతం ఉన్న బార్ పాలసీ గడువు తీరడంతో సెప్టెంబర్ 1 నుంచి కొత్త పాలసీ రావాల్సి ఉంది. అధికారులు సీఎంకు కొత్త పాలసీపై ప్రతిపాదనలు వివరించారు. మంత్రివర్గ ఉపసంఘం ఇచ్చిన నివేదిక, ప్రతిపాదనల ఆధారంగా కొత్త పాలసీకి రూపకల్పన చేసినట్లు సీఎం తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రంలో 840 బార్లు ఉన్నాయి. కొత్త పాలసీలో లాటరీ పద్దతి ద్వారా బార్లకు అనుమతులు ఇస్తారు. 50 వేల లోపు జనాభా ఉంటే రూ. 35 లక్షలు, 5 లక్షల లోపు జనాభా ఉంటే రూ. 55 లక్షలు, 5 లక్షల పైన జనాభా ఉంటే రూ. 75 లక్షల చొప్పున లైసెన్స్ ఫీజు ఏడాదికి పెట్టాలనే ప్రతిపాదన మంత్రివర్గ ఉప సంఘం నుంచి వచ్చింది. కొత్త పాలసీలో అప్లికేషన్ ఫీజ్, లైసెన్స్ ఫీజు ద్వారా రూ. 700 కోట్ల ఆదాయం వస్తుందని అధికారులు అంచనా వేశారు. ప్రతి బార్ కు కనీసం 4 అప్లికేషన్లు రావాలనే నిబంధనను పెట్టనున్నారు. బార్ పాలసీలో కూడా గీత కులాలకు 10 శాతం బార్లు దక్కేలా చూడాలని సీఎం స్పష్టం చేశారు. లిక్కర్ షాపుల్లో ఎలా అయితే 10 శాతం వారికి ఇచ్చారో అదే విధంగా బార్లలో కూడా ఆ వర్గాలకు బార్లు కేటాయించనున్నారు.పొరుగు రాష్ట్రాల పరిధిలో సరిహద్దుల్లో లిక్కర్ సేల్స్ పెరగడానికి గల కారణాలు కూడా అధికారులు సీఎంకు వివరించారు. ఏపీలో రేట్లు తగ్గడం, అన్ని బ్రాండ్లు అందుబాటులో ఉండడం, నాణ్యమైన మద్యం దొరకడంతో మన రాష్ట్రానికి చెందిన మద్యం వినియోగదారులు ఇక్కడే మద్యం కొనుగోలు చేస్తున్నారని చెప్పారు. దీంతో మన దగ్గర సరిహద్దు ప్రాంతాల్లోని లిక్కర్ షాపుల్లో సేల్స్ పెరగగా పొరుగు రాష్ట్రాల్లో సేల్స్ తగ్గాయని అధికారులు తెలిపారు. గతంలో మన రాష్ట్రంలో నాణ్యమైన మద్యం లేకపోవడం, అధిక ధరలు, మంచి బ్రాండ్లు దొరక్క పోవడం వల్ల ఇక్కడి వాళ్లు పొరుగు రాష్ట్రాలకు వెళ్లి మద్యం తాగేవాళ్లని గుర్తు చేశారు. మరోవైపు దీన్ని సొమ్ము చేసుకోవడానికి అక్రమంగా ఇతర రాష్ట్రాల నుంచి మద్యం తెచ్చే వాళ్లని ఇప్పుడు ఆ సమస్య లేకుండా పోయిందని అధికారులు చెప్పారు. అయితే ఇప్పుడు 12 జిల్లాల్లో పూర్తి స్థాయిలో ఐడీ లిక్కర్ ఫ్రీ జిల్లాలుగా ప్రకటించామని ఈ నెలలో మరో 8 జిల్లాలను ఇల్లిసిట్లీ డిస్టిల్డ్ లిక్కర్ ( ఐడి లిక్కర్) ఫ్రీ జిల్లాలుగా ప్రకటిస్తామని చెప్పారు. సెప్టెంబర్ నాటికి మిగిలిన 6 జిల్లాలను కూడా ఐడీ లిక్కర్ ఫ్రీ జిల్లాలుగా ప్రకటిస్తామని అధికారులు సీఎంకు తెలిపారు.

# భారత లైఫ్ సైన్సెస్ రాజధానిగా హైదరాబాద్

కృషి ఫలితంగా ఇది సాధ్యమైంది. ఈ విజయం సాధించడంలో అహర్నిశలు శ్రమించిన మంత్రి శ్రీధర్ బాబుకి, జయేష్ రంజన్ కి, ఇందులో పాలుపంచుకున్న అధికారులందరికీ నా హృదయపూర్వక అభినందనలు. ఎలీ లిల్లీ సంస్థ నాయకత్వాన్ని, ఉద్యోగులను హైదరాబాద్ నగరానికి సాదరంగా ఆహ్వానిస్తున్నాం. తెలంగాణపై నమ్మకం ఉంచి, అండగా నిలిచి అన్ని విధాలుగా మద్దతు ఇస్తున్నందుకు పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులు, కార్పొరేషన్లకు, కంపెనీలకు ధన్యవాదాలు.

### భారత లైఫ్ సైన్సెస్ రాజధానిగా హైదరాబాద్

నేడు ప్రారంభమైన ఎలీ లిల్లీ నూతన కేంద్రం ఆ సంస్థ గ్లోబల్ కార్యకలాపాలను వేగవంతం చేయడానికి దోహదం చేస్తుంది. ఈ టెక్నాలజీ, ఇన్నొవేషన్ సెంటర్ ప్రపంచ వ్యాప్తంగా రోగుల సమస్య పరిష్కారాల కోసం పరిశోధనలో కీలక పాత్ర పోషించనుంది. ఎలీ లిల్లీ సంస్థను హైదరాబాద్ నగరంలో ఏర్పాటు చేయడమంటే ఈ సిటీ ఘనతను ప్రపంచానికి చాటి చెప్పినట్లే. హైదరాబాద్ నగరంలో టాలెంట్, లీడర్‌షిప్, విజన్ ఉంది. ఇక్కడ మంచి పాలసీలు, మౌలిక సదుపాయాలు ఉన్నాయి. అందుకే ఎలీ లిల్లీ లాంటి గ్లోబల్ సంస్థకు హైదరాబాద్ అనుకూలమైన కేంద్రంగా మారింది. భారత లైఫ్ సైన్సెస్ రాజధానిగా హైదరాబాద్ ఇప్పటికే గుర్తింపు పొందింది. ఇక్కడ 2000కు పైగా లైఫ్ సైన్సెస్ కంపెనీలు ఉన్నాయి. 200కి పైగా అంతర్జాతీయ సంస్థలు హైదరాబాద్ నుంచి తమ కార్యకలాపాలను నిర్వహిస్తున్నాయి.

### తెలంగాణలోనే 40 శాతం ఉత్పత్తి

భారత్‌లో ఫార్మాస్యూటికల్ ఉత్పత్తిలో తెలంగాణలోనే సుమారు 40 శాతం జరుగుతోంది. ప్రపంచ వ్యాప్తంగా ఉత్పత్తి అవుతున్న ప్రతి 3 వ్యాక్సిన్లలో ఒకటి హైదరాబాద్‌లో అభివృద్ధి చేయడం, లేదా తయారు కావడం రాష్ట్రానికి గర్వకారణం. హైదరాబాద్‌లోని జీనోమ్ వ్యాలీ, భారతదేశంలోని అతిపెద్ద లైఫ్ సైన్సెస్ పరిశోధన డెవలప్‌మెంట్ సముదాయంగా నిలిచింది. ప్రపంచంలోని అగ్రశ్రేణి ఫార్మాస్యూటికల్, బయోటెక్నాలజీ సంస్థలు హైదరాబాద్ నగరాన్ని అత్యంత ప్రాధాన్యత కలిగిన గమ్యస్థానంగా భావిస్తున్నాయి.

ఎలీ లిల్లీ సంస్థ రాకతో లైఫ్ సైన్సెస్ రంగంలో తెలంగాణ మరో మెట్టుకు చేరుకుంది. మధుమేహం, ఆంకాలజీ, ఇమ్యునాలజీ, న్యూరోసైన్స్ రంగాలలో ఎలీ లిల్లీ సంస్థ చేస్తున్న కృషి గేమ్ ఛేంజర్ గా నిలిచిపోతుంది. ఆ సంస్థ కృషి మిలియన్ల మంది జీవితాలను రక్షించడానికి తోడ్పడింది. మా ప్రభుత్వం మీకు అండగా ఉంటుంది. ప్రభుత్వ పారదర్శకత విధానాలతో అభివృద్ధి, ఆవిష్కరణలకు అనువైన వాతావరణం కల్పిస్తాం. హైదరాబాద్‌లో పని చేయనున్న ఎలీ లిల్లీ ఉద్యోగులు ఇప్పుడు మా కుటుంబ సభ్యులు అయ్యారు. మీరు హైదరాబాద్ నుంచి గ్లోబల్ హెల్త్‌కేర్ భవిష్యత్తును తీర్చిదిద్దనున్నారు. మీ సహకారంతో, తెలంగాణను ప్రపంచంలో ఆరోగ్య సంరక్షణ ఆవిష్కరణలకు నంబర్ వన్ హబ్‌గా తీర్చిదిద్దుతాం. కొత్త ఆవిష్కరణలు చేద్దాం, ప్రజల జీవితాలను మారుద్దామని’ సీఎం రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు.

# కుంకీ ఏనుగుల తొలి ఆపరేషన్

విజయవంతం
నుంచి ఆదివారం ఉదయం వరకు ఈ ఆపరేషన్‌ను కొనసాగించారు. ఇందులో భాగంగా కర్ణాటక నుంచి ప్రత్యేకంగా తెప్పించిన కృష్ణ, జయంత్, వినాయక అనే మూడు కుంకీ ఏనుగులను రంగంలోకి దించారు. ఈ కుంకీలు అడవి ఏనుగుల గుంపును ధైర్యంగా ఎదుర్కొని, తిరిగి అటవీ ప్రాంతంలోకి వెళ్లేలా దారి మళ్లించాయని అధికారులు తెలిపారు. ముఖ్యంగా ‘కృష్ణ’ అనే కుంకీ చాలా చురుగ్గా వ్యవహరించి ఆపరేషన్ విజయవంతం కావడంలో కీలక పాత్ర పోషించిందని వారు పేర్కొన్నారు. మొగిలి ప్రాంతంలో 15 రోజులుగా ఏనుగుల సంచారం ఉన్న సమాచారంతో అధికారులు ఈ ఆపరేషన్ చేపట్టారు. కర్ణాటక నుంచి కుంకీ ఏనుగులను తీసుకువచ్చిన అనంతరం రెండు నెలల శిక్షణ తర్వాత మొదటి ఆపరేషన్ విజయవంతంగా చేపట్టడం ఆనందాన్నిచ్చింది. ఏనుగుల సంచారంతో ఇబ్బందులు పడుతున్న సరిహద్దు ప్రాంతాల రైతులు, ప్రజలకు ఈ ఆపరేషన్ భరోసా ఇస్తుంది.

ముఖ్యమంత్రి చంద్రబాబు గారి నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ఏనుగుల గుంపు నుంచి పంటలను, ప్రజల ప్రాణాలు కాపాడే దిశగా ప్రణాళికాబద్ధంగా పని చేస్తుంది అనడానికి కుంకీలతో చేపట్టిన ఆపరేషన్ తొలి అడుగు. ఈ ఆపరేషన్ లో పాల్గొన్న అటవీ అధికారులకు, మావటిలు, కావడిలకు అభినందనలు తెలియజేస్తున్నాను. అలాగే అడిగిన వెంటనే కుంకీ ఏనుగులు రాష్ట్రానికి ఇచ్చి సహకరించిన కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య గారికి, ఆ రాష్ట్ర అటవీ పర్యావరణ శాఖ మంత్రి ఈశ్వర్ ఖండ్రే గారికి మరోసారి కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. తదుపరి ఆపరేషన్ పుంగనూరు అటవీ ప్రాంతంలో చేపట్టేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు” అని పవన్ కల్యాణ్ వెల్లడించారు.

# బీసీ రిజర్వేషన్లపై బీజేపీ అధ్యక్షుడి కీలక ప్రకటన

రామచందర్ రావు స్పష్టం చేశారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, ఢిల్లీలో కాంగ్రెస్ చేపట్టిన ధర్నాపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వానికి స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించే ఉద్దేశం లేదని విమర్శించారు. హైదరాబాద్‌లో చేసినట్లే ఢిల్లీకి వెళ్లి నాటకాలు చేస్తున్నారని విమర్శించారు. బీసీలకే 42 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తామంటే బీజేపీ పూర్తి మద్దతు ఇస్తుందని ఆయన తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వానికి బీసీ రిజర్వేషన్లు ఇవ్వడం ఇష్టం లేదని ఆరోపించారు. 42 శాతం రిజర్వేషన్లు బీసీలకు ఇస్తామని చెప్పి, అందులో 10 శాతం ముస్లింలకు ఇస్తే అణగారిన వర్గాలకు అన్యాయం జరుగుతుందని మండిపడ్డారు. రిజర్వేషన్లను బీజేపీ అడ్డుకుంటోందని ప్రచారం చేస్తోన్న కాంగ్రెస్ పార్టీని బీసీలు నమ్మరని ఆయన అన్నారు.

# లోకేష్ పిల్లవాడు - బనకచర్లను అడ్డుకుని తీరుతాం

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) ఆంధ్రప్రదేశ్ మంత్రి నారా లోకేష్‌ను “చిన్నపిల్లోడు”, “అవగాహన లేనివాడు” అని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి విమర్శించారు. లోకేష్ చేసిన వ్యాఖ్యలపై స్పందించేందుకు తనకు ఆసక్తి లేదని లోకేష్ అలా మాట్లాడినట్లుగా తెలియగానే తనకు నవ్వు వచ్చిందని అన్నారు. బనకచర్ల ప్రాజెక్టు విషయంలో అవసరమైతే కేంద్ర ప్రభుత్వంతో కూడా పోరాడతామని కోమటిరెడ్డి తెలిపారు. నల్లగొండ క్యాంప్ కార్యాలయంలో కోమిటరెడ్డి మీడియాతో మాట్లాడారు. బనకచర్ల ప్రాజెక్టు విషయంలో “చాప్టర్ క్లోజ్” అని, దీనిని అడ్డుకునేందుకు తాము కట్టుబడి ఉన్నామని స్పష్టం చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో అవినీతి జరిగిన విషయం అందరికీ తెలుసునని, ఇప్పటికే కొందరిపై చర్యలు తీసుకున్నామని చెప్పారు. ఈ విషయంపై కమిషన్ నివేదిక ఆధారంగా కేబినెట్‌లో చర్చించి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. ఫోన్ ట్యాపింగ్ ఆరోపణలపై కూడా స్పందించారు. తన ఫోన్ నంబర్ ఎప్పటినుంచో ఒకటే ఉందని, దాన్ని మార్చలేదని అన్నారు. ఈ వ్యవహారంలో ఏం జరగాలో అది జరుగుతుందని వ్యాఖ్యానించారు. తన ఫోన్ ట్యాప్ అవలేదని అనుకుంటున్నానన్నారు. బీఆర్ఎస్ పార్టీలో ఐదు గ్రూపులు ఉన్నాయని కోమటిరెడ్డి వ్యాఖ్యానించారు. కేసీఆర్, కవిత, హరీష్ రావు, సంతోష్, కేటీఆర్ గ్రూపులు ఉన్నాయన్నారు. ఈ పార్టీ భవిష్యత్తులో ఉనికిలో ఉండదని కోమటిరెడ్డి వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్ గురించి మాట్లాడడం వృథా అని అన్నారు. కవిత బీసీల గురించి మాట్లాడటంపై విమర్శిస్తూ, గత పదేళ్లలో ఆమెకు బీసీలు గుర్తుకు రాలేదని ప్రశ్నించారు.ఇళ్ల నిర్మాణం ప్రారంభం కాకపోవడంతో మొదటి ఏడాది నేను బాధపడ్డానని ఇప్పుడు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం జరుగుతుంటే ఆనందంగా ఉందని తెలిపారు. కాంగ్రెస్ పార్టీలో అందరూ సమానమేనని జిల్లాలోని అన్ని సాగునీటి ప్రాజెక్ట్ లను ఏడాదిలో పూర్తి చేస్తామని ప్రకటించారు. ఢిల్లీ వెళ్లి మంగళవారం కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని కలుస్తున్నానని గ్రీన్ ఫీల్డ్ హైవే లో ఫోర్త్ సిటీ కలపాలని సీఎం చెప్పారన్నారు. దీనిపై కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ కి రిప్రజెంటేషన్ ఇవ్వబోతున్నామన్నారు. డిండి ప్రాజెక్టు టెండర్ ప్రక్రియ పూర్తయిందని, జిల్లా ప్రాజెక్టులకు సంబంధించిన కాలువల లైనింగ్ ఏడాదిలో పూర్తి చేస్తామని తెలిపారు. రైతు భరోసా పథకం కింద 100 ఎకరాలు ఉన్నవారికి కూడా సాయం అందించామని చెప్పారు. ఎంజీ యూనివర్సిటీలో కొత్త భవనాల నిర్మాణం, నార్కెట్‌పల్లి పెద్ద చెరువును వేణుగోపాలస్వామి పేరుతో మినీ ట్యాంక్ బండ్‌గా మార్చడం, క్యాంపు కార్యాలయానికి “ఇందిరా భవన్”గా నామకరణం చేశామన్నారు.

# భావోద్వేగానికి లోనైన జగ్గారెడ్డి

**సంగారెడ్డి** కార్యకర్తల సమావేశంలో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి కంటతడి పెట్టారు. తన అనుచరుడు చేర్యాల ఆంజనేయులు 2017లో రాహుల్ సభ కోసం భూమిని విక్రయించారని చెబుతూ ఎమోషనల్ అయ్యారు. నవంబర్ లో కార్యకర్తలు అందరిని కలుస్తానని అన్నారు. కార్యకర్తల కుటుంబాల్లో ఆడపిల్లల పెళ్లికి సహాయం చేస్తానని అన్నారు.

# అపోలోలో నూతన క్లబ్‌లు ప్రారంభం

### కొత్త క్లబ్‌ల లోగోలను ఆవిష్కరించిన వీసీ డా. హెచ్. వినోద్ భట్

**చిత్తూరు,** విద్యార్థుల ప్రతిభను మరింత మెరుగుపర్చేందుకు, అపోలో యూనివర్సిటీ మరో మూడు కొత్త క్లబ్‌లను ప్రారంభించింది. యూనివర్సిటీ ప్రాంగణంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో వైస్ ఛాన్సలర్ డా. హెచ్. వినోద్ భట్ కోడింగ్ క్లబ్, కెరీర్ కాటలిస్ట్ క్లబ్, పబ్లిక్ స్పీకింగ్ క్లబ్‌లను అధికారికంగా ప్రారంభించి, వాటి ప్రత్యేక లోగోలను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా డా. వినోద్‌భట్ మాట్లాడుతూ, విద్యార్థులు పాఠ్యపుస్తకాల పరిమితిని దాటి, ప్రాక్టికల్ నైపుణ్యాలను కూడా సాధించాలని. క్లబ్‌లు యువతలో సృజనాత్మకతను పెంపొందించి, నాయకత్వ లక్షణాలను అభివృద్ధి చేసే వేదికలు కావాలని పేర్కొన్నారు. అలాగే సమకాలీన యుగంలో కోడింగ్, కమ్యూనికేషన్, కెరీర్ ప్రిపరేషన్ ముఖ్యమైందని, విద్యార్థులు వీటిపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందని చెప్పారు. కార్యక్రమంలో యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎం. పోతరాజు, స్టూడెంట్ ఎఫైర్స్ అసిస్టెంట్ డైరెక్టర్ డా. ఎస్.ఎస్. షాని, నూతన క్లబ్‌ల ఫ్యాకల్టీ కో–ఆర్డినేటర్లు డాక్టర్ ఎ.బి. మంజు, డాక్టర్ సి. పక్కిరయ్య, మహ్మద్ ఇమ్రాన్, డీన్‌లు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థులు నూతన క్లబ్‌ల లక్ష్యాలు, కార్యచరణల గురించి వివరించడంతో పాటు ప్రదర్శనలు నిర్వహించారు.విద్యార్థుల ప్రతిభను గుర్తించి, వ్యక్తిత్వ వికాసానికి దోహదపడే చర్యల్లో అపోలో యూనివర్సిటీ ఏర్పాటు చేసిన క్లబ్‌లు కీలక పాత్ర పోషిస్తున్నాయని అధ్యాపకులు అభిప్రాయపడ్డారు.

### అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్

# గోల్ఫ్ రిసార్ట్ వద్ద భారీ భద్రతా వైఫల్యం

### - ట్రంప్ గోల్ఫ్ క్లబ్‌వైపు దూసుకొచ్చిన విమానం.. రంగంలోకి దిగిన ఫైటర్ జెట్స్

**న్యూ ఢిల్లీ** ;అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ గోల్ఫ్ రిసార్ట్ వద్ద భారీ భద్రతా వైఫల్యం బయటపడింది. భారీ భద్రతా వైఫల్యం.. ట్రంప్ గోల్ఫ్ క్లబ్‌వైపు దూసుకొచ్చిన విమానం.. రంగంలోకి దిగిన ఫైటర్ జెట్స్ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ గోల్ఫ్ రిసార్ట్ వద్ద భారీ భద్రతా వైఫల్యం బయటపడింది. న్యూజెర్సీ లో గోల్ఫ్ క్లబ్ సమీపంలో నోఫ్లైజోన్ ప్రాంతంలోకి ఓ ప్రయాణికుల విమానం దూసుకొచ్చింది. వెంటనే అప్రమత్తమైన ఫైటర్ జెట్స్ రంగంలోకి దిగాయి.ఫాక్స్ న్యూస్ ప్రకారం.. ఆదివారం మధ్యాహ్నం 12:50 గంటల ప్రాంతంలో (స్థానిక కాలమానం ప్రకారం) ఈ ఘటన చోటు చేసుకుంది. బెడ్‌మినిస్టర్‌లోని ట్రంప్ గోల్ఫ్ సమీపంలో నోఫ్లైజోన్ ప్రాంతంలోకి ప్రయాణికుల విమానం ఒక్కసారిగా దూసుకొచ్చింది. విమానం రాకను గమనించిన ఫైటర్‌జెట్స్ వెంటనే రంగంలోకి దిగి ఆ విమానాన్ని అడ్డుకున్నాయి. ఓ రకమైన జ్వాలతో ప్రయాణికుల విమానం పైలట్‌ను అప్రమత్తం చేశాయి. దాన్ని నోఫ్లై జోన్ నుంచి పంపించేశాయి. ఆ సమయంలో అధ్యక్షుడు ట్రంప్ గోల్ఫ్ క్లబ్ రిసార్ట్‌లోనే ఉన్నారని నార్త్ అమెరికన్ ఏరోస్పేస్ డిఫెన్స్ కమాండ్ )ను ఉటంకిస్తూ ఫాక్స్ న్యూస్ నివేదించింది. ఈ ఘటనపై అధికారులు దర్యాప్తు చేపట్టినట్లు పేర్కొంది.

# బాపట్ల జిల్లా బల్లికురవలో ఘోర ప్రమాదం

- గ్రానైట్ క్వారీలో బండరాళ్లు మీద పడడంతో ఆరుగురు కార్మికులు దుర్మరణం
- పదిమందికి తీవ్రగాయాలు.. నలుగురి పరిస్థితి ఆందోళనకరం

**బాపట్ల** బాపట్ల జిల్లా బల్లికురవలో ఘోర ప్రమాదం చోటు చేసుకుంది. గ్రానైట్ క్వారీలో బండరాళు మీద పడడంతో ఆరుగురు కార్మికులు దుర్మరణం చెందారు.ఇప్పటివరకు నాలుగు మృతదేహాలు వెలికితీశారు. బండరాళ్ల కింద చిక్కుకున్న మరో ఇద్దరి మృతదేహాలను బయటకు తీసేందుకు సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. ప్రమాదం జరిగిన సమయంలో క్వారీలో 16 మంది కార్మికులు పనిచేస్తున్నారు. ఘటనలో తీవ్రంగా గాయపడిన మరో 10 మంది కార్మికులను మెరుగైన వైద్యం నిమిత్తం నరసరావుపేట ఆసుపత్రికి తరలి ంచారు. వారిలో నలుగురి పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నట్లు వైద్యులు వెల్లడించారు. క్వారీ యాజమాన్యం భద్రతా చర్యలు చేపట్టలేదని అధికా రులు ప్రాథమికంగా నిర్ధారించారు. పదహారు మంది కార్మికులు క్వారీలో పని చేస్తుండగా అకస్మాత్తుగా బండరాళ్లు కిందపడ్డాయని ప్రత్యక్ష సాక్షులు వెల్లడించారు. దీంతో ఆరుగురు కార్మికులు రాళ్ల కింద పడి నలిగిపోయారని వివరించారు. చనిపోయిన వారంతా ఒడిశాకు చెందిన వారని అధికారులు తెలిపారు. ప్రమాదం గురించి సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు, రెస్క్యూ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు.ఈ సంఘటనపై ఆందోళన వ్యక్తం చేసిన ముఖ్యమంత్రి ఎన్. చంద్రబాబునాయుడు అధికారుల నుండి వివరణా త్మక నివే దికను కోరారు. గాయపడిన వారికి నాణ్యమైన వైద్య సంరక్షణ అందించాలని ఆదేశించారు. ప్రమాదానికి గల కారణాలపై సమగ్ర దర్యాప్తు జరపాలన్నారు. క్వారీ కూలి ప్రాణనష్టం తనను తీవ్రంగా కలచివేస్తుందని మంత్రి నారా లోకేష్ అన్నారు. ‘ప్రభుత్వం మృతుల కుటుం బాలకు అండగా నిలుస్తుంది‘ అని ఆయన తన సంతాపాన్ని వ్యక్తం చేస్తూ, గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని కోరుకుంటున్నాను. మంత్రులు అనగాని సత్య ప్రసాద్, గొట్టిపాటి రవి కుమార్ ఈ సంఘటనపై విచారం వ్యక్తం చేశారు. బాధితులకు ఉత్తమ వైద్య సంరక్షణ అందించాలని అధికారులను కోరారు. కలెక్టర్ మురళి సమగ్ర దర్యాప్తునకు ఆదేశించారు. రక్షణ, సహాయ చర్యలను పర్యవేక్షించాలని ఉమ్మడి, డివిజన్ స్థాయి అధికారులను ఆదేశించారు.

ప్రజాప్రశ్న



## రెబ్బెన గురుకులలో ముగ్గురు విద్యార్థినులకు అస్వస్థత

ఆసిఫాబాద్, : కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా రెబ్బెన మండలంలోని సాంఘిక సంక్షేమ గురుకుల వసతి గృహంలో పదవ తరగతి చదువుతున్న ముగ్గురు విద్యార్థినులు సోమవారం ఉదయం తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. వారిని వెంటనే బెల్లంపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అస్వస్థతకు కారణాలు ఇంకా తెలియాల్సి ఉంది. సంబంధిత అధికారులు వివరాలు సేకరిస్తున్నారు.

## ఫిర్యాదులు తక్షణమే పరిష్కరించాలి

నిర్మల్, : ప్రజా ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించాలి అని అదనపు కలెక్టర్ లు కిషోర్ కుమార్, ఫైజాన్ అహ్మద్ లు అన్నారు. సోమవారం ఉదయం 11 గంటల సమయంలో నిర్మల్ కలెక్టరేట్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా పిర్యాదుల విభాగంలో వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల పిర్యాదులను స్వీకరించారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రజల సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి వాటిని పరిష్కరించాలని అధికారులకు సూచించారు.

## జాబ్ క్యాలెండర్ పేరుతో మోసం



ఆదిలాబాద్, ఆగస్టు : జాబ్ క్యాలెండర్ పేరుతో నిరుద్యోగులను రేవంత్ రెడ్డి సర్కార్ మోసం చేసిందని బిఆర్ఎస్వి ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షులు ధరణి రాజేష్ ఆగ్రహం వ్యక్తం చేశారు. బిఆర్ఎస్ ఖానాపూర్ నియోజకవర్గ ఇంచార్జ్ భూక్యా జాన్సన్ నాయక్, బిఆర్ఎస్వి రాష్ట్ర అధ్యక్షులు గెల్లు శ్రీనివాస్ యాదవ్ ఆదేశాల మేరకు సోమవారం బిఆర్ఎస్వి నాయకులతో ర్యాలీ నిర్వహించి ఉట్నూర్ పట్టణ కేంద్రంలో అంబేద్కర్ గారికి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్, బిఆర్ఎస్వి నాయకులు సాజిద్ బాబా, శ్యామ్ టైగర్, జయ చంద్ర, నరేష్, సూర్య కాంత్ యాదవ్, దినేష్, కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు పరిసరాలు పరిశుభ్రం

ముథోల్, ఆగస్టు: జన్నారం మండలంలోని పోన్కల్ లో ఉన్న ప్రధాన రహదారి పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని గ్రామ ఈవో రాహుల్ తెలిపారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు రహదారి పక్కన వరదనీరు నిలవడంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. దీంతో పంచాయతీ కార్మికులు సోమవారం రోడ్డు పక్కన నీటి గుంతలను తొలగించినారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

## పారదర్శకతకే సోషల్ ఆడిట్

ఖానాపూర్, ఆగస్టు: ఉపాధి పనులలో పారదర్శకతకే సోషల్ ఆడిట్ నిర్వహించడం జరుగుతుందని జన్నారం మండల మార్కెట్ కమిటీ చైర్మన్ దుర్గం లక్ష్మీనారాయణ, రేండ్లగూడ, పోన్కల్ గ్రామాల ప్రత్యేక అధికారులు డాక్టర్ కస్తూరి శ్రీకాంత్, భానుచందర్ అన్నారు. సోమవారం ఆయా గ్రామాలలో నిర్వహించిన ప్రత్యేక గ్రామసభలలో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆడిట్ అధికారులు ఉపాధి హామీ పనులపై సమీక్షను నిర్వహించారు. ఆడిట్ రిపోర్టును నివేదిక రూపంలో ప్రభుత్వానికి అందజేస్తామని వారు వెల్లడించారు.

## మహా లింగార్చన పూజ

వేములవాడ, ఆగస్టు : వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి వారి ఆలయంలో శ్రావణమాస రెండవ సోమవారం సందర్భంగా ఉదయం మహన్యాస పూర్వక ఏకాదశ అభిషేక పూజలు అర్చకులు వేద పండితులు నిర్వహించారు. సాయంత్రం కల్యాణ మండపంలో మహా లింగార్చన పూజ కార్యక్రమాలు సైతం ఉంటాయని వెల్లడించారు.

## విద్యార్థులతో కలిసి భోజనం చేసిన మంత్రి అడ్లూరి

కరీంనగర్, ఆగస్టు : మంత్రి అడ్లూరి లక్ష్మణ్ విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఆయన కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం అలుగునూర్‌లోని గురుకుల పాఠశాలను సోమవారం సందర్శించారు. ఆయనతోపాటు తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకులాల సంస్థ కార్యదర్శి అలుగు వర్షిణీ ఉన్నారు. పాఠశాలలో విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాల గురించి మంత్రి ఆరా తీశారు. అనంతరం విద్యార్థులతో కలిసి మంత్రి అడ్లూరి లక్ష్మణ్ భోజనం చేశారు.

## సైనిక్ స్కూల్ ను సందర్శించిన కార్యదర్శి



చొప్పదండి, ఆగస్టు : తెలంగాణ గురుకుల విద్యాలయాల సంస్థ కార్యదర్శి అలుగు వర్షిని చొప్పదండి మండలం రుక్మాపూర్ సైనిక్ స్కూల్ ను సందర్శించారు. రాబోయే ఎన్‌డిఎ, జెఇఇ పరీక్షలలో విద్యార్థులు రాణించే విధంగా సన్నద్ధం చేయాలని ఆదేశించారు. విద్యార్థులు వ్యాయామం, యోగ, రన్నింగ్ చేసే తీరును పరిశీలించారు. స్పెషల్ అధికారి భీమయ్య, ప్రిన్సిపల్ కాళహస్తి తదితరులు పాల్గొన్నారు.

## కరీంనగర్: కొత్త రేషన్ కార్డులు పంపిణీ చేసిన కాంగ్రెస్ నాయకులు

కరీంనగర్, ఆగస్టు : కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలంలోని పోరండ్ల గ్రామంలో సోమవారం మానకొండూర్ మీూా కవ్వంపెల్లి సత్యనారాయణ ఆదేశానుసారం గ్రామ శాఖ అధ్యక్షుడు చింతల తిరుపతి రెడ్డి, కాంగ్రెస్ నాయకుల నేతృత్వంలో లబ్ధిదారులకు కొత్త రేషన్ కార్డులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో లక్ష్మారెడ్డి, నర్సింహారెడ్డి, రమేష్, పర్శరాములు, బాపురెడ్డి, రేషన్ డీలర్లు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## రాజన్న గుడిలో భక్తుల సందడి

సిరిసిల్ల, ఆగస్టు : వేములవాడ శ్రీపార్వతి రాజరాజేశ్వరస్వామి వారి ఆలయానికి సోమవారం స్వామివారికి ఇష్టమైన రోజు కావడంతో సుదూర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ముందుగా ఆలయ పార్కింగ్ స్థలంలో వాహనాలను పార్కు చేసి, ధర్మగుండంలో పుణ్య స్నానాలు ఆచరించిన తర్వాత కోడె మొక్కులతో పాటు ఇతర మొక్కులు చెల్లించుకున్నారు. ముందుగా లక్ష్మీ గణపతి, నందీశ్వరుని దర్శించుకుని స్వామివారి సేవలో తరించారు. ఆలయం సందడిగా దర్శనమిస్తుంది.

## 20 మంది విద్యార్థినులకు ఫుడ్ పాయిజన్

సత్తుపల్లి, ఆగస్టు : కల్లూరు హాస్టల్లో ఉంటున్న 20 మంది విద్యార్థినులు సోమవారం ఫుడ్ పాయిజన్ కు గురై, ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. విద్యార్థినులు ఉదయం అల్పాహారంగా కిచిడీ తిన్నట్లు చెప్పారు. వెంటనే కడుపు నొప్పి, వాంతులు, విరోచనాలు కావడంతో హాస్టల్ నిర్వాహకులు స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, చికిత్స అందిస్తున్నారు. ఈ ఘటనపై కుటుంబ సభ్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## 7న పాలస్తీనా సంఘీభావ ర్యాలీకి సీపీఎం మద్దతు




ఖమ్మం, ఆగస్టు: ఏళ్లుగా ఇజ్రాయిల్. పాలస్తీనాపై చేస్తున్న అమానవీయ దాడులను వెంటనే నిలిపివేయాలని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు తమ్మినేని వీరభద్రం కోరారు. సోమవారం ఖమ్మం సుందరయ్య భవనంలో జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. పశ్చిమాసియా ప్రాంతంలోని పాలస్తీనాపై ఇజ్రాయిల్ కొన్నేళ్ల నుంచి యుద్ధం చేస్తూ, వేల మంది ప్రాణాలను బలిగొందని విమర్శించారు. ఆగస్టు 7న ఖమ్మంలో ఇజ్రాయిల్ యుద్ధోన్మాదాన్ని వ్యతిరేకిస్తూ పాలస్తీనా ప్రజలకు సంఘీభావాన్ని తెలియజేస్తూ నిర్వహిస్తున్న ర్యాలీకి సీపీఎం సంఘీభావం తెలుపుతోందన్నారు.

## ఖమ్మం వ్యవసాయ మార్కెట్లో నేటి ధరలు

మధిర, ఆగస్టు : ఖమ్మం వ్యవసాయ మార్కెట్లో సోమవారం మిర్చి, పత్తి ధరలు ఈ విధంగా ఉన్నాయి. క్వింటా ఏసీ మిర్చి ధర రూ. 14,150, క్వింటా నాన్ ఏసీ మిర్చి రూ.8,800, అటు క్వింటా పత్తి ధర రూ. 7,925 జెండా పాట పలికినట్లు మార్కెట్ కమిటీ సభ్యులు తెలిపారు. మార్కెట్ నడిచిన శుక్రవారంతో పోల్చితే ఏసీ మిర్చి ధర రూ. 150, పత్తి ధర రూ. 75 పెరగగా. అటు నాన్ ఏసీ మిర్చి ధర మాత్రం రూ. 700 తగ్గినట్లు వ్యాపారులు పేర్కొన్నారు.

## అనుమతి లేని బార్ షాపులపై చర్యలు తీసుకోవాలి

కొత్తగూడెం, ఆగస్టు : అధికారులు అనుమతులు లేని బార్ షాపులపై చర్యలు తీసుకోవాలని లంబాడీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు రాజేష్ నాయక్ డిమాండ్ చేశారు. సోమవారం కొత్తగూడెం మేదర బస్తీలో జరిగిన ఐక్య సంఘాల వేదిక సమావేశంలో మాట్లాడారు. జిల్లాలో అనుమతులున్న బార్ షాపులు 13 మాత్రమే ఉన్నాయని, కానీ అనుమతులు లేని బార్ షాపులు ఎక్కువగా ఉన్నట్లు చెప్పారు. బెల్ట్ షాపులకు బార్ షాపుల్లో లేని మద్యాన్ని తరలిస్తూ అధిక ధరలకు అమ్ముతున్నారన్నారు.

## సమస్యల పరిష్కారంలో ఏఐటీయూసీ విఫలం

ఇల్లందు, ఆగస్టు : సింగరేణి గుర్తింపు సంఘంగా ఎన్నికైన ఏఐటీయూసీ కార్మికుల సమస్యల పరిష్కారంలో విఫలం అయిందని, రానున్న ఎన్నికల్లో ఐఎన్టీయూసీ గెలుపు ఖాయం అని యూనియన్ సెక్రటరీ జనరల్ బి. జనక్ ప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాజకీయ జోక్యం వల్లే ఐఎన్టీయూసీని విమర్శించటం సిగ్గుచేటని పేర్కొన్నారు. 40 వేల మంది కార్మికుల రక్షణపై ఏఐటీయూసీకి ఉన్న బాధ్యత ఇదేనా అని ఎద్దేవా చేశారు. ఈ సంవత్సరం 35శాతం లాభాల వాటా ఇప్పిస్తామని, సొంతింటి కలను నిజం చేసి చూపిస్తామని పేర్కొన్నారు.

## రోడ్డు నిర్మాణం చేపట్టాలని రాస్తారోకో

ములుగు, ఆగస్టు : గుంతలుగా మారిన భద్రాచలం వెంకటాపురం రహదారిని వెంటనే పునర్నిర్మానం చేయాలని కోరుతూ ములుగు జిల్లా వెంకటాపురంలో సోమవారం సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో ధర్నా రాస్తారోకో నిర్వహించారు. వెంకటాపురం మండలం కేంద్రంలో అంబేద్కర్ విగ్రహం వద్ద ప్రధాన రహదారిపై సీపీఐ, సీపీఎం ఆధ్వర్యంలో రాస్తారోకో చేశారు. ఓవర్ లోడ్ ఇసుక లారీలతో గుంతలు పడి అధ్వానంగా మారిన రోడ్డుని డబల్ లేయర్ తో వెంటనే నిర్మించాలి అని డిమాండ్ చేశారు.

## వరంగల్‌లో 177 మంది బాల కార్మికుల విముక్తి

వరంగల్ వెస్ట్, ఆగస్టు : ఆపరేషన్ ముస్కాన్ 11 లో భాగంగా వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో 177 మంది బాల కార్మికులను రక్షించారు. ఇందులో 149 మంది బాలురు, 28 మంది బాలికలు ఉన్నారు. వీరిలో 97 మంది ఇతర రాష్ట్రాలకు చెందినవారు. వారిని బాలల సంరక్షణ గృహాలకు తరలించారని కమిషనర్ తెలిపారు. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు ఇది దోహదపడుతుందన్నారు.

## బట్టల షాపులో అగ్ని ప్రమాదం

భూపాలపల్లి, ఆగస్టు : జయశంకర్ భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండల కేంద్రంలో మారుతి బట్టల షాపులో అర్ధరాత్రి ప్రమాదవశాత్తు అగ్ని ప్రమాదం జరిగింది. ప్రమాదం లో పూర్తిగా ఫర్నిచర్, బట్టలు, నగదు కాలిపోయింది. ఇతర షాపులకు వ్యాపించకుండా మంటలు స్థానికులు ఆర్పారు. ఫైర్ ఇంజన్ వచ్చి పూర్తిగా మంటలను అదుపు చేసినప్పటికీ, అప్పటికే షాపు కాలి బూడిద అయింది. తనను ప్రభుత్వం ఆదుకోవాలని షాపు యజమాని శ్రీనివాస్ వేడుకున్నారు.

## అక్రమంగా తరలిస్తున్న నల్లబెల్లం పట్టివేత



డోర్నకల్, ఆగస్టు : మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ మండలం తొడేళ్ళ గూడెం గ్రామంలో సోమవారం అక్రమంగా బొలెరో వాహనంలో తరలిస్తున్న 30 క్వింటాళ్ల నల్ల బెల్లం, 5 క్వింటాల పట్టిక పోలీసులు పట్టుకున్నారు. బొలెరో వాహనాన్ని స్వాధీనం చేసుకొని ముగ్గురు పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## నిద్రిస్తున్న వ్యక్తిని చంపిన గుర్తుతెలియని వ్యక్తులు

మహబూబాబాద్, ఆగస్టు : మహబూబాబాద్ పట్టణం లోని లెనిన్ నగర్ లో హత్య కలకలం రేపింది. రాత్రి నిద్రిస్తున్న తూళ్ల ప్రభాకర్ (35) అనే వ్యక్తి ని గుర్తు తెలియని వ్యక్తులు బండరాయితో మోది చంపారు. క్లూస్ టీమ్ తో పోలీసులు విచారణ జరుపుతున్నారు. హత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది.

## శ్రావణమాసం సందర్భంగా దుర్గా మల్లేశ్వర స్వామికి పూజలు

మెదక్, ఆగస్టు : జిల్లాలోని ఏడుపాయల గుహలో నెలకొన్న దుర్గామల్లేశ్వర స్వామి దేవస్థానంలో శ్రావణ సోమవారం సందర్భంగా ఘనంగా పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో వేద మంత్రోచ్చారణల నడుమ స్వామివారికి ప్రత్యేక రుద్రాభిషేకం, ఆరాధన, అర్చన నిర్వహించారు. బిల్వపత్రాలతో విశేషంగా పూజలు చేసి, సుగంధ పుష్పాలతో స్వామివారిని అలంకరించారు. అనంతరం నైవేద్యం సమర్పించి, మంగళహారతులు ఇచ్చారు.

## గుర్తు తెలియని మృతదేహం లభ్యం

నర్సంపేట, ఆగసు: చిన్న శంకరంపేట సమీపంలోని అటవీ ప్రాంతంలో గుర్తు వ్యక్తి మృతదేహం సోమవారం లభ్యమయింది. చెట్ల పొదల మధ్య శవం కనిపించడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి వచ్చి విచారణ చేశారు. ఎవరైనా హత్య చేసి ఇక్కడ ప్రదేశారా? ఎలా మరణించాడు అన్న కోణంలో విచారణ చేస్తున్నారు.

## రూ.1. 94 లక్షలు మోసపోయిన యువకుడు

దుబ్బాక, ఆగస్టు : వర్క్ ఫ్రం హోం పేరిట 1. 94 లక్షలు చెల్లించి యువకుడు మోసపోయిన సంఘటన రామాయంపేటలో చోటుచేసుకుంది. రామయంపేటకు చెందిన సుజిత్ ఇన్స్టాగ్రామ్ లో వచ్చిన పోస్ట్ ఆధారంగా విడతలవారీగా 1. 94 లక్షలు చెల్లించాడు. ఉద్యోగం రాకపోవడంతో మోసపోయినట్లు గ్రహించి రామయంపేట పోలీసులకు సోమవారం ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## ఆరు తులాల బంగారం చోరీ

హుస్నాబాద్, ఆగస్టు : బంగారం చోరీ జరిగిన ఘటన హుస్నాబాద్ మండలం కేంద్రంలో చోటు చేసుకుంది. ఎస్సై లక్ష్మారెడ్డి వివరాల ప్రకారం జిల్లెలగడ్డకు చెందిన భూక్య మహేందర్ వారి ఇంట్లోని ఒక గదిలో రాజమ్మ నివాసం ఉండగా మరో గదికి తాళం వేసి ఉంటోంది. తెల్లవారు జామున తల్లి నిద్రలేచి చూసేసరికి ఇంటి తాళం తీసి ఉండటంతో కొడుకుకు సమాచారం ఇచ్చింది. అతడు ఇంటికి వచ్చి చూడగా ఇంట్లో దాచిన 6తులాల బంగారు అభరణాలు కనిపించకపోవడంతో ఫిర్యాదు చేశాడు.

## బీసీ రిజర్వేషన్ల అమలుకై ఢిల్లీ వెళ్లిన నాయకులు

దేవరకద్ర, ఆగస్టు : బీసీ రిజర్వేషన్ల అమలుకై ఛలో ఢిల్లీ పోరుబాట కార్యక్రమానికి దేవరకద్ర నియోజకవర్గ ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం నియోజవర్గ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ. తెలంగాణ రాష్ట్రం అసెంబ్లీలో బీసీలకు 42శాతం రిజర్వేషన్లను ఆమోదింప చేసిందని అన్నారు. కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగంలో షెడ్యూల్ 9లో పొందుపరిచి ఆమోదింప చేసి, బీసీలకు న్యాయం చేయాలని అన్నారు.

## విస్తృతంగా డ్రంక్ అండ్ డ్రైవ్, వాహనాల తనిఖీలు.!

గద్వాల, : జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలో అర్ధరాత్రివరకు ఎస్పీ ఆదేశాల మేరకు పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్, వాహన తనిఖీలు చేపట్టారు. కృష్ణవేణి చౌక్, బీరెల్లి సర్కిల్, కలెక్టర్ ఆఫీస్, వైయస్సార్ సర్కిల్, ఔటర్ రింగ్ రోడ్డులో ఈ తనిఖీలు నిర్వహించారు. ఈ చర్యల్లో పట్టణ ఎస్ఐ కళ్యాణ్ కుమార్, రూరల్ ఎస్ఐ శ్రీకాంత్ తదితర ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఎంపీ మల్లురవి బహిరంగంగా క్షమాపణ చెప్పాలి.!

కొల్లాపూర్, : కొల్లాపూర్ బహిరంగ సభలో మార్కెట్ కమిటీ చైర్మన్ దండు నరసింహ సభ అధ్యక్షుడిగా వ్యవహరిస్తుండగా, ఎంపీ మల్లురవి స్టేజ్ ఎక్కినందుకు ఆయనను అగౌరవపరిచారు. “నీవెవరు నాకు చెప్పేందుకు?” అనే అహంకారపూరిత వ్యాఖ్యలపై మదాసి మదారి కురువ సంఘం నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంపీ వెంటనే బహిరంగ క్షమాపణ చెప్పాలని, లేదంటే సోమవారం జిల్లావ్యాప్తంగా ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

## జూరాలకు కొనసాగుతున్న వరద... 6 గేట్లు ఎత్తివేత

వనపర్తి, వనపర్తి జిల్లా జూరాల ప్రాజెక్టుకు ఒక లక్ష క్యూసెక్కుల ఇన్ ఫ్లో కొనసాగుతున్నట్లు ప్రాజెక్టు అధికారి వెంకటేశ్వర్లు సోమవారం ఉదయం తెలిపారు. దీంతో 6 గేట్లు పైకెత్తి 90 వేల క్యూసెక్కుల ప్రవాహాన్ని దిగువకు వదులుతున్నట్లు పేర్కొన్నారు. ప్రాజెక్టు సామర్థ్యం 9 టీఎంసీలు కాగా 7 టీఎంసీల నీరు నిల్వఉంది. ఎగువ, దిగువ విద్యుత్ కేంద్రాల్లో విద్యుదుత్పత్తి కొనసాగుతున్నట్లు తెలిపారు.

## జంగమాయపల్లి ఉన్నత పాఠశాల యందు పోస్టర్ ఆవిష్కరణ

ఆలంపూర్, : పెద్దమందడి మండలంలోని బలిజపల్లి జంగమయ్యపల్లి ఉన్నత పాఠశాలలో విద్యార్థి వైజ్ఞాన్ మంతన్ కార్యక్రమం ప్రారంభమైంది. ఇది డిజిటల్ ఆధారిత సైన్స్ టాలెంట్ సర్చ్ పరీక్ష. 6-11 తరగతుల విద్యార్థులు ఇందులో పాల్గొనవచ్చు. మొదటి లెవెల్ పరీక్షలు అక్టోబర్ 28-30న, రెండవ లెవెల్ నవంబర్ 19 లేదా 23న జరుగుతాయి. జిల్లా కోఆర్డినేటర్‌గా వేణుగోపాల్ రెడ్డి నియమితులయ్యారు.

## నకిరేకల్‌లో ఘోర రోడ్డు ప్రమాదం

నకిరేకల్, : శ్రీశైలం వెళ్తున్న మహబూబాబాద్ బాబు నాయక్ తండా వాసుల మినీ బస్సు నకిరేకల్ వద్ద అదుపుతప్పి ప్రమాదానికి గురైంది. ఈ ఘటనలో ఒకరు మృతి చెందగా, 15 మంది తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు గాయపడ్డవారిని నకిరేకల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# జగమంత సంతోషం... గంగపుత్ర బోనాలు

- లోక కళ్యాణార్థం బోనమెత్తిన జంట నగరాల గంగపుత్రులు
- తెలంగాణ నగర గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో బోనాలు
- మహంకాళి అమ్మవారి సామూహిక బోనాల జాతర
- అంగరంగ వైభవంగా బోనాల పండుగ







**అఫ్జల్ గంజ్ (ప్రశ్న న్యూస్)** హైదరాబాద్, సికింద్రాబాద్ నగరాల్లో ఉన్న స్థానిక గంగ పుత్రులు మహంకాళి అమ్మవారిని దర్శించుకుని, బోనాలు సమర్పించడం సంప్రదాయం. శ్రావణ మాసం ఆదివారం నగర గంగ పుత్ర సంఘం, అఫ్జల్ గంజ్, హైదరాబాద్ ఆవరణలో ఉన్న మహంకాళి అమ్మవారి దేవాలయంలో అంగరంగ వైభవంగా బోనాలు సమర్పించారు. అమ్మవారి దేవాలయాన్ని బోనాలను గంగ పుత్రుల సాంస్కృతికత ప్రతిబింబించేలా వినూత్నంగా అలంకరించారు. అమ్మవారికి వెండి కిరీటం ఆభరణాలతో అద్భుతంగా శోభాయమానంగా తీర్చిదిద్దారు.మహిళలు శ్రద్ధగా బోనాలను ఎత్తుకొని, వల పందిరిని పట్టుకొని సాముహిక ఊరేగింపులో పాల్గొన్నారు. శివసత్తులు, పోతరాజులు, భజన బృందాలు, డప్పుల సంగీతంతో గంగపుత్రుల ఆత్మీయతను ప్రతిఫలించేలా ఆ కార్యక్రమం సాగింది. ఈ భక్తి పారవశ్యంలో అమ్మవారికి అందరూ బోనాలను సమర్పించి, లోక క్షేమం కోసం ప్రార్థించారు.ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన మహిళామణులకు,విచ్చేసిన అతిథులకు, సంగీయులకు ప్రదేశ్ గంగ పుత్ర సంఘం నగర గంగ పుత్ర సంఘం తరపున ధన్యవాదములు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో ప్రదేశ్ గంగ పుత్ర సంఘం రాష్ట్ర అధ్యక్షులు గడప శ్రీహరి గంగపుత్ర, శరణార్తి చంద్ర ప్రకాష్ గంగపుత్ర , మల్లేశ్ గంగ పుత్ర , శివరత్నం గంగపుత్ర, నగర గంగ పుత్ర సంఘం అధ్యక్షులు చాట్లా సదానంద్ గారు, ముషీరాబాద్ ఎంఎల్ఏ ముఠా గోపాల్ గంగపుత్ర, అంజన్ కుమార్ యాదవ్, మత్య సహకార సంఘం చైర్మన్ మెట్టు సాయి కుమార్ గంగ పుత్ర , కార్పొరేటర్ కంది శైలజ గంగపుత్ర, బీజేపీ నాయకులు పూస రాజు గంగపుత్ర, మద్దెర్ల శ్యామ్ సుందర్ గంగపుత్ర, పిల్లి శంకర్ గంగపుత్ర , అమృత్ రాజ్ గంగపుత్ర, ఆకుల మొహన్ దాస్ గంగపుత్ర, రాస్కాస్ భగవాన్ గంగపుత్ర, మల్లేష్ గంగ పుత్ర ,ఏ.ఎల్. సుధాకర్ గంగపుత్ర, మల్కు మహేందర్ గంగపుత్ర, చందు గంగ పుత్ర , రమేష్ భీష్మ గంగ పుత్ర, తారకప్రభు గంగపుత్ర, నవీన్ గంగపుత్ర , పూస రాకేశ్ గంగపుత్ర , సందిరి జగన్ గంగ పుత్ర, చెర్క సంగీత గంగ పుత్ర, కోయిలకొండ భగవతి గంగపుత్ర , హైదరాబాద్ లో ఉన్న స్థానిక గంగపుత్ర సంఘం అధ్యక్షులు,గంగపుత్ర మహిళలు యువకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# గింజా టాక్సీ మొదటి అడుగు

1912 ఆగస్టు 5 జపాన్ రవాణా చరిత్రలో ఓ మైలురాయి. అదే రోజు టోక్యో నగరంలోని గింజా అనే ప్రముఖ వాణిజ్య ప్రాంతంలో, మొట్ట మొదటి సారిగా టాక్సీ సేవలు ప్రారంభమయ్యాయి. ఇది కేవలం కొత్త వాహన సేవ ప్రారంభం మాత్రమే కాదు. జపాన్ ఆధునికత వైపు పయనాన్ని సూచించే సంఘటన. రవాణా రంగంలో కొత్త శకానికి ఇది నాంది పలికింది. ఈ సేవలను ప్రారంభించిన సంస్థ పేరు టోక్యో టాక్సీ ఆటోమొబైల్ కంపెనీ. ఆరంభంలో కేవలం ఆరు టాక్సీలతో ప్రారంభమయ్యాయి. ఫ్రాన్స్‌కు చెందిన డారాక్ (%ఋుతీతీుఎన%) కంపెనీ తయారీ వాహనాలు టాక్సీలుగా మార్చి, గింజా వీధుల్లో ప్రయోగాత్మకంగా ప్రవేశ పెట్టారు. ఇవి జపాన్‌లో మొదటి మోటార్ ఆధారిత, కిరాయికి నడిచే వ్యక్తిగత ప్రయాణ వాహనాలు. అప్పటి టోక్యో నగరం వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆధునిక నగరంగా ఎదుగుతోంది. గింజా ప్రాంతం %-% వ్యాపారం, విదేశీ సంస్థలు, డిపార్ట్‌మెంట్ స్టోర్లు, సినిమా హాళ్లు ఉండే సాంస్కృతిక కేంద్రంగా పేరు పడింది. ఈ ప్రాంతంలో టాక్సీ సేవల ప్రారంభం వ్యాపార అవసరాలకే కాదు, సామాజికంగా కూడా నగర జీవనశైలిలో కీలక మార్పును తెచ్చింది. ఈ టాక్సీల్లో ప్రయాణ ధర మీటర్ ఆధారంగా నిర్ణయించడ మన్నది అప్పటికి అత్యంత ఆధునిక వ్యవస్థ. ఇది ఖర్చుతో కూడుకున్నప్పటికీ, పారదర్శకత, వేగం, స్వచ్ఛత, సమయ పాలన వంటి అంశాలతో ప్రజల్లో విశ్వాసం పొందింది. తొలి దశలో ఇది ధనవంతుల ప్రయోజనం గానే ఉన్నా, 1920ల నాటికి వాహనాల సంఖ్య పెరగడంతో సామాన్యులు కూడా ఈ సేవలకు దరి చేరారు. జపాన్ ప్రభుత్వ పాలనలోను, పట్టణాభివృద్ధి లోను ఈ సేవల ప్రభావం గణనీయంగా కనిపించింది. ప్రభుత్వ అధికారులు, వ్యాపార వేత్తలు, విదేశీ అతిథులు టాక్సీలను వాడటంతో వాటికి స్థిర స్థానం లభించింది. యూరోప్, అమెరికాలో పెరుగుతున్న టాక్సీ సంస్కృతిని తూర్పు ఆసియాలో ముందుగా స్వీకరించిన దేశం జపానే కావడం విశేషం.నేటి జపాన్‌లో టాక్సీ సేవలు ప్రపంచ స్థాయి ప్రమాణాలకు నిలబడినవి. ఆధునిక టాక్సీలు, క్యాబ్‌లు, సాంకేతికతతో సమన్వయంగా పనిచేస్తున్నాయి. జీపీఎస్, జాతీయ టాక్సీ యాప్‌లు, డిజిటల్ మీటర్లు, మొబైల్ బుకింగ్, ఈ-పేమెంట్స్, క్రెడిట్ కార్డ్ మిషన్లు, నావిగేషన్ సదుపాయాలు వంటి సౌకర్యాలతో సాంకేతికంగా మెరుగైన సేవలుగా మారాయి. ప్రస్తుతం జపాన్‌లో దాదాపు 2.4 లక్షల టాక్సీలు పని చేస్తున్నాయి. టోక్యో, ఒసాకా వంటి నగరాల్లో "కమ్యూనిటీ క్యాబ్"లు, "గ్రీప్ ట్యాక్సీ", "సావారి", "టోక్యో మెక్సీ" వంటి యాప్ ఆధారిత సంస్థలు ట్యాక్సీ రంగంలో పని చేస్తున్నాయి. డ్రైవర్లకు శిక్షణ ప్రమాణాలు, వినయంగా మాట్లాడే తీరులు, నిబంధనలు పాటించే నైపుణ్యాలు ప్రపంచానికి ఆదర్శంగా నిలుస్తున్నాయి. టాక్సీ డ్రైవర్లు యూనిఫార్మ్, తెల్లదుస్తులు, గ్లౌవ్స్, టోక్యో బాడ్జ్ ధరించి ఉంటారు. వాహనాలన్నీ అత్యంత పరిశుభ్రంగా ఉంటాయి. ప్రయాణికులకు స్వాగతం పలకడం, సహాయపడటం వంటివి వారి సేవా ధర్మంగా ఉన్నవి. జపాన్ టాక్సీ వ్యవస్థ ఇతర దేశాల్లోకూ ప్రభావం చూపింది. భారతదేశం సహా అనేక దేశాల్లో, టోక్యో టాక్సీల సాఫ్ట్‌వేర్ మోడల్‌ను అనుసరిస్తూ యాప్‌లు రూపు దిద్దుకున్నాయి. 1912లో ప్రారంభమైన ఆరంభ టాక్సీ సేవలు జపాన్ నగర పాలనలో, ప్రజల జీవనశైలిలో, సాంకేతిక అభివృద్ధిలో కీలక ఘట్టంగా నిలిచాయి. టోక్యో గింజా వీధుల్లో ప్రారంభమైన ఆ ఐదు టాక్సీల ప్రయోగం, నేడు ప్రపంచ ప్రామాణికాలను నిర్ణయించే స్థాయికి ఎదిగింది. రవాణా రంగంలోని నూతన యుగానికి జపాన్ వేసిన ఈ బాట, ఇప్పటికీ మార్గదర్శకంగా నిలుస్తోంది. జపాన్ టాక్సీ వ్యవస్థ అనేది కేవలం వాహన సేవ కాదు. అది ఆధునికత, సమయపాలన, పరిశుభ్రత, సాంకేతికత కలగలిపిన ఒక సంస్కృతి. 1912 ఆగస్టు 5న ప్రారంభమైన ఈ వ్యవస్థ, శతాబ్ద కాలంగా కొనసాగుతూ, ప్రపంచంలోని నగర రవాణా వ్యవస్థకు ఆదర్శంగా మారింది.

# కవితకు జీవశైలి ఇచ్చిన వడ్డేపల్లి

తెలుగు భాషా సాహిత్యంలో గేయ సాహిత్యానికి విలక్షణ శైలి, హృదయాన్ని తాకే భావ వృద్ధి, సంగీతానికి తగిన పద సౌందర్యాన్ని అందించిన అరుదైన రచయిత వడ్డేపల్లి కృష్ణ (ఆగస్టు 5, 1948 - సెప్టెంబర్ 6, 2024). లలిత గీతాల నుంచి భక్తి గీతాల వరకు, జానపద గేయాల నుంచి చలనచిత్ర పాటల దాకా అన్ని రంగాలలో తనదైన ముద్ర వేసిన వారు. ఆయన రచనలు వినిపించడమే కాదు, హృదయాన్ని పరవశింప జేసే శక్తిని కలిగి ఉన్నాయి. 1948 ఆగస్టు 5న ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని సిరిసిల్లలో ఒక చేనేత కుటుంబంలో జన్మించిన వడ్డేపల్లి కృష్ణ గారికి చిన్ననాటి నుంచి సాహిత్యం, సంగీతంపై మక్కువ ఉండేది. తల్లిదండ్రులు లక్ష్మమ్మ, లింగయ్యల అనుసంధానంలో పెరిగిన ఆయన చిన్ననాటి నుంచే కవిత్వానికి ఆకర్షితులయ్యారు. సినారె ప్రభావం స్పష్టంగా కనిపించే ఆయన పదబంధాలు, భావవ్యక్తీకరణ నైపుణ్యం కాలక్రమేణా గేయసాహిత్యానికి సజీవ ముద్రగా మారాయి. 1968లో "స్రవంతి", "కృష్ణా పత్రిక"లలో పద్యాలు, గేయాలు ప్రచురితమవడం ద్వారా ఆయన రచనా జీవితం మొదలైంది.

'కవికల్యాణం', 'గడ్డిపువ్వు', 'గాంధీ', 'మూడుపూలు ఆరుకాయలు', 'సంక్రాంతి లక్ష్మి', 'స్వదేశీయం', 'వివేకానంద విజయం', 'ఆమ్రపాలి', 'బతుకమ్మ', 'జయజయహే తెలంగాణ', 'రమణీయ రామప్ప' వంటి అనేక సంగీత నృత్యరూపకాలు వ్రాసిన ఆయన, జాతీయ, ప్రాంతీయ నేపథ్యాలను భావప్రధానంగా మలచగల గుణాన్ని కలిగి ఉన్నారు. ఆకాశవాణి ద్వారా ప్రసారమైన ఆయన లలిత గీతాలు సామాన్య శ్రోతల నుండి సాహిత్య ప్రియుల దాకా విశేష ఆదరణ పొందాయి. "ఎందుకో ఈ కళ్లలో", "వచ్చే సాయంకాలం మౌనమే పలుకేలా", "తల్లి నీ చూపే దేవుడయ్యేను" వంటి పాటలు శ్రోతల మధుర జ్ఞాపకాల్లో నిలిచి పోయాయి. 'చిత్రాలకు గీతాలు రచించిన ఆయన, చలన చిత్ర గేయ సాహిత్యంలో సాహిత్య విలువను నిలబెట్ట గలిగిన అరుదైన రచయితగా గుర్తింపు పొందారు.

ఆయన టెలివిజన్ సీరియల్స్ కూడా రూపొందించారు, వాటిలో "భక్త కవి పోతన", "భారతీయ సంస్కృతీ శిఖరాలు" ముఖ్యమైనవి. "గోభాగ్యం" లఘు చిత్రానికి జాతీయ స్థాయిలో స్పెషల్ జ్యూరీ అవార్డు కూడా అందుకున్నారు. అవగాహనతో కూడిన పద వినియోగం, శ్రావ్యమైన పద బలంతో కూడిన రచనలు ఆయన శైలికి ప్రధానంగా నిలిచాయి. ఆయన భక్తి గీతాలు ఆలయాల్లో, భజనల్లో ప్రతిరోజూ వినిపించేవే. ఆయన రచనలు కేవలం వినోదం గానీ, ఆధ్యాత్మిక అనుభూతికే పరిమితం కాకుండా, భావ వ్యక్తీకరణకు, తాత్వికతకు ఆవిష్కారంగా నిలిచాయి. సంగీతం, పద సౌందర్యం రెండింటికీ సమాన ప్రాముఖ్యత ఇస్తూ రచించగల శక్తి ఆయనకు ప్రత్యేకత నిచ్చింది. సాహిత్య సేవలకు గుర్తింపుగా ఆయనకు 'నంది అవార్డు', 'తెలుగు యూనివర్శిటీ గౌరవ సత్కారం', సినారె అవార్డు, మల్లాది' స్మారక పురస్కారం, దాశరథి మెమోరియల్ అవార్డు, ఆత్రేయ అవార్డు, వండర్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ పురస్కారం, రవీంద్రభారతి' లో గవర్నర్ సమక్షంలో అక్కినేని నాగేశ్వరరావుచే కవి సత్కారం వంటి అనేక పురస్కారాలు లభించాయి.

ఆయనకు "గేయ కిరీటి", "లలితశ్రీ", "కవన ప్రజ్ఞ" వంటి బిరుదులు లభించాయి. నంది అవార్డ్స్ కమిటీ చైర్మన్‌గా, ఇంటర్నేషనల్ చిల్డ్రెన్స్ ఫిల్మ్ ఫెస్టివల్ జ్యూరీ సభ్యునిగా, "పాడుతా తీయగా" లాంటి కార్యక్రమాల జడ్జిగా కూడా ఆయన సేవలు అందించారు. వెయ్యికి పైగా లలిత గీతాలను రచించిన ఆయన, "కరీంనగర్ క్షేత్రాలు" అనే ఆడియో సీడీ ద్వారా భక్తి పరంగా ప్రాంతీయ క్షేత్రాలకు విశిష్టతను చాటారు. "వెలుగచ్చింది" అనే నాటకంలో తెలంగాణ భాష, యాస పట్ల ఆయనకు ఉన్న మక్కువను చాటి చెప్పారు. తెలంగాణ భూమికి సంగీతార్పణంగా "జయజయహే తెలంగాణ" అనే నృత్యరూపకం ద్వారా తన చారిత్రక భావనను ప్రతిబింబించారు.ఆఖరి దశలో అనారోగ్యంతో బాధ పడుతున్న కృష్ణ హైదరాబాదులోని నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ 2024 సెప్టెంబరు 6న మరణించారు.

ఆయన మరణం తెలుగు గేయ సాహిత్య ప్రపంచానికి తీరని లోటు. కానీ ఆయన రచనలు, గీతాలు, పదాల సుగంధం పుస్తకాలుగా, ఆల్బములుగా, జ్ఞాపకాలుగా జీవించి ఉంటాయి. వడ్డేపల్లి కృష్ణ ఒక గేయ రచయితగా మాత్రమే కాక, భావ వేధనకు నిలయమైన కవిగా, సమాజ స్పందనలకు ప్రతిరూపమైన సృజన కర్తగా, సంగీతానికి సాహిత్య గంభీరతను నూరిన ప్రకాశమయమైన ప్రతిభావంతుడిగా నిలిచి పోతారు. ఆయన రచనలన్నీ భావితరాలకు శ్రావ్యమైన ఆదర్శంగా నిలవడం ఖాయం.

# మరో మైలురాయి చేరిన ఇస్రో

భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) చరిత్రలో మరో అద్భుత ఘట్టం ఆవిష్కృతమైంది. 2025 జూలై 30 బుధవారం సాయంత్రం 5:40 గంటలకు శ్రీహరి కోటలోని సతీష్ ధావన్ అంతరిక్ష కేంద్రం రెండవ లాంచ్ ప్యాడ్ నుండి జీఎస్ఎల్వీ - ఎఫ్16 రాకెట్ విజయవంతంగా నింగిలోకి దూసుకెళ్లింది. ఈ మిషన్ కేవలం భారతదేశ అంతరిక్ష శక్తిని చాటి చెప్పడమే కాకుండా ప్రపంచ శాస్త్రవేత్తల మధ్య సహకారానికి నిదర్శనం. సుమారు 1.5 బిలియన్ అమెరికన్ డాలర్ల అంచనా వ్యయంతో కూడిన ఈ భారీ అంతరిక్ష మిషన్ నాసా, ఇస్రో సంయుక్తంగా పనిచేయడం ద్వారా ఆర్థిక భారాన్ని, సాంకేతిక నష్టాలను పంచుకోవడానికి వీలు కల్పించింది. ఈ రాకెట్ 51.7 మీటర్ల ఎత్తు, సుమారు 420 టన్నుల బరువు కలిగి ఉంది. ఇస్రో చేపట్టిన 18వ జీఎస్ఎల్వీ రాకెట్ ప్రయోగం. పైగా ఇస్రో సొంత క్రయోజెనిక్ ఇంజిన్‌ను ఉపయోగించి చేసిన 12వ ప్రయోగం. సాధారణంగా భూమికి అత్యంత ఎత్తులో ఉండే కక్ష్యలలో ఉపగ్రహాలను ప్రవేశపెట్టడానికి ఉపయోగించే ఈ రాకెట్‌ను ఈ సారి సూర్య సమకాలిక ధ్రువ కక్ష్యలోకి పంపడం ద్వారా ఇస్రో తన సాంకేతిక సామర్థ్యాన్ని ప్రదర్శించింది. ఇది ఏ రకమైన మిషన్లకైనా రాకెట్లను ఉపయోగించగల ఇస్రో నైపుణ్యాన్ని తెలియజేస్తుంది. మూడు దశల ఈ రాకెట్ మొదటి దశ ఘన ఇంధనంతో, రెండవ దశ ద్రవ ఇంధనంతో, మూడవ దశ అధునాతన క్రయోజెనిక్ ఇంజిన్‌తో పనిచేసింది.

గతంలో అనేక దేశాలు ఈ సాంకేతికతను భారతదేశంతో పంచుకోవడానికి నిరాకరించాయి.ఈ ఉపగ్రహం సాధారణ ఉపగ్రహంలా కాకుండా ప్రపంచంలోనే మొదటిసారిగా రెండు వేర్వేరు పౌనఃపున్యాలను (ఎల్-బ్యాండ్, ఎస్-బ్యాండ్) ఉపయోగించే రాడార్ వ్యవస్థను కలిగి ఉంది. ఈ రెండు పౌనఃపున్యాల వలన 'నిసార్' మేఘాలను కూడా ఛేదించి పగలు, రాత్రి తేడా లేకుండా భూమిపై, మంచుపై ఉన్న ప్రాంతాలను చాలా స్పష్టంగా చిత్రీకరించగలదు. ఈ మిషన్ ప్రపంచ వ్యాప్తంగా ఎంతో కీలకమైన సమాచారాన్ని అందిస్తుంది.

ప్రకృతి వైపరీత్యాలపై విలువైన సమాచారాన్ని అందిస్తుంది. హిమాలయ పర్వతాలలో హిమానీ నదాలు, మంచు పలకల ఆరోగ్యంపై, నీటి లభ్యతను అంచనా వేయడానికి, హిమానీ నద సరస్సుల నుండి వచ్చే వరదలను అంచనా వేయడానికి సహాయపడుతుంది. అడవుల ఆరోగ్యం, వృక్షజాలం, కార్బన్ నిల్వలు, భూమిపై పచ్చదనాన్ని పర్యవేక్షించి వాతావరణ మార్పులను ఎదుర్కోవడానికి సహాయపడుతుంది. ఈ సమాచారాన్ని అందించి ప్రపంచ వ్యాప్తంగా విపత్తు ప్రతిస్పందన ప్రయత్నాలను మెరుగు పరుస్తుంది.

ఈ మిషన్, అంతరిక్షంలో అంతర్జాతీయ సహకారానికి బలమైన చిహ్నం. ప్రపంచంలోని రెండు ప్రముఖ అంతరిక్ష సంస్థలు ప్రపంచ సవాళ్లను ఎదుర్కోవడానికి ఎలా కలిసి వచ్చాయో ఇది చూపిస్తుంది. పైగా ప్రపంచ అంతరిక్ష రంగంలో భారతదేశ స్థానాన్ని నమ్మకమైన, సమర్థవంతమైన భాగస్వామిగా బలపరుస్తుంది. గగన్‌యాన్ మానవ అంతరిక్ష ప్రయాణ కార్య క్రమం, భారతీయ అంతరిక్ష కేంద్రం అభివృద్ధి వంటి భవి ష్యత్ ప్రతిష్టాత్మక మిషన్లకు మార్గం సుగమం చేస్తుంది. నిసార్ ఉత్పత్తి చేసే డేటా ఉచితంగా అందుబాటులో ఉంటుంది. దీని ప్రయోజనాలు ప్రపంచ వ్యాప్తంగా శాస్త్రవేత్తలు, ప్రభు త్వాలు, విపత్తు నిర్వహణ సంస్థలచే పొందబడతాయి. వాతావరణ మార్పులు, పెరుగుతున్న ప్రకృతి వైపరీత్యాల నేపథ్యంలో 'నిసార్' వంటి మిషన్లు కేవలం శాస్త్రీయ విజయాలు మాత్రమే కాకుండా విధాన నిర్ణయాలు, ప్రమాద అంచనా, ప్రపంచ స్థిరత్వాన్ని పెంపొందించడానికి అనివార్యమైన సాధనాలు..?ఈ మిషన్ విజయవంతం కావడం భారతదేశానికి ఎంతో గర్వించదగిన క్షణం!

# వ్యోమగాములకు ఆదర్శం నీల్ ఆర్మ్‌స్ట్రాంగ్

చంద్రమండలంపై కాలుమోపిన మొదటి వ్యోమగామి(ఆస్ట్రనాట్)గా నీల్ ఆర్మ్‌స్ట్రాంగ్ అంతరిక్ష చరిత్రలో చెరగని అరుదైన రికార్డును నెలకొల్పాడు. 05 ఆగష్టు 1930న ఓహియా నగరంలో జన్మించిన నీల్ ఆర్మ్‌స్ట్రాంగ్ పర్డ్యూ యూనివర్సిటీలో ఏరోనాటికల్ ఇంజనీరింగ్ డిగ్రీని పూర్తి చేసి, సదరన్ కాలిఫోర్నియా యూనివర్సిటీలో ఇంజనీకరింగ్ విభాగంలో పిజీ కూడా పూర్తి చేసారు. 1949 - 50 మధ్య కాలంలో నానల్ ఏవియేటర్‌గా, నేషనల్ అడ్వైజరీ కమిటీ ఫర్ ఏరోనాటిక్స్, నాసా(నేషనల్ ఏరోనాటిక్స్ అండ్ స్పేస్ ఆర్గనైజేషన్)లలో చేరిన నీల్ ఆర్మ్‌స్ట్రాంగ్17 ఏండ్ల పాటు ఇంజనీర్‌గా సేవలు అందించారు. నాసాలో ప్రాజెక్ట్ పైలెట్‌గా దాదాపు 200 రకాల ఏయిర్‌క్రాఫ్ట్‌లు, జెట్స్, రాకెట్లు, హెలీకాప్టర్లు, గ్లైడర్స్‌లో వైమానికుడిగా బహుముఖీన ప్రతిభను ప్రదర్శించారు. 1962లో ఆస్ట్రోనాట్‌గా "జెమిని-8 మిషన్"లో భాగంగా 1966లో అంతరిక్షయానం విజయవంతంగా పూర్తి చేశారు. అంతరిక్షంలో నెలకొన్న తీవ్ర వాతారణాన్ని తట్టుకుంటూ మానసికంగా దృఢ విశ్వాసంతో చంద్రమండల ప్రయాణం పూర్తి చేసిన ఆర్మ్‌స్ట్రాంగ్ చూపిన సాహస స్ఫూర్తి నేటి తరానికి ప్రేరణగా నిలుస్తున్నది. నానల్ ఏవియేటర్, టెస్ట్ పైలెట్, యూనివర్సిటీ ప్రొఫెసర్, ఏరోనాటికల్ ఇంజనీర్ లాంటి పలు బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించిన నీల్ ఆర్మ్‌స్ట్రాంగ్ "అపోలో-11 ల్యూనార్ మాడ్యూల్" ప్రాజెక్ట్‌లో స్పేస్‌క్రాఫ్ట్ కమాండర్‌గా తొలి మానవసహిత చంద్రమండల ప్రయాణానికి నాయకుడిగా సిద్ధం అయ్యారు. 16 జూలై 1969 రోజున నీల్ ఆర్మ్‌స్ట్రాంగ్‌తో పాటు పైలెట్ బజ్ ఆల్డ్రిన్, మైఖేల్ కోలిన్స్‌లతో కలిసి చంద్రమండల ప్రయాణానికి ప్రారంభం అయ్యారు. 2.4 లక్షల మైళ్లు ప్రయాణించి 20 జూలై 1969న చంద్రమండలానికి చేరుకున్నారు. అదే రోజు నీల్ ఆర్మ్‌స్ట్రాంగ్ వ్యోమనౌక లోంచా బయటకు వచ్చి చందమామ ఉపరితలంపై తొలిసారి కాలుమోపి, రెండున్నర గంటల పాటు చంద్రుడిపై బజ్ ఆల్డ్రిన్‌తో కలిసి సంచరించాడు. వ్యోమనౌకలో ఉన్న మైఖేల్ కాలిన్స్ కక్షలో మాత్రమే పరిభ్రమించాడు. అంతరిక్ష చరిత్రలో మొదటి మానవుడిగా రికార్డును నెలకొల్పారు. ఈ అంతరిక్ష మిషన్‌లో మొత్తంగా 8 రోజులు, 14 గంటలు, 12 నిమిషాలు అంతరిక్షంలో గడిపారు. చందమామ ఉపరితలంపై కాలుమోపిన మరు క్షణమే భావోద్వేగాలకు గురి అయిన ఆర్మ్‌స్ట్రాంగ్ మాట్లాడుతూ "చందమామ పై వేసిన ఓ చిన్న తొలి అడుగు, రేపటి మానవాళి అంతరిక్ష చరిత్రలో ఓ భారీ ముందడుగు" అంటూ పేర్కొన్నారు. 16వ ఏట 1947లో నావల్ ఏయిర్ కెడెట్‌గా, 1971 - 79 మధ్య కాలంలో సిన్సినాటీ యూనివర్సిటీలో ఏరోస్పేస్ ఇంజనీరింగ్ విభాగంలో ఆచార్యుడిగా, 1982 - 92 మధ్య కంప్యూటింగ్ టెక్నాలజీ ఫర్ ఏవియోషన్ విభాగానికి చైర్మన్‌గా ఆర్మ్‌స్ట్రాంగ్ సేవలు అందించారు. పలు ఏవియోషన్ సంఘాల్లో సభ్యుడిగా లేదా చైర్మన్‌గా పలు హోదాల్లో పని చేశారు. తన జీవితకాలంలో 17కు పైగా యూనివర్సిటీల నుంచి గౌరవ డాక్టరేట్లు పొంది పలు పురస్కారాలు స్వీకరించారు. ప్రెసిటెంట్స్ మెడల్, ఏవియేషన్ పురస్కారాలు, రాబర్ట్ ట్రోఫీలను అందుకున్నారు. 25 ఆగష్టు 2012న తన 82వ ఏట అనారోగ్యంతో తుది శ్వాస విడిచిన నీల్ ఆర్మ్‌స్ట్రాంగ్ ఆదర్శమయ జీవితం ఏరోనాటికల్ ఇంజనీర్స్, వ్యోమగాములకు దారి దీపంగా వెలుగులు చిమ్ముతూనే ఉన్నారు. అద్భుత ధైర్యానికి మారుపేరుగా నిలిచిన నీల్ ఆర్మ్‌స్ట్రాంగ్ జీవితం ఆసాంతం అంతరిక్ష శాస్త్రానికే అంకితం, నేటి ఆస్ట్రొనాట్స్‌కే ఆదర్శప్రాయం.

# పీఎం ప్రణయ్ పునరుజ్జీవం ఇచ్చేనా?

వ్యవసాయ భూములలో జీవ శక్తి తగ్గిపోతోంది, మట్టిలోని సూక్ష్మ జీవుల ఉనికి క్రమంగా క్షీణిస్తోంది, ఎరువుల ఖర్చులు రైతుకి భారం అవుతున్నాయి. ఈ పరిస్థితుల్లో ప్రకృతికి అనుకూలమైన వ్యవసాయానికి అవసరం పెరిగింది. గత కొంతకాలంగా దేశవ్యాప్తంగా రైతులు అధికంగా రసాయన ఎరువులపై ఆధారపడుతున్నారు. దీని వల్ల పంటల్లో తాత్కాలికంగా దిగుబడి పెరిగినప్పటికీ, మట్టిలో జీవశక్తి తగ్గిపోతోంది. దీర్ఘకాలంగా ఇది మానవ ఆరోగ్యం పైనా ప్రభావం చూపిస్తోంది. అందుకే ప్రత్యామ్నాయ ఎరు వుల వైపు అడుగులు వేయాల్సిన అవసరం ఏర్పడింది. ఆ దిశగా కేంద్ర ప్రభుత్వం తీసుకున్న ఓ కీలకమైన నిర్ణయమే... ప్రధానమంత్రి ప్రాణమ్ పథకం.2023 జూన్ 28న కేంద్ర వ్యవసాయ శాఖ ఈ పథకాన్ని ప్రారంభించింది. ముఖ్యంగా ఈ పథకం మూడు ప్రధాన లక్ష్యాలపై దృష్టిపెడుతోంది. రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించడంతో పాటు సేంద్రియ, జీవ ఎరువుల వినియోగాన్ని ప్రోత్సహించడం, నేల ఆరోగ్యాన్ని మెరుగుపరచడం ఈ పథకంలో ముఖ్యమైన అంశం ఇన్‌సెంటివ్ మెకానిజం. అంటే ఏ రాష్ట్రం రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గిస్తే, ఆ రాష్ట్రానికి కేంద్రం ఆదా అయిన సబ్సిడీలో 50% మళ్లీ గ్రాంట్‌గా ఇస్తుంది. అందులో 70% జీవన ఎరువులు మౌలిక సదుపాయాల అభివృద్ధికి, 30% అవగాహన కార్యక్రమాలు, రైతుల శిక్షణకు వినియోగించవచ్చు. అంటే దీని ద్వారా రాష్ట్రాలకు ప్రోత్సాహం, రైతులకు ప్రత్యక్ష ప్రయోజనం, ప్రకృతికి రక్షణ అన్నీ సాధ్యపడతాయి.2024 ఆగస్టు 9 నాటికి అన్ని రాష్ట్రాలు ప్రాణమ్ పథకంలో చేరాయి. గోభర్ధన్ యూనిట్ల నుండి వచ్చే సేంద్రియ ఎరువులకు రూ.1500 టన్నుకు ప్రోత్సాహకం. 2023లో రూ.1451.84 కోట్లు మార్కెట్ అభివృద్ధి సహాయంగా కేటాయించబడ్డాయి. యూరియా గోల్డ్ (సల్ఫర్ కోటెడ్ యూరియా) లాంటి ఉత్పత్తులు నేల పోషక లోపాలు తీర్చే లక్ష్యంతో తీసుకువచ్చారు. కానీ పథకం విజయవంతం కావాలంటే కొన్ని ప్రశ్నలు ఎదురవుతాయి. అన్ని రాష్ట్రాలు వాస్తవంగా ఎరువుల వినియోగం తగ్గించగలవా? బయో ఎరువుల సరఫరా, నాణ్యతపై రైతులకు నమ్మకం ఏర్పడిందా? అంతర్జాతీయ ఎరువుల దిగుమతులపై ఆధారాన్ని దేశీయంగా తగ్గించగలమా? ఈ అంశాలపై స్పష్టమైన కార్యాచరణ లేకుంటే, ఎంత మంచి పథకం అయినా ఆశించిన ఫలితాలు ఇవ్వకపోవచ్చు. పునరుత్పాదక వ్యవసాయం అనేది ఫలిత-ఆధారిత ఆహార ఉత్పత్తి వ్యవస్థ, ఇది నేల ఆరోగ్యాన్ని పెంపొందించి వాతావరణం, నీటి వనరులతోపాటు జీవవైవిధ్యాన్ని రక్షిస్తుంది. పొలాల ఉత్పాదకతను లాభదాయకతను పెంచుతుంది.

రసాయన ఎరువులపై సబ్సిడీ భారం 2022-23 ఆర్థిక సంవత్సరానికి సుమారు 2.25 లక్షల కోట్లు ఉండటం గమనించదగ్గ విషయం, ఇది 2021-22 ఆర్థిక సంవత్సరం (?1.62 లక్షల కోట్లు) కంటే 39 శాతం ఎక్కువ. 2012-13 నుండి 2021-22 వరకు నత్రజని ఎరువుల వినియోగం, ముఖ్యంగా యూరియా వినియోగం తగ్గలేదని చూపిస్తుంది. అయితే, సబ్సిడీ బిల్లు గణనీయంగా పెరిగింది. కాబట్టి, ప్రాణమ్‌ను ప్రోత్సహించడం వల్ల ప్రభుత్వం సబ్సిడీ బిల్లులను, ఆర్థిక లోటును తగ్గించడంలో సహాయపడుతుంది. రసాయన ఎరువులపై సబ్సిడీలను క్రమంగా తొలగించడం ప్రత్యామ్నాయ లేదా బయో-ఎరువుల స్వీకరణను ప్రేరేపిస్తుంది. రాష్ట్ర ప్రభుత్వాలు దీన్ని అత్యంత ప్రాధాన్యంగా తీసుకోవాలి, రైతులకు ప్రత్యక్ష లాభం కనబడేలా వినియోగం, అవగాహన పెరగాలి. రైతు శిక్షణ కేంద్రాలు, డెమో ప్రాజెక్టులు ఏర్పడాలి. ఐ.ఎఫ్.ఎం.ఎస్, ఈ.ఎఫ్.ఎం.ఎస్ వంటి డిజిటల్ మానిటరింగ్ వ్యవస్థలు సమర్థవంతంగా అమలు కావాలి. రైతు సంఘాలు, స్వచ్ఛంద సేవా సంస్థలు, యూనివర్సిటీలను భాగస్వాములుగా మార్చాలి. ఈ పథకం సేంద్రీయ, ప్రకృతి వ్యవసాయ పునరుజ్జీవానికి ఊపిరినిస్తుంది. ఇది ఎరువులపై ఆధారపడే వ్యవసాయం నుంచి స్వయం సమృద్ధ వ్యవస్థల వైపు భారత వ్యవసాయం అడుగులు వేయడానికి అవకాశంగా మారాలి. ఇది కేవలం ఒక పథకం మాత్రమే కాదు ప్రకృతితో మానవుడి పునఃసంబంధానికి సంకేతం. దీని వలన రైతుకు మేలు జరుగుతుంది, భవిష్యత్తు తరాలకి ఆరోగ్యం లభిస్తుంది. మట్టిలో జీవం వుంటేనే మానవాళికి జీవితం ఉంటుందనే వాస్తవాన్ని విస్మరించవద్దు.

# సినారె సాహితీ పురస్కారాలు ప్రదానం

ఎల్‌బినగర్, ఆగస్టు 4(ఎ.ఎం.ఎస్): తెలంగాణ భాష, సాంస్కృతిక శాఖ సౌజన్యంతో తుర్కయంజాల్ లోని 'మహాకవి సినారే కళాపీఠం' ఆధ్వర్యంలో కవులు, రచయితలకు సాహితీ పురస్కారాలు అందజేశారు. ప్రముఖ కవి నందిని సిధారెడ్డి అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది. సమావేశంలో కవి లింగం పల్లి రామచంద్ర (యాదాద్రి) జీవన సాఫల్య పురస్కారం అందుకున్నారు. రాధశ్రీ (హైదరాబాద్), అరుణ నారదభట్ల (హైదరాబాద్), నాళేశ్వరం శంకరం (నిజామాబాద్), ఆచార్య ఫణీంద్ర (నిజామాబాద్), కాసుల ప్రతాప్ రెడ్డి (యాదాద్రి), దోరవేటి చెన్నయ్య (రంగారెడ్డి), పెద్దూరి వెంకట దాసు (రంగారెడ్డి), జువ్వాడి దేవీ ప్రసాద్ (కరీంనగర్), తత్వాది ప్రమోద్ కుమార్( కరీంనగర్), మౌనశ్రీ మల్లిక్ (మహబూబాబాద్) అగ్రహారం ఛందోజీరావు( మహబూబ్ నగర్), మంథని శంకర్ (వరంగల్)లు సాహితీ పురస్కారాలను అందుకున్నారు.

# రైతులకు ఆధునిక వ్యవసాయ పరికరాలను అందజేయాలి తలపా దామోదరం రెడ్డి



**శ్రీకాళహస్తి(ప్రశ్న న్యూస్)** శ్రీకాళహస్తి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త తలపా దామోదరం రెడ్డి ఆధ్వర్యంలో శ్రీకాళహస్తి డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకులు రమేష్ రెడ్డి కి వినతి పత్రం అందజేసి శ్రీకాళహస్తి నియోజకవర్గం నందుగల రైతులకు ఆధునిక వ్యవసాయ పరికరాలను సబ్సిడీపై స్ప్రేయర్లను, టార్పాలిన్ను పట్టలు, డ్రోన్లు, రోటవేటర్లును,విత్తనాలును రైతులకు అందజేసి వారిపై ఆర్థిక భారం నుంచి అదే విధంగా వారిపై రుణ భారం పడకుండా చూడాలని మరియు వారికి ఆధునిక యాంత్రికరణ పై అవగాహన వైపు చర్యలు చేపట్టాలని కోరారు. తలపా దామోదరం రెడ్డి మాట్లాడుతూ దేశానికి వెన్నెముక అయినటువంటి రైతన్న నేడు వ్యవసాయం చేయాలంటే ఆర్థిక ఇబ్బందులతో మరియు పంట నష్టాలతో సతమతమవుతున్న వేళ ప్రభుత్వాలు వారిని ఆదుకోవాలని అదే విధంగా రైతులకు యాంత్రికరణ పై అవగాహన సదస్సు ఏర్పాటు చేసి వారిని చైతన్యపరిచి నష్ట నివారణ చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తి మండల అధ్యక్షులు సురేంద్ర రెడ్డి,ఆంటోనీ తదితరులు పాల్గొన్నారు.

# మహిళల స్వయం ఉపాధికి రేవంత్ సర్కార్ అండగా నిలుస్తుంది - ఆది శ్రీనివాస్

- రాజేశ్వరి బోటిక్ అండ్ బ్యూటీపార్లర్,మ్యాచింగ్ సెంటర్ లను ప్రారంభించిన విప్:ఆది శ్రీనివాస్



**వేములవాడ,(ప్రశ్న న్యూస్)** వేములవాడ పట్టణంలోని భగవంతరావు నగర్‌లో ఏర్పాటు చేసిన "రాజరాజేశ్వరి బోటిక్ అండ్ బ్యూటీ పార్లర్" మరియు మ్యాచింగ్ సెంటర్ లను సోమవారం రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మహిళల అభ్యున్నతి కోసం కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని, స్వయం ఉపాధి కోసం మహిళలు చూపుతున్న కృషి ప్రశంసనీయమని అన్నారు. మహిళా సంఘాలను ప్రోత్సహిస్తూ, వారిని ఆర్థికంగా బలోపేతం చేయడానికి రేవంత్ రెడ్డి సర్కార్ పలు పథకాలను అమలు చేస్తున్నదని పేర్కొన్నారు.స్వయంకృషితో వ్యాపారం ప్రారంభించిన మారేపు హేమలత, శీలం స్వప్న, చందనగిరి తేజస్వి లను ఆది శ్రీనివాస్ అభినందించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలు, రాజరాజేశ్వరి మ్యాచింగ్ సెంటర్ నిర్వాహకులు, కుటుంబ సభ్యులు,తదితరులు పాల్గొన్నారు.

# రైతు అభివృద్ధి కోసం ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

- వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ : బోయిని ఎల్లేష్ యాదవ్
- కోరెం క్లస్టర్ రైతులకు 100 శాతం సబ్సిడీతో కంది విత్తనాలు పంపిణీ




**బోయినిపల్లి,(ప్రశ్న న్యూస్)** రాజన్న సిరిసిల్ల జిల్లా,బోయినిపల్లి మండలంలోని కోరెం గ్రామ రైతు వేదికలో సోమవారం (ఎన్ఎఫ్ఎస్ఎమ్)–2025 పథకం కింద కంది విత్తనాలను పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా కోరెం క్లస్టర్‌కు చెందిన రైతు సోదరులను గుర్తించి,వారికి కంది విత్తనాలను 100 శాతం సబ్సిడీతో అందజేశారు. ఈ కార్యక్రమానికి బోయినిపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఎల్లేష్ యాదవ్ హాజరై మాట్లాడుతూ, "రైతు సోదరుల అభివృద్ధి కోసం కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అనేక పథకాలను అమలు చేస్తున్నాయి. కంది పంట ఉత్పత్తి పెంచేందుకు ఈ సబ్సిడీ విత్తనాలు ఉపయోగపడతాయి. రైతులు నూతన సాంకేతికతలను అనుసరించి దిగుబడులు పెంచాలని, ప్రభుత్వం అందిస్తున్న ప్రతి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని" ఆయన పిలుపునిచ్చారు.మండల వ్యవసాయ అధికారి ప్రణీత ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కోరెం వ్యవసాయ విస్తరణ అధికారి లక్ష్మణ్,కాంగ్రెస్ మండల అధ్యక్షులు వన్నెల రమణారెడ్డి,రైతులు పాల్గొన్నారు.

# బీసీ రిజర్వేషన్ బిల్లుకు చట్టబద్ధత కల్పించాలి

- బీసీ రిజర్వేషన్ బిల్లుపై కేంద్రంతో కొట్లాడుతాం
- యూత్ కాంగ్రెస్ వేములవాడ నియోజకవర్గం అధ్యక్షులు : న్యాత నవీన్
- జంతర్ మంతర్ వద్ద బీసీ గర్జనకు యూత్ కాంగ్రెస్ నేతల పయనం



**వేములవాడ,(ప్రశ్న న్యూస్)** బీసీ రిజర్వేషన్ బిల్లును కేంద్రం వెంటనే ఆమోదించి చట్టబద్ధత కల్పించాలని వేములవాడ నియోజకవర్గం యువజన కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు న్యాత నవీన్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "బీసీ రిజర్వేషన్ బిల్లుపై వెనుకంజ వేస్తున్న కేంద్ర బీజేపీ ప్రభుత్వానికి తెలంగాణ బీసీ ప్రజల ఆగ్రహం తప్పదని" హెచ్చరించారు.రాజన్న సిరిసిల్ల జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షులు డాక్టర్ కౌడగాని వెంకటేష్,న్యాత నవీన్ నాయకత్వంలో బీసీ యువజన కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలు ప్రత్యేక రైల్లో ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద ఈనెల 5,6,7తేదీల్లో జరగనున్న బీసీ గర్జన కార్యక్రమానికి హాజరయ్యేందుకు సోమవారం ఉదయం చర్లపల్లి రైల్వే స్టేషన్ నుంచి బయలుదేరారు. ఈ సందర్భంగా నాయకులు,కార్యకర్తలు నినాదాలతో హర్షాతిరేకంగా రైలు ఎక్కి తమ ఉద్యమ దీక్షను వ్యక్తపరిచారు. ఈ పయనంలో సందెల శశికుమార్,యువజన కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు అధికసంఖ్యలో తరలివెళ్లారు.

# గ్రామాల్లో నిఘా పెంచి విజిబుల్ పోలీసింగ్‌ను ఖచ్చితంగా అమలు చేయాలి

- రౌడీ షీటర్లపై ప్రత్యేక నిఘా
- ఇన్ఫర్మేషన్ నెట్వర్క్ పటిష్టం చేయాలి
- వేములవాడ ఏఎస్పీ : శేషాద్రిని రెడ్డి
- వేములవాడ రూరల్, బోయినిపల్లి పోలీస్ ఠాణాలు ఏఎస్పీ క్షేత్రస్థాయి సందర్శన
- ఎన్నికల దృష్ట్యా భద్రతా ఏర్పాట్లపై సిబ్బందికి ఏఎస్పీ సూచనలు





**వేములవాడ /బోయినిపల్లి,(ప్రశ్న న్యూస్)** రాజన్న సిరిసిల్ల జిల్లా,వేములవాడ ఏఎస్పీ శేషాద్రిని రెడ్డి సోమవారం వేములవాడ రూరల్, బోయినిపల్లి పోలీస్ స్టేషన్లను క్షేత్రస్థాయిలో సందర్శించారు. ఈ సందర్భంగా స్టేషన్ నిర్వహణ,సిబ్బంది పనితీరు,కిట్ ఆర్టికల్స్ వినియోగం,రికార్డుల నిర్వహణను పరిశీలించి, పెండింగ్ కేసులపై సమగ్ర సమీక్ష నిర్వహించారు. అనంతరం సిబ్బందికి పలు మార్గదర్శకాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఏఎస్పీ మాట్లాడుతూ గ్రామాల్లో శాంతి భద్రతలు కాపాడటానికి విజిబుల్ పోలీసింగ్‌ను పకడ్బందీగా అమలు చేసి, నిఘా వ్యవస్థను బలోపేతం చేయాలని సూచించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల దృష్ట్యా అధికారులు, సిబ్బంది సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. గ్రామాల్లో తరచూ పర్యటిస్తూ ప్రజలతో అనుబంధం పెంపొందించాలని, ఎలాంటి సంఘటన జరిగినా వెంటనే సమాచారం అందేలా ఇన్ఫర్మేషన్ నెట్‌వర్క్‌ను పటిష్టం చేయాలని తెలిపారు. స్టేషన్ పరిధిలో రౌడీషీటర్లు, హిస్టరీషీటర్ల కదలికలపై ప్రత్యేక నిఘా ఉంచాలని, ప్రతి నెలా వారి తాజా సమాచారాన్ని సేకరించి రికార్డు చేయాలని సూచించారు. అదనంగా రోడ్డు ప్రమాదాలు నివారించేందుకు ప్రతిరోజూ వాహనాల తనిఖీలు, డ్రంక్ అండ్ డ్రైవ్ కార్యక్రమాలను నిర్వహించాల్సిందిగా ఆదేశించారు. అనంతరం స్టేషన్ ప్రాంగణంలో అధికారులు, సిబ్బందితో కలిసి మొక్కలను నాటారు. ఈ సందర్శనలో ఏఎస్పీ వెంట వేములవాడ రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్,బోయినిపల్లి సబ్ ఇన్స్పెక్టర్ రాజా కుమార్,వేములవాడ రూరల్ సబ్ ఇన్స్పెక్టర్ అంజయ్య, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

# మారుపాక గ్రామంలో ఇంటింటికి బీజేపీ మహా సంపర్క్ అభియాన్



**వేములవాడ,(ప్రశ్న న్యూస్)** వేములవాడ అర్బన్ మండలంలోని మారుపాక గ్రామంలో సోమవారం 193,195 బూత్‌లలో బూత్ అధ్యక్షుల ఆధ్వర్యంలో "ఇంటింటికి బీజేపీ మహా సంపర్క్ అభియాన్" కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికి వెళ్లి ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వంలోని బీజేపీ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి,సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు గంధమల్ల ఆనంద్ గౌడ్ హాజరై మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఇచ్చిన ఏ ఒక్క హామీని కూడా నెరవేర్చలేదని, గత ప్రభుత్వాల మాదిరిగానే ఈ ప్రభుత్వం కూడా చేతకాని దద్దమ్మ ప్రభుత్వమని విమర్శించారు. రానున్న రోజుల్లో తెలంగాణలో భారతీయ జనతా పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. ప్రజలందరూ బీజేపీ వైపు ఆశగా చూస్తున్నారని, బీజేపీ ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయడం ప్రతి కార్యకర్త బాధ్యత అని అన్నారు. ఈ కార్యక్రమంలో భాజపా జిల్లా అధ్యక్షులు రెడ్డబోయిన గోపి,అర్బన్ మండల అధ్యక్షుడు బుర్ర శేఖర్ గౌడ్,రాష్ట్ర నాయకులు లింగంపల్లి శంకర్, జిల్లా కౌన్సిల్ మెంబర్ వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శులు చంద్రగిరి ప్రశాంత్,నర్సింగోజు శంకర్, నాయకులు జింక అనిల్, గుండెకార్ల లక్ష్మణ్, ఉపాధ్యక్షులు తిప్పర వేణి రాజు, ఎరుగోక్కుల రమేష్, కిసాన్ మోర్చా అధ్యక్షుడు గోరె భాస్కర్, ఓబీసీ మోర్చా అధ్యక్షుడు సంతోష్ యాదవ్, చల్ల నర్సయ్య,పోచంపల్లి భాను,తుమ్మల రాజవ్వ, కొలనూరు సంజీవరెడ్డి,బూర శేఖర్,ముదం శ్రీనివాస్, ముడికె రాములు,నాంపల్లి తిరుపతి, కంసాని రాము, పేరంగాని మల్లేశం, తుమ్మల సైర్నాథ్, రెడ్డవేని రాజు, చంద్రగిరి గణేష్, నాగరాజు, శేఖర్ తదితర నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# యువత స్వయం ఉపాధితో ఆర్థికంగా ఎదగాలి

- మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ పుట్ట శైలజ



**మంథని (ప్రశ్న న్యూస్)** యువత స్వయం ఉపాధి మార్గాలను ఎంచుకొని ఆర్థికంగా ఎదగాలని మంథని మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ పుట్ట శైలజ పేర్కొన్నారు. సోమవారం మంథని పట్టణం శ్రీరామకాలనీలో శ్రీ మంజునాథ పూజ స్టోర్ ను ఆమె ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ యువత ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఎదురు చూడకుండా స్వయం ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకొని ఆర్థికంగా ఎదగాలని ఆమె తెలిపారు. పూజా సామాగ్రిని మరెక్కడ లేనివిధంగా ర్యాక్స్ సిస్టం ద్వారా ఏర్పాటు చేయడం చాలా బాగుందని ఆమె పేర్కొన్నారు. శ్రీ మంజునాథ పూజ స్టోర్ యాజమాన్యానికి శుభాకాంక్షలు తెలిపారు.

# భూ సమస్యను పరిష్కరించరా అని ఆగ్రహం వ్యక్తం చేసిన కలెక్టర్

- అర్జీలు ఎప్పటికప్పుడు పరిష్కరించాలి: కలెక్టర్ సందీప్ కుమార్ ఝా



**సిరిసిల్ల (ప్రశ్న న్యూస్)** ప్రజావాణి అర్జీలు ఎప్పటికప్పుడు పరిష్కరించాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశించారు. జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలోని ఆడిటోరియం లో ప్రజల నుంచి కలెక్టర్ సోమవారం అర్జీలు స్వీకరించారు. మొత్తం 189 దరఖాస్తులు వచ్చాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రజావాణికి వచ్చే దరఖాస్తులు పెండింగ్ లో పెట్టవద్దని కలెక్టర్ ఆదేశించారు. ఆయా శాఖలకు వచ్చిన దరఖాస్తుల వివరాలు. రెవెన్యూ శాఖకు 69, హౌసింగ్ శాఖకు 50, డీఆర్డీఓ 17, ఉపాధి కల్పన శాఖ, ఎస్డీసీకి ఎనిమిది చొప్పున, జిల్లా సంక్షేమ అధికారి, జిల్లా విద్యాధికారికి ఆరు చొప్పున, సిరిసిల్ల మున్సిపల్ కార్యాలయం, జిల్లా పంచాయతీ కార్యాలయానికి ఐదు చొప్పున, సెస్, జిల్లా వ్యవసాయ అధికారి, ఎస్పీ ఆఫీస్ కు మూడు చొప్పున, జీజీహెచ్, ఈఓ వేములవాడ రాజరాజేశ్వర ఆలయానికి రెండు చొప్పున, జిల్లా వైద్యాధికారి, ఎల్ డీ ఎం కు ఒకటి చొప్పున వచ్చాయి.

### భూ సమస్యను వెంటనే పరిష్కరించాలి

భూ సమస్యను వెంటనే పరిష్కరించాలని సిరిసిల్ల ఆర్డీఓ వెంకటేశ్వర్లను కలెక్టర్ ఆదేశించారు. ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల తిమ్మాపూర్ గ్రామానికి చెందిన కొలకాని శంకరయ్య, లస్మయ్య ఇద్దరు అన్నదమ్ములకు చెందిన 28 గుంటల వారసత్వ భూమిని లస్మయ్య కొడుకు రవి.. శంకరయ్యకు తెలియకుండా 2016లో ధరణిలో పట్టా చేసుకున్నాడు. దీంతో శంకరయ్య గత ఏడాది కలెక్టర్ కు ప్రజావాణి లో ఫిర్యాదు చేశారు. వారసత్వ భూమిపై విచారణ చేసి ఇద్దరికీ సమానంగా పంచాలని కలెక్టర్ ఆదేశించారు. ఎల్లారెడ్డిపేట తహసిల్దార్ క్షేత్రస్థాయిలో సర్వే చేసి నివేదికను సిరిసిల్ల ఆర్డీఓకు %ష్ట్ర% పంపగా, అక్కడ పెండింగ్ లో ఉంది. ఈ క్రమంలో తన భూ సమస్యను పరిష్కరించాలని కలెక్టర్ కు సోమవారం ప్రజావాణిలో శంకరయ్య ఫిర్యాదు చేయగా, వెంటనే సిరిసిల్ల ఆర్డీఓను పిలిచి తానూ ఆదేశించినా భూ సమస్యను పరిష్కరించరా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే భూ సమస్యను పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. ఇక్కడ అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, సిరిసిల్ల ఆర్డీవో వెంకటేశ్వర్లు, జడ్పీ సీఈవో వినోద్ కుమార్, డీఆర్డీఓ శేషాద్రి తదితరులు పాల్గొన్నారు.

# నేత కార్మికులను మోసం చేసిన కేసులో ఐదుగురు వ్యక్తులకు మూడు ఏళ్ల జైలు శిక్ష

- ఒక్కొక్కరికి 5000/- రూపాయల జరిమానా




సిరిసిల్ల (ప్రశ్న న్యూస్) ప్రభుత్వం, నేత కార్మికులను మోసం చేసిన కేసులో ఐదుగురు వ్యక్తులకు మూడు సంవత్సరాల జైలు శిక్షతోపాటు ఒక్కొక్కరికి 5000 రూపాయల జరిమానా విధిస్తూ సిరిసిల్ల ప్రథమ స్థాయి న్యాయమూర్తి ప్రవీణ్ సోమవారం తీర్పు వెల్లడించినట్లు సిరిసిల్ల పట్టణ సిఐ కృష్ణ తెలిపినారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ప్రభుత్వం సిరిసిల్లలో ఉన్న నేత కార్మికులకు పని కల్పించి ఆదుకోవాలనే ఉద్దేశ్యంతో సిరిసిల్లలో ఉన్న మ్యాచవల్లి ఆడెడ్ కోఆపరేటివ్ సొసైటీలో ఉన్న కార్మికులతో మాత్రమే బట్టలను తయారు చేయించి దాన్ని ప్రభుత్వం నిబంధనలో ప్రకారం కొనుగోలు చేయాలి దానిలో భాగంగా సిరిసిల్లలో ఉన్న జాగృతి మ్యాక్ సొసైటీ ముఖ్య సభ్యులు ఆగు కొండబత్తిని మల్లేశం (అధ్యక్షులు) బొల్లబత్తి లక్ష్మీనారాయణ (ఉపాధ్యక్షులు) కట్ల శ్రీనివాస్( కార్యదర్శి) చింతకింది సత్యం( డైరెక్టర్ ) మరియు బొడ్డు గోపాల్( డైరెక్టర్లు ) జెబి నగర్ సిరిసిల్ల అనువారు ప్రభుత్వం, నేత కార్మికులను మోసం చేసి అధిక లాభాలు పొందాలని ఉద్దేశంతో వారు నేత కార్మికులలో బట్టలను నియమించకుండా బయట నుండి బట్టలను కొనుగోలు చేసి ప్రభుత్వంకు అమ్ముచున్నారు. దీనిలో భాగంగా వారు బట్టలను వ్యవసాయం మార్కెట్ కమిటీ ఇందిరానగర్ సిరిసిల్ల గోదాంకు తీసుకురాగా టెక్స్టైల్ డిపార్ట్మెంట్ కి సంబంధించిన సాంకేతిక అధికారులు పక్కకు పెట్టిగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు టెక్స్టైల్ పవర్ డిపార్ట్మెంట్లో ఏ.డి. పని చేస్తున్నా అశోక్ రావు తనిఖీ చేసి తేదీ 29-05-2017 రోజున సుమారుగా 13 లక్షల సరుకును సీజ్ చేసి జాగృతి మ్యాక్స్ సొసైటీ సభ్యులు కొండబత్తిని మల్లేశం బొల్లాబత్తిని లక్ష్మీనారాయణ, కట్ల శ్రీనివాస్, చింతకింది సత్యం మరియు బొడ్డు గోపాలు అధిక లాభాలు పొందాలని ఉద్దేశంతో ప్రభుత్వం, నేత కార్మికులను మోసం చేయగా వీరిపై అశోక్ రావు సిరిసిల్ల పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా అప్పటి ఎస్.ఐ మాచినేని రవి కేసు నమోదు చేసి విచారణ అనంతరం విచారణ అధికారి అయిన శేఖర్ కోర్టులో చార్జిషీట్ దాఖలు చేసినాడు. సి ఎం ఎస్. ఆర్ ఎస్ ఐ శ్రావణ్ ఆధ్వర్యంలో కోర్టు కానిస్టేబుల్ వేముల నరేష్ పదిమంది (10)సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టినారు. ప్రాసిక్యూషన్ తరపున పబ్లిక్ ప్రాసిక్యూటర్ చలుమూల సందీప్ వాదించగా కేసు పూర్వపరాలు పరిశీలించిన న్యాయమూర్తి ప్రవీణ్ గారు నేరస్తులు ఆయన కొండబత్తిని మల్లేశం, బల్లబత్తిని లక్ష్మీనారాయణ, కట్ల శ్రీనివాస్,చింతకింది సత్యం, బొడ్డు గోపాల్ లకు మూడు సంవత్సరాల కఠిన కారాగార జైలు శిక్షతోపాటు ఒక్కొక్కరికి 5000 రూపాయల జరిమానా మొత్తం (25000) విధించడం జరిగింది అని సిరిసిల్ల పట్టణ సీఐ కృష్ణ తెలిపినారు.

# ఉగ్రావతారం శాంతించేలా లేదు



యానిమేషన్ మూవీ మహావతార్ నరసింహ బాక్సాఫీస్ వద్ద సంచలనం రేపుతోంది. హరిహర వీరమల్లుకు పోటీగా ఒక రోజు ఆలస్యంగా రిలీజైన ఈ సినిమా మీద ముందు పెద్దగా అంచనాలు లేవు. రిలీజ్ రోజు అన్ని కేంద్రాల్లో షోలు కూడా చాలా తక్కువగా పడ్డాయి. అయితే మౌత్ టాక్ బాగుంటే ఎలాంటి ప్రమోషన్లు చేయకపోయినా జనాలు థియేటర్లకు కదిలి వస్తారని ఈ సినిమా ఋజువు చేస్తోంది. హైదరాబాద్ అడ్వాన్స్ బుకింగ్స్ లో పదో రోజులో ఉన్న మహావతార్ 1 కోటి 40 లక్షలకు పైచిలుకు వసూలు చేయగా ఇంకా నాలుగో రోజులోనే ఉన్న కింగ్డమ్ 98 లక్షల దగ్గరే ఉండటం ట్రెండ్ ఎటు ఉందో సూచిస్తోంది. బుక్ మై షోలో సండే ప్రతి గంటకు సగటున 11 వేలకు పైగా టికెట్లు అమ్ముడుపోతున్న చిత్రం మహావతార్ నరసింహ ఒక్కటే. దీని ఓవర్ ఫ్లోస్ ఇతర సినిమాల కలెక్షన్లకు ఉపయోగపడుతున్నాయనే కామెంట్లు ట్రేడ్ వర్గాల్లో వినిపిస్తున్నాయి. ఇప్పటికే ప్రపంచవ్యాప్తంగా డెబ్భై కోట్ల గ్రాస్ దాటేసిన ఈ డివోషనల్ డ్రామా ఇంకో వారంలో వంద కోట్ల మైలురాయిని అందుకోవడం ఖాయం. ఇప్పటిదాకా ఏ భాషలోనూ ఒక యానిమేషన్ మూవీ ఇంత వసూలు చేయడం ఎప్పుడూ జరగలేదు.

ఇరవై సంవత్సరాల క్రితం హనుమాన్ మంచి విజయం సాధించింది కానీ కలెక్షన్ల పరంగా రికార్డులు నమోదు చేయలేదు. మహావతార్ నరసింహ ఇప్పట్లో శాంతించేలా లేదని ఇండస్ట్రీ టాక్. ఆగస్ట్ 14 కూలి, వార్ 2 వచ్చేదాకా ఈ పరిస్థితిలో పెద్దగా మార్పు ఉండదని అంటున్నారు. సహనిర్మాతగా ఉన్న హొంబాలే ఫిలింస్ సైతం ఇంత పెద్ద రెస్పాన్స్ ఊహించలేదేమో. బిజినెస్ లో ఇన్వాల్ అయిన బయ్యర్లలందరూ మంచి లాభాలు కళ్లజూస్తున్నారు.



# ఏం చేస్తే ఏంటిలే.. అప్పుడే ఉండాలి !

కృతిశెట్టి... అప్పట్లో తెలుగు చిత్ర పరిశ్రమలో ఓ ఊపు ఊపింది... స్టార్ హీరోయిన్ హోదాను ఎంజాయ్ చేసింది... ఒక్కోసారి 3 షిఫ్టుల్లో పనిచేసి... బిజీ బిజీగా గడిపింది. వరుస ఫ్లాపులతో సినిమాలు లేక ఖాళీగా ఉంటోంది. అప్పట్లో మడి కట్టుకొని కూర్చున్న ఈ కుర్ర హీరోయిన్... ఇప్పుడు కాస్త బోల్డ్ గా కనిపిస్తే ఛాన్సులు వస్తాయేమోనని ఆశ పడుతోంది... అందుకే సోషల్ మీడియాలో అప్పుడప్పుడు ఫోటో షూట్స్ లో కనిపిస్తూ అందాలు ఆరబోస్తోంది. ప్రస్తుతం తమిళంలో చేస్తున్నా... తెలుగులో మాత్రం ఐరెన్ లెగ్ అంటున్నారు. ఇప్పుడు ఏం చేస్తే ఏం లాభం... అప్పుడే ఇవన్నీ చేస్తే ఎంత బాగుండేది అంటున్నారు కృతిశెట్టి అభిమానులు.

# అనుష్క 'ఘాటీ' పై లేటెస్ట్ అప్ డేట్ !

అనుష్కలీడ్ రోల్ లో 'ఘాటీ' అనే ఫిమేల్ ఓరియెంటెడ్ సినిమా రాబోతున్న సంగతి తెలిసిందే. 'ఘాటీ'లో మరో గెస్ట్ రోల్ ఉందని, ఆ పాత్రలో ఓ బిగ్ హీరో నటిస్తున్నాడని ఆ మధ్య వార్తలు వైరల్ అయ్యాయి. ఇప్పుడు తాజాగా వినిపిస్తున్న అప్ డేట్ ప్రకారం ఈ సినిమాలో పాత్రల పరిచయం కోసం ఓ హీరో వాయిస్ ఓవర్ చెప్పబోతున్నట్లు తెలుస్తోంది. దీంట్లో ఎంతవరకు నిజం ఉందో చూడాలి. ప్రస్తుతం అనుష్క మలయాళంలో ఓ సినిమా చేస్తోంది. ఆ సినిమాతో పాటు ఘాటీ సినిమాలో మాత్రమే అనుష్క నటిస్తోంది. ఇక ఈ సినిమా థియేటర్ లో రిలీజ్ అయిన తర్వాత ఘాటీ అమెజాన్ లోకి రానుంది. ఈ చిత్రాన్ని పాన్ ఇండియా మూవీగా మేకర్స్ రూపొందించారు. ఈ సినిమాను ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్‌టైన్‌మెంట్స్, యూవీ క్రియేషన్స్ బ్యానర్లు సంయుక్తంగా ప్రొడ్యూస్ చేస్తున్నాయి. ఈ సినిమా పై మంచి అంచనాలు ఉన్నాయి.

# సోషల్ మీడియాని షేక్ చేస్తున్న 'ఓజి' సాంగ్



పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ కి ఒక్క సరైన సినిమా పడితే ఎలా ఉంటుందో ఇప్పుడు తన అవైటెడ్ చిత్రం "ఓజి" చూపిస్తుంది. ఎప్పుడు నుంచో భారీ హైప్ ని సెట్ చేసుకున్న ఈ సినిమా ఎట్టకేలకి రిలీజ్ కి దగ్గరకి వస్తుండగా ఈ గ్యాప్ లో మేకర్స్ ఫస్ట్ సాంగ్ ని విడుదల చేశారు. ఈ సాంగ్ కి భారీ రెస్పాన్స్ వస్తోంది. ఒక్క మాటలో చెప్పాలంటే ఊచకోత రెస్పాన్స్ తో దుమ్ము లేపింది. టాలీవుడ్ లోనే ఆల్ టైం హైయెస్ట్ లైక్స్ అందుకున్న సాంగ్ గా ఇప్పుడు బిగ్గెస్ట్ రికార్డు సెట్ చేసింది. ఇది కూడా 24 గంటలు పూర్తి కాకుండానే. ఈ లెక్కన సినిమా కోసం ఫ్యాన్స్ ఎంత పిచ్చిగా వెయిట్ చేస్తున్నారో అర్ధం చేసుకోవచ్చు. ఈ సినిమాకి థమన్ సంగీతం అందిస్తుండగా ఈ ఫస్ట్ సింగిల్ ఇప్పుడు మొత్తం సోషల్ మీడియాని షేక్ చేస్తుంది. ఈ మూవీకి డీవీవీ ఎంటర్టైన్మెంట్స్ నిర్మాణం వహిస్తుండగా ఈ సెప్టెంబర్ 25న గ్రాండ్ గా రిలీజ్ కి రాబోతుంది.

# దేవర2 స్టార్ట్ అయ్యేది అప్పుడే



మ్యాన్ ఆఫ్ మాసెస్ ఎన్టీఆర్ వరుస సక్సెస్‌లతో ఫుల్ జోష్ మీదున్నారు. దేవర సినిమాతో సక్సెస్ అందుకున్న ఎన్టీఆర్, ఇప్పుడు ఓ వైపు వార్2 సినిమాను రిలీజ్ కు రెడీ చేస్తూనే మరోవైపు ప్రశాంత్ నీల్ డైరెక్షన్ లో మరో సినిమా చేస్తున్నారు. వార్2 ఆగస్ట్ 14న రిలీజ్ కాబోతుంది. ఎన్టీఆర్ ఈ సినిమాతోనే బాలీవుడ్ ఎంట్రీ ఇస్తున్నారు. ప్రస్తుతం ప్రశాంత్ నీల్ డైరెక్షన్ లో ఓ యాక్షన్ థ్రిల్లర్ షూటింగ్ జరుపుకుంటోంది. ఈ సినిమా కోసం ఎన్టీఆర్ చాలా స్టైలిష్ గా తయారయ్యారు. అయితే ఈ సినిమాను నవంబర్ లేదా డిసెంబర్ కల్లా పూర్తి చేయాలని తారక్ ప్లాన్ చేస్తున్నారట. డ్రాగన్ అనే వర్కింగ్ టైటిల్ తో తెరకెక్కుతున్న ఈ సినిమా తర్వాత తారక్ దేవర2 ను చేయబోతున్నారు.

ప్రస్తుతం దేవర2కు సంబంధించిన స్క్రిప్ట్ వర్క్, ప్రీ ప్రొడక్షన్ వర్క్ లో బిజీగా ఉన్నారట. అంతా అనుకున్నట్టు జరిగితే దేవర2 సినిమా జనవరి లేదా ఫిబ్రవరి నుంచి షూటింగ్ మొదలు పెట్టాలని చూస్తున్నారట కొరటాల. దేవర సినిమాకు సీక్వెల్ గా తెరకెక్కనున్న ఈ సినిమాలో మొదటి భాగంలో ఉన్న చాలా ప్రశ్నలకు సమాధానం దొరకనుండటంతో దేవర2పై భారీ హైప్ నెలకొంది.




# దేశవ్యాప్తంగా జేజేలు.. పలుకుతున్నారు

హొంబాలే ఫిల్మ్స్ సమర్పణలో క్లీమ్ ప్రొడక్షన్స్ నిర్మించిన చిత్రం 'మహావతార్ నరసింహ'. అశ్విన్ కుమార్ దర్శకత్వం వహించారు. శిల్పా ధావన్, కుశాల్ దేశారు చైతన్య దేశారు నిర్మించారు. గీతా ఫిల్మ్ డిస్ట్రిబ్యూషన్ ద్వారా జూలై 25న ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో విడుదలైన ఈ చిత్రం అద్భుతమైన విజయాన్ని అందుకుంది. భారతదేశంలో అత్యధిక వసూళ్లు సాధించిన యానిమేటెడ్ సినిమాగా రికార్డ్ క్రియేట్ చేసి, సక్సెస్‌ఫుల్‌గా రన్ అవుతుంది. ఈ సందర్భంగా మేకర్స్ నిర్వహించిన సక్సెస్‌మీట్‌లో నిర్మాత అల్లు అరవింద్ మాట్లాడుతూ,'హొంబలే ఫిల్మ్స్ సంస్థతో నాకు మంచి అనుబంధం ఉంది. నిర్మాత విజరు ఫోన్ చేసి, ఈ సినిమాని తెలుగులో మీరు విడుదల చేయాలని అని అడిగారు. అంతకుమించి ఏం మాట్లాడుకోలేదు. వెంటనే ఓకే అన్నాను. సినిమా విడుదలైన రోజు మార్నింగ్ షోకి వచ్చిన రెస్పాన్స్‌ని దృష్టిలో పెట్టుకుని ఈవెనింగ్ కొన్ని షోస్ పెంచాం. మరుసటి రోజు నుంచి మరిన్ని స్క్రీన్స్ పెంచుకుంటూ వెళుతున్నాం. భారతదేశం అంతటా ప్రేక్షకులు ఈ సినిమాకి జేజేలు పలుకుతున్నారు. హైదరాబాద్‌లోని ఏఎంబీలో 200 మంది స్వాములు ఈ చిత్రాన్ని చూశారు.

ఎప్పుడూ థియేటర్స్ రాని ప్రేక్షకులు ఈ సినిమాని వీక్షిస్తున్నారు. సినిమా చూసిన ప్రేక్షకులు ఉద్వేగంతో తమ తోటివారితో సినిమా గురించి గొప్పగా చెబుతున్నారు. మా కుటుంబం, సన్నిహితులు, పరిచయం ఉన్నవారందరిలో సనాతన ధర్మం గురించి పవన్ కల్యాణ్‌కి తెలిసినంతగా మరెవరికీ తెలియదు. ఆయన సనాతన ధర్మం గురించి ప్రసంగిస్తే అందరూ ముగ్ధులవుతాం. ఈ చిత్రాన్ని ఆయన చూడాలని, దాని గురించి మాట్లాడాలని కోరుకుంటున్నాను' అని అన్నారు.

# 'బేబి'కి అవార్డొచ్చింది.. గొడవ సద్దుమణిగింది



టాలీవుడ్లో చిన్న సినిమాల్లో సెన్సేషనల్ హిట్స్ లిస్టు తీస్తే 'బేబి' పేరు అందులో కచ్చితంగా ఉంటుంది. వైష్ణవి చైతన్య, ఆనంద్ దేవరకొండ, విరాజ్ అశ్విన్ లాంటి అప్‌కమింగ్ ఆర్టిస్టులను పెట్టుకుని దర్శకుడిగా రెండు సినిమాల అనుభవం ఉన్న సాయి రాజేష్ పరిమిత బడ్జెట్లో రూపొందించిన ఈ చిత్రం రెండేళ్ల కిందట బాక్సాఫీస్ దగ్గర ప్రకంపనలు రేపింది. ఏకంగా వంద కోట్ల వసూళ్లతో పెద్ద షాకే ఇచ్చింది. ఐతే ఈ విజయం తర్వాత ఇదే టీం కలిసి ఇంకో సినిమాను అనౌన్స్ చేసింది.ఆనంద్-వైష్ణవి జంటగా.. సాయిరాజేష్ స్క్రిప్టుతో, ఎస్కేఎన్ నిర్మాణంలో ఆ సినిమాను ప్రకటించారు. కానీ ఏం జరిగిందో ఏమో.. తర్వాత ఈ టీం బ్రేక్ అయిపోయింది. ఆనంద్, వైష్ణవి ఈ సినిమా నుంచి వైదొలిగారు. వారి స్థానంలోకి కిరణ్ అబ్బవరం, శ్రీ గౌరీప్రియ వచ్చారు. ప్రస్తుతం ఆ సినిమా షూటింగ్ జరుపుకుంటోంది. కాగా.. ఆనంద్, వైష్ణవిలతో సాయి రాజేష్, ఎస్కేఎన్‌లకు ఏదో గొడవ జరిగిందంటూ ఆ మధ్య గట్టి ప్రచారమే జరిగింది. తెలుగమ్మాయిలను ఎంకరేజ్ చేయకూడదంటూ వేరే ఈవెంట్లో ఎస్కేఎన్ చేసిన కామెంట్.. వైష్ణవిని ఉద్దేశించే అన్న చర్చ జరిగింది. తర్వాత ఈ కామెంట్ల మీద ఎస్కేఎన్ వివరణ ఇచ్చినా జనాలకు సందేహాలు తొలగిపోలేదు. ఐతే ఇప్పుడు 'బేబి' సినిమాకు రెండు నేషనల్ అవార్డులు వచ్చిన నేపథ్యంలో మొత్తం కథ మారిపోయింది. ఈ సందర్భంగా పెట్టిన ప్రెస్ మీట్‌కు సాయి రాజేష్, ఎస్కేఎన్ మాత్రమే కాక.. ఆనంద్, వైష్ణవి సైతం వచ్చారు. అందరూ కలుపుగోలుగా కనిపించారు. మీడియా ముందు కూడా ఫ్రెండ్లీగా మాట్లాడారు. ఐతే మీడియా వాళ్లు పాత విషయాలు గుర్తు చేసి వాళ్లను ఇబ్బంది పెట్టే ప్రయత్నం చేయలేదు.

# 'మహావతార్ నరసింహ' రికార్డు కలెక్షన్స్

ఎలాంటి అంచనాలు లేకుండా వచ్చి, భారీ హిట్స్ గా నిలిచిన సినిమాలు చాలానే ఉన్నాయి. అలా వచ్చిన ఓ సినిమా ఇప్పుడు బాక్సాఫీస్‌ను షేక్ చేస్తుంది. థియేటర్స్ లో దుమ్మురేపుతోంది. స్టార్ హీరోలు, పెద్ద డైరెక్టర్, భారీ సెట్లు ఇలా ఏవీ లేకుండానే వచ్చిన ఆ సినిమా వసూళ్ల వర్షం కురిపిస్తోంది. ఆ సినిమానే 'మహావతార్ నరసింహ'. ఎలాంటి ఎక్స్ పెక్టేషన్స్ లేకుండా వచ్చిన మహావతార్ నరసింహ థియేటర్స్ లో దూసుకుపోతోంది. ఈ సినిమా చూడటానికి ఆడియన్స్ ఎక్కువ ఇంట్రెస్ట్ చూపిస్తున్నారు.

లేటేస్ట్ గా ఈ మూవీ 8 రోజుల్లోనే రూ.60 కోట్లకు పైగా వసూళ్లను రాబట్టినట్లు హొంబలే ఫిల్మ్స్ ప్రకటించింది. "అన్ని రికార్డులను అధిగమించి, కేవలం 8 రోజుల్లో రూ. 60.5 కోట్లకు పైగా వసూలు చేసి భారతదేశంలో అత్యధిక వసూళ్లు సాధించిన యానిమేటెడ్ చిత్రంగా నిలిచింది"

అంటూ ట్వీట్ చేసింది. ఈ సినిమాకు అశ్విన్ కుమార్ దర్శకత్వం వహించారు. మహా విష్ణువు దశావతారాల ఆధారంగా పదేళ్లపాటు వరుసగా సినిమాలు రాబోతున్నాయి. 'మహావతార్' సినిమాటిక్ యూనివర్స్ పేరుతో మేకర్స్ ఏడాదికి ఓ సినిమాను విడుదల చేయనున్నట్లు ఇప్పటికే ప్రకటించారు.



## నాగుల మల్లయ్య స్ఫూర్తి

# మరిచిపోలేనిది - ఆది శ్రీనివాస్

**- బీసీ రిజర్వేషన్ల కోసం ఢిల్లీలో పోరాటం - ఆది**



**వేములవాడ,(ప్రశ్న న్యూస్)** బీసీల హక్కుల సాధన కోసం కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు ఢిల్లీలో కాంగ్రెస్ పార్టీ పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడుతుందని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ తెలిపారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు మూడు రోజులపాటు వివిధ రూపాల్లో విజ్ఞాపనలు చేస్తూ నిరసనలు తెలియజేయనున్నారని ఆయన వెల్లడించారు.సోమవారం రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో జరిగిన నాగుల మల్లయ్య స్మారక పురస్కార ప్రధాన కార్యక్రమం లో పాల్గొన్న ఆయన, చేనేత కళాకారుడు వెల్తి హరిప్రసాద్ కు పురస్కారాన్ని అందజేశారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ,"నాగుల మల్లయ్య తన కాలంలోనే బీసీల హక్కుల కోసం ఎన్నో పోరాటాలు చేశారు.

బీసీల రాజకీయ, సామాజిక ఎదుగుదల కోసం అనేక కార్యక్రమాలు చేపట్టారు. ఆయన స్ఫూర్తితోనే ప్రతీ ఏటా ఈ అవార్డులు అందజేయడం గర్వకారణం" అని ఆది శ్రీనివాస్ అన్నారు.బీసీ రిజర్వేషన్లపై కేంద్రం ఆలస్యం చేస్తోందని ఆయన విమర్శించారు. "టెలంగాణలో 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని అసెంబ్లీలో ఆమోదించిన తీర్మానాన్ని నైన్త్ షెడ్యూల్లో చేర్చమని పంపినా కేంద్రం కాలయాపన చేస్తోంది. బీజేపీ రాష్ట్రంలో ఒకలా, కేంద్రంలో మరోలా మాట్లాడుతోంది" అని ఆది శ్రీనివాస్ మండిపడ్డారు.

# టీమ్ ఇండియా సంచలన విజయం

**- సిరాజ్‌పై చంద్రమౌళి అభినందనలు**



**కరీంనగర్,(ప్రశ్న న్యూస్)** ఇంగ్లాండ్‌తో ఉత్కంఠభరితంగా జరిగిన ఐదో టెస్టులో టీమ్ ఇండియా చారిత్రాత్మక విజయాన్ని నమోదు చేసింది. రెండు ఇన్నింగ్స్‌ల్లో 9 వికెట్లు పడగొట్టి "ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్" అవార్డును గెలుచుకున్న హైదరాబాద్ పేసర్ మహమ్మద్ సిరాజ్ ప్రదర్శనకు భాజపా కరీంనగర్ జిల్లా నాయకులు అనుమల్ల చంద్రమౌళి హృదయపూర్వక అభినందనలు తెలిపారు.ఇంగ్లాండ్ గడ్డపై భారత్ సాధించిన ఈ మరుపురాని విజయం గర్వకారణమని, సిరాజ్ అద్భుత బౌలింగ్‌తో విజయానికి కీలకంగా నిలిచారని చంద్రమౌళి పేర్కొన్నారు.

## నిరుపేద దళిత కుటుంబానికి

# న్యాయం చేయాలి

**- ప్రజావాణిలో అడిషనల్ కలెక్టర్ వినతి.**



**పెద్దపల్లి ( ప్రశ్న న్యూస్)** పెద్దపెల్లి జిల్లా సమీకృత కలెక్టరేట్ ప్రజావాణి కార్యక్రమంలో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో అడిషనల్ కలెక్టర్ కు వినతి పత్రం ఇవ్వడం జరిగింది.పెద్దపల్లి జిల్లా మంథని మండలం కూచ్ రాజ్ పల్లి గ్రామా నిరుపేద దళిత కుటుంబానికి చెందిన నక్క శేఖర్,నక్క వివేక్ తండ్రి: అశాలు అను మాకు మంథని మండలం బట్టుపల్లి గ్రామంలో సర్వేనెంబర్ 53/అ1/1/1లో ఒక ఎకరం విస్తీర్ణం భూమి మా నాన్న నక్క పోచం తండ్రి ఆశాలు పేరిట పట్టాదారు పాసు పుస్తకం భూమి యజమాని హక్కు పత్రం పొంది ఉన్నప్పటికీని గత కొన్ని సంవత్సరాలుగా బట్టుపల్లి గ్రామానికి చెందిన అప్పాల అశోక్ తండ్రి: శేరాలు అను యాదవ కులానికి చెందినవారు మా యొక్క ఎకరం భూమిని సాగు చేసుకుంటూన్నారు సంబంధిత రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకొని హద్దులు వేసి మా ఎకరం భూమి మాకు ఇచ్చినప్పటికిని మీకు భూమి ఎక్కడిది అంటూ దళితులు మీరు మాదిగ జాతికి చెందినవారు అని బూతులు తిడుతూ కొడవళ్లు గుడ్డలతో మా భూమి దగ్గరికి వెళితే మమ్మల్ని చంపుతానని బెదిరిచేసిన్నారు అధికారులు సర్వే చేసి మాభూమి మాకు ఇప్పించినప్పటికీ కూడా ఆ భూమిలోకి రాకుండా మమ్మల్ని చంపుతానని భయభ్రాంతులకు గురి చేస్తున్నటువంటి అప్పల అశోక్ వారి కుటుంబం పైన చట్టరిత్య చర్యలు తీసుకొని మా ఎకురం భూమి మాకు ఇప్పించి నిరుపేద దళిత జాతికి చెందిన మాకు మరియు మా కుటుంబానికి న్యాయం చేస్తారని విజ్ఞప్తి చేసారు ఈ వినతిపత్రం ఇచ్చిన వారిలో దళిత ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు

# శిశువులకు తల్లిపాలు అత్యంత శ్రేయస్కరం

**- ఐసిడిఎస్ సూపర్వైజర్ : నిర్మల**

**- తడగొండ అంగన్వాడీ కేంద్రంలో ఘనంగా తల్లిపాల వారోత్సవాలు**



**బోయినిపల్లి,(ప్రశ్న న్యూస్)** బోయినిపల్లి మండలంలోని తడగొండ గ్రామ అంగన్వాడీ కేంద్రంలో సోమవారం తల్లిపాల వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఐసిడీఎస్ సూపర్వైజర్ నిర్మల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో తల్లిపాల ప్రాధాన్యతపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా సూపర్వైజర్ నిర్మల మాట్లాడుతూ, "శిశువులకు తల్లిపాలే అత్యంత శ్రేయస్కరమని,శిశువు ఆరోగ్యకరంగా పెరగడానికి తల్లిపాలు తప్పనిసరి. ఆరు నెలల పాటు తల్లిపాలు మాత్రమే ఇవ్వాలి, ఇతర ద్రవ పదార్థాలు ఇవ్వకూడదు" అని పేర్కొన్నారు. గర్భిణీలు సీజనల్ పండ్లు, ఆకుకూరలు, పాలు, గుడ్లు, వేరుశెనగలు, బెల్లం వంటివి ఆహారంలో చేర్చుకోవాలని సూచించారు.వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచడం ద్వారా అనారోగ్య సమస్యలు దూరం అవుతాయని ఆమె తెలిపారు.ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్వైజర్ హేమలత, ఏఎన్ఎం వసంత, అంగన్వాడీ టీచర్ రాజమణి,ఆశా వర్కర్లు, గర్భిణీలు,తల్లులు,పిల్లలు తదితరులు పాల్గొన్నారు.

# కన్నెపల్లి పంప్ హౌస్‌ను ముట్టడించిన గులాబి నేతలు

- రైతన్నకు నీళ్లు అందే వరకు పోరాటం ఆగదు - బీఆర్ఎస్
- కాళేశ్వరం పంపులను వెంటనే నడపాలి - ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు
- కాంగ్రెస్ కుట్రలు - రైతులకు దెబ్బ
- వారంలోగా పంపులు ఆన్ చేయకపోతే లక్ష మందితో పంప్ హౌస్ ను ముట్టడిస్తామని హెచ్చరిక
- కన్నెపల్లి ముట్టడిలో.... నియోజకవర్గం ఇంచార్జి : చల్మెడ హాజరు





**వేములవాడ,(ప్రశ్న న్యూస్)** కాళేశ్వరం ప్రాజెక్టు నుంచి నీటిని ఎత్తిపోసే పనులు నిలిపివేయడం ద్వారా తెలంగాణ రైతులను కష్టాల్లోకి నెట్టేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కుట్రలు పన్నుతోందని బీఆర్ఎస్ పార్టీ నాయకులు తీవ్రంగా విమర్శించారు. సోమవారం కరీంనగర్ ఉమ్మడి జిల్లా బీఆర్ఎస్ నేతలు మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుకర్ ఆధ్వర్యంలో కన్నెపల్లి పంప్ హౌస్ వద్ద ధర్నా నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, "వెంటనే కాళేశ్వరం పంప్ హౌస్ మోటర్లను ఆన్ చేసి సాగునీరు విడుదల చేయాలి. ఇప్పటికే నార్లు ఎండిపోతున్నాయి, బోర్లు ఆరిపోతున్నాయి. రైతులు ఇబ్బందులు పడుతున్నారు.

ఇలాంటి పరిస్థితుల్లో కూడా కాంగ్రెస్ ప్రభుత్వం కుతంత్రాలు ఆపడం లేదు" అని మండిపడ్డారు.పంప్ హౌస్ వద్ద ధర్నా చేపట్టిన బీఆర్ఎస్ శ్రేణులను పోలీసులు అడ్డుకునే ప్రయత్నం చేశారు.ధర్నాలో మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, మాజీ ఎంపీ వినోద్ కుమార్, వేములవాడ నియోజకవర్గం ఇంచార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు, మాజీ ఎమ్మెల్యేలు,మాజీ ఎమ్మెల్సీలు,మాజీ జడ్పీ చైర్‌పర్సన్లు, జడ్పీటీసీలు, మాజీ ఎంపీపీలు, ఎంపీటీసీలు,మాజీ సర్పంచులు,మాజీ కౌన్సిలర్లు, ప్రజా ప్రతినిధులు,బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం



**శ్రీకాళహస్తి(ప్రశ్న న్యూస్)** ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలలో భాగంగా చేనేత కార్మికులకు ఉచిత విద్యుత్ పథకం అమలు చేయడం పై 6 వార్డు చేనేత కార్మికుల ప్రతినిధి గురజాల పద్మజ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు కు కృతజ్ఞతలు తెలిపారు. ముందుగా చేనేత కార్మికులతో కలిసి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, శ్రీకాళహస్తి నియోజకవర్గం ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. చేనేత కార్మికుల కష్టాలను గుర్తించి సాధారణ మగ్గాలకు 200 యూనిట్లు, మరమగ్గాలకు 500 యూనిట్ల ఉచిత విద్యుత్ ఇచ్చినందుకు చేనేత కార్మికుల తరపున కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 70 వేల చేనేత కార్మిక కుటుంబాలకు ఈ ఉచిత విద్యుత్ పథకం ద్వారా ఎంతో లబ్ధి చేకూరుతుందని అన్నారు. చేనేత కార్మికుల కష్టాలను గుర్తించి ఇచ్చిన మాట ప్రకారం ఉచిత విద్యుత్ పథకాన్ని ప్రకటించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కు, నారా లోకేష్ కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమం లో స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు తీర్థం వెంకటేశ్వర్లు,నీలి వెంకటేశ్వర్లు, పైడి చంద్ర బాబు,ఆదిన మునిరాఘవులు,సత్రం గరటయ్య,బత్తల సుబ్రహ్మణ్యం, బత్తల వెంకటేశ్వర్లు,బశాబత్తిని మోహన్, యుగంధర్, లీలా, మీనా, చేనేత కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## రేవంత్ రాజ్ ఆధ్వర్యంలో

# ఫలహార బండి ఊరేగింపు

**- శోభాయాత్రతో నిండిన శ్రావణ భక్తి**



**శేర్లింగంపల్లి (ప్రశ్న న్యూస్)** భాగ్యనగరంలోని హైటెక్ హబ్బుగా పేరుగాంచిన శేరిలింగంపల్లిలో శ్రావణ మాస బోనాల పర్వదినం ఆదివారం భక్తిశ్రద్ధలతో, వైభవంగా జరిగింది. శ్రీ శ్రీ పోచమ్మ తల్లికి ఫలహార బండి శోభాయాత్రను ఏఆర్ ఫౌండేషన్ చైర్మన్ రేవంత్ రాజ్ స్వయంగా తన ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. సంప్రదాయ వేషధారణలో మహిళలు, యువత, చిన్నారులు డప్పులు, కోలాటాలు, సంగీత బృందాలతో పాల్గొని పండుగ వాతావరణాన్ని సజీవంగా తీర్చిదిద్దారు. పల్లకీపై ఫలహార బండి ఊరేగింపు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. వివిధ రాజకీయ పార్టీల నేతలు, సంఘాల ప్రతినిధులు, పాత్రికేయులు పాల్గొని తల్లికి నమస్కరించి ఆశీర్వాదాలు పొందారు. కార్యక్రమం ఆరంభం నుంచి ముగింపు వరకు ప్రతి ఏర్పాటును రేవంత్ రాజ్ స్వయంగా పర్యవేక్షించారు. పోచమ్మ తల్లికి ప్రత్యేక పూజలు చేసి, కుటుంబ సభ్యులతో కలిసి ఆశీర్వాదాలు తీసుకున్నారు. భక్తి, శ్రద్ధ, సంప్రదాయ సౌందర్యంతో నిండిన శోభాయాత్ర చూసినవారిని మైమరిపించింది.ఆధునికతకు ప్రతీకగా వెలుగుతున్న శేరిలింగంపల్లిలో ఇలాంటి సంప్రదాయబద్ధమైన బోనాల ఉత్సవాలు జరగడం తెలంగాణ సాంస్కృతిక వారసత్వానికి ప్రతీకగా నిలుస్తోందని స్థానికులు అభిప్రాయపడ్డారు.

# యువత స్వయం ఉపాధి దిశగా ముందడుగు

**- అభినందించిన ఏ.ఎస్.పి శేషాద్రిని రెడ్డి**

- సృజనాత్మకత కలిగిన యువతకు వేదికగా "మ్యాడ్ ఫోటోగ్రఫీ
- ఇట్స్ ఏ న్యూ బిగినింగ్ స్టూడియో"



**వేములవాడ,(ప్రశ్న న్యూస్)** రాజన్న సిరిసిల్ల జిల్లా, వేములవాడ పట్టణంలో నలుగురు యువకులు తమ భవిష్యత్తు కోసం స్వయం ఉపాధి మార్గాన్ని ఎంచుకున్నారు. ఉద్యోగాల కోసం కొంతకాలం ప్రయత్నించినప్పటికీ అవకాశాలు లభించకపోవడంతో, సృజనాత్మకతకు వేదికగా కొత్త వ్యాపారాన్ని ప్రారంభించారు.రెండవ బైపాస్ రోడ్‌లో ఏర్పాటు చేసిన "మ్యాడ్ ఫోటోగ్రఫీ %-% ఇట్స్ ఏ న్యూ బిగినింగ్ స్టూడియో" ను సోమవారం వేములవాడ ఏ.ఎస్.పి శేషాద్రిని రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా స్టూడియోను సందర్శించి, నిర్వాహకులను అభినందించారు.హైదరాబాద్‌లో తరహాలో లభించే ఆధునిక ఫోటోగ్రఫీ పరికరాలతో వేములవాడలోనే ఇలాంటి అధునాతన స్టూడియో ఏర్పాటు చేయడం ప్రశంసనీయం అని ఆమె పేర్కొన్నారు. పాడ్కాస్ట్‌లు, ఇంటర్వ్యూలు వంటి ఆధునిక ట్రెండ్స్‌కి అనుగుణంగా సౌకర్యాలు కల్పించడం సృజనాత్మకత ఉన్న యువతకు దోహదం చేస్తుందని శేషాద్రిని రెడ్డి అన్నారు.స్థానిక ప్రజలకు అత్యాధునిక ఫోటోగ్రఫీ సౌకర్యాలు అందుబాటులోకి రావడం గర్వకారణమని, ఉద్యోగాల కోసం ఎదురుచూడకుండా స్వయం ఉపాధి మార్గం ఎంచుకున్న యువత అందరికీ ఆదర్శమని ఆమె తెలిపారు.ఈ కార్యక్రమంలో నిర్వాహకులు ఇఖ్రార్ పాషా, అరవింద్,నితిన్,సునీల్‌తో పాటు తాహేర్ పాషా, నగుబోతు రవి,కుమ్మరి శంకర్, నారాయణ రెడ్డి,ఆనంద రెడ్డి, జర్నలిస్టుల సంఘం జిల్లా అధ్యక్షులు లాయక్ పాషా తదితరులు పాల్గొన్నారు.

## ట్రాలీ అసోసియేషన్ ఎన్నికల్లో

# అధ్యక్షునిగా సల్మాన్



**మంథని( ప్రశ్న న్యూస్) 777** మంథని మున్సిపల్ పరిధిలోని స్వయంకృషి ఫ్రెండ్స్ మంథని మండల ట్రాలీ అసోసియేషన్ ఎలక్షన్లో మహమ్మద్ సల్మాన్ అధ్యక్షునిగా ఎన్నుకావడం జరిగింది.గౌరవ అధ్యక్షులుగా బుర్ర శ్రీనివాస్ ఉపాధ్యక్షుడిగా వీరబోయిన రవి, సెక్రటరీగా మేదరబోయిన మల్లేష్, కోశాధికారిగా కొప్పుల దుర్గాప్రసాద్ లను ఎన్నుకున్నాము.ఈ సందర్బంగా మంథని వ్యవసాయ మార్కెట్ వద్ద నుండి అంబేద్కర్ చౌరస్తా వరకు ట్రాలీ లతో భారీ ర్యాలీ తీయడం జరిగింది.

అనంతరం అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేయడం జరిగింది.ఈ సందర్బంగా మహమ్మద్ సల్మాన్ మాట్లాడుతూ... స్వయంకృషి ఫ్రెండ్స్ మంథని మండల ట్రాలీ అసోసియేషన్ ఎన్నికల్లో అధ్యక్షునిగా ఎన్నిక కావడం నేను సంతోషిస్తున్న.. నా ఎన్నికకు సహకరించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదములు తెలుపుతున్నాను.స్వయంకృషి ఫ్రెండ్స్ మంథని మండల ట్రాలీ అసోసియేషన్ సమస్య లను పరిష్కారించేందుకు నా వంతుగా కృషి చేస్తాను.

## మంత్రుల పర్యటన ముగియగానే

# గాయత్రి పంపుహౌస్ నిలిపివేత

- "రైతుల కోసం బీఆర్ఎస్ పార్టీ పోరాటం ఆగదు"
- చొప్పదండి మాజీ శాసనసభ్యులు : సుంకె రవిశంకర్

**రామడుగు/బోయినిపల్లి,(ప్రశ్న న్యూస్)** కాళేశ్వరం మోటర్లను మళ్లీ ప్రారంభించాలంటూ చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల ఒత్తిడి కారణంగా కాంగ్రెస్ ప్రభుత్వం పైపైకి స్పందించినట్టు చూపిస్తున్నప్పటికీ, వాస్తవానికి మోసగిస్తోందని ఆయన విమర్శించారు.ఆదివారం మంత్రులు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, పొన్నం ప్రభాకర్ కరీంనగర్, పెద్దపల్లి జిల్లాల్లో పర్యటించగా, ఎక్కడైనా నిరసనలు ఎదురవుతాయేమోనన్న భయంతో కాళేశ్వరం లింక్-2లో మోటర్లను తాత్కాలికంగా ఆన్ చేశారని తెలిపారు.ఉదయం 7.30 గంటలకు పెద్దపల్లి జిల్లా, ధర్మారం మండలంలోని నంది పంపుహౌస్‌లో ఐదో మోటర్‌ను ప్రారంభించి నంది రిజర్వాయర్‌కు నీటిని తరలించారు. అక్కడి నుంచి గాయత్రి పంపుహౌస్ (లక్ష్మీపూర్)కు నీరు చేరినా, గంటలోపే బాహుబలి మోటార్లు నిలిపివేయడం రైతుల్లో తీవ్ర అసంతృప్తిని కలిగించింది.గోదావరి జలాలు వృథాగా పోతుండగా, కన్నెపల్లి పంప్‌హౌస్ ద్వారా నీటిని ఎత్తిపోసి వరద కాలువ పరిధిలో వానకాలం వరి సాగు కోసం రైతులకు అందించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆయన కోరారు.నీటి విడుదలలో ప్రభుత్వం నిర్లక్ష్యం కొనసాగిస్తే, రైతుల పక్షాన బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఉద్యమాలు, నిరసనలు తీవ్రతరం చేస్తామని సుంకె రవిశంకర్ స్పష్టం చేశారు.



# పర్యావరణ పరిరక్షణలో రేవంత్ సర్కార్ నిర్లక్ష్యం

# పొల్యూషన్‌తో రాష్ట్రానికి ముప్పు

- మొక్కలు నాటేదెప్పుడు..? కోనో కార్పస్ చెట్లు పీకేదెప్పుడు..?
- తెలంగాణ రాష్ట వ్యాప్తంగా వేప.. ఏదైనా ఒక పండు మొక్క పంపిణీ చేయాలి
- తక్షణమే ప్రజా ప్రభుత్వం స్పందించి పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి
- కోనో కార్పస్ చెట్లతో మానవ జాతికి పెను ప్రమాదం, తొలగింపు పై చిత్తశుద్ధి ఏది



**హైదరాబాద్(ప్రశ్న న్యూస్)** తెలంగాణలో వర్షాకాలం మొదలై 2 నెలలు అవుతున్నాయి. మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడంతో ఈ కాలంలోనే భూమి తేమగా ఉండి మొక్కలు సులభంగా పెరుగుతాయి. పచ్చదనం పెంపొందించడానికి ఇది అత్యుత్తమ సమయం. కానీ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవడంలో రేవంత్ రెడ్డి సర్కార్ పూర్తిగా విఫలమవుతోంది. పర్యావరణ పరిరక్షణకు ఎటువంటి స్పష్టమైన చర్యలు తీసుకోకపోవడం రాష్ట్ర భవిష్యత్తుకే ప్రమాదకరంగా మారిందని విశ్లేషకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా పర్యావరణం పూర్తిస్థాయిలో కలుషితం అవుతుందని స్వచ్ఛమైన గాలిని అందించే మొక్కలను నాటే ప్రయత్నం చేయకపోవడం బాధాకరంగా మారుతుంది. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో లక్షల కొద్ది వాహనాలు నిత్యం పొల్యూషన్ వెదజల్లుతుంటే వాటిని కట్టడి చేయవలసిన చెట్లను పెంచడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలం చెందుతుంది. కెసిఆర్ హయాంలో ఎంతో కొంత పర్యావరణాన్ని కాపాడడంతో హైదరాబాద్ నగరంలో పొల్యూషన్ శాతం తగ్గింది ప్రస్తుతం పొల్యూషన్ శాతం పెరగడంతో పాటు కోనో కార్పస్ చెట్లను గ్రేటర్ హైదరాబాద్ ప్రాంతంలో విపరీతంగా పెంచి పర్యావరణాన్ని నాశనం చేస్తున్నారని ప్రజలు బహాటంగా విమర్శిస్తున్నారు. అసెంబ్లీలో కోనో కార్పస్ చెట్లను తొలగించాలని నిర్ణయం తీసుకున్న ఆచరణకు నోచుకోకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది ప్రజల శ్రేయస్సుపై రేవంత్ సర్కార్కు చిత్తశుద్ధి లేదని తెలుస్తోంది.

### కోనో కార్పస్ చెట్ల సమస్య - ప్రభుత్వం మొద్దు నిద్రలోనే

రాష్ట్రవ్యాప్తంగా పబ్లిక్ ప్రదేశాల్లో విస్తారంగా పెరిగిన కోనో కార్పస్ చెట్లు ప్రజారోగ్యానికి తీవ్ర హానికరమని నిపుణులు పలుమార్లు హెచ్చరించారు. ఈ చెట్లు దుమ్ము, అలెర్జీ, క్యాన్సర్ సమస్యలకు కారణమవుతుండటమే కాకుండా, జీవవైవిధ్యానికి కూడా ప్రతికూల ప్రభావం చూపుతున్నాయి. ఈ చెట్లపై పిట్టలు కూడా కూర్చోవు అంటే ఎంత హానికరమైన చెట్లు అర్థం చేసుకోవచ్చని ఇవి పూర్తిగా కార్బన్డయాక్సైడ్ వదలడంతో ప్రజలకు అనేక అనారోగ్యాలు రావడంతో పాటు జీవితకాలం కూడా తగ్గిపోతుందని పర్యావరణవేత్తలు ఎన్నిసార్లు హెచ్చరించిన ప్రభుత్వం వాటి తొలగించకపోవడం ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది. అయినప్పటికీ కాంగ్రెస్ ప్రభుత్వం ఈ చెట్లను తొలగించే పనిలో చొరవ చూపకపోవడం ఇది ప్రజల ఆరోగ్యాన్ని విస్మరించినట్లే.

### పచ్చదనం పెంపొందించేందుకు సరైన సమయం ఇదే..

వర్షాకాలంలో నాటిన మొక్కలు ఎక్కువ కాలం సజీవంగా ఉంటాయి. నాటిన మొక్కలు దాదాపు చాలావరకు చెట్లుగా ఎదగడం జరుగుతుంది. ఈ సమయంలో పర్యావరణానికి మేలు చేసే అనేక మొక్కలను శాస్త్రవేత్తలు సూచించారు వాటిని రాష్ట్రవ్యాప్తంగా వేప, రావి, పండ్ల చెట్లు నాటే కార్యక్రమాన్ని భారీ ఎత్తున చేపట్టాలి. పండ్ల చెట్టు నాటకపోవడంతో గ్రామాలలో కోతులు ఇందులోకి వస్తున్నాయి. అధికంగా ఆక్సిజన్ ని ఇచ్చే పచ్చదనం పెరిగితే వాతావరణ మార్పులు నియంత్రణలోకి వస్తాయి. గాలి నాణ్యత మెరుగుపడుతుంది, ప్రజల ఆరోగ్యానికి కూడా మేలు జరుగుతుంది. మనుషుల ఆయుష్షు కాలం ఇలా అనేక రకాలుగా ఆరోగ్యానికి మేలు జరుగుతుంది కానీ ప్రభుత్వం ఈ బృహత్తర కార్యక్రమాన్ని విస్మరించడం సరైనది పద్ధతి కాదని పర్యావరణవేత్తలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



### ఇంటింటికి వేప, రావి పండ్ల మొక్క పంపిణీ అవసరం


ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన ప్రతీ ఇంటికి ఒక వేప, రావి మొక్కలు, ఏదైనా ఒక రకం పండ్ల మొక్క పంపిణీ చేయాలి. గ్రామాలలో ప్రతి ఇంటికి రెండు మొక్కలు నాటి చెట్లు గా పెంచాలని సూచించాలి దానితోపాటు ముఖ్యంగా మెట్రోపాలిటన్ సిటీ అయిన హైదరాబాద్‌లో, వరంగల్ కరీంనగర్ ఖమ్మం తోపాటు జనాభా అధికంగా ఉన్న అన్ని జిల్లా కేంద్రాల్లో ఈ కార్యక్రమాన్ని అత్యవసరంగా అమలు చేయాలి. మొక్కల పంపిణీ మాత్రమే కాకుండా, వాటి సంరక్షణకు మున్సిపల్ గ్రామపంచాయతీ సిబ్బందితో ప్రత్యేక పర్యవేక్షణ చర్యలు తీసుకొని రేవంత్ ప్రభుత్వం పాలన చివర రోజు వరకు పర్యవేక్షణ కొనసాగించే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రజలు సూచిస్తున్నారు.

## ప్రభుత్వానికి హెచ్చరిక

పర్యావరణ పరిరక్షణను విస్మరించడం అంటే ప్రజల ఆరోగ్యాన్ని,భవిష్యత్తు తరాల భద్రతను విస్మరించడమే, దీనిపై భవిష్యత్తులో ప్రకృతికి మానవజాతి భారీ మూల్యం చెల్లించక తప్పదు. ఇటీవల కరోనా సమయంలో ఆక్సిజన్ కొరతతో అనేకమంది ప్రాణాలు కోల్పోయారు లక్షల పెట్టి ఆక్సిజన్ కొనుక్కున్నారు ప్రకృతి మనకు ప్రసాదించే ఆక్సిజన్ అందించే చెట్లను తక్షణమే భారీ స్థాయిలో పెంచే విధంగా రేవంత్ రెడ్డి సర్కార్ పూనుకోవాల్సిందే. ఇప్పటికైనా రేవంత్ రెడ్డి సర్కార్ మేల్కొని, పచ్చదనం పెంపొందించేందుకు సమగ్ర ప్రణాళిక రూపొందించి, అమలు చేయాలి. పర్యావరణాన్ని కాపాడే దిశగా ప్రజల సహకారంతో కఠిన చర్యలు తీసుకోవాలి.

**పర్యావరణ పరిరక్షణ ఒక ఎంపిక కాదు - అది భవిష్యత్ తరాల కోసం తప్పనిసరి మన బాధ్యత**

# రూల్స్ మాకేనా, మీకు లేవా.?




**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** కొంతమంది పోలీసు సిబ్బంది విధులు నిర్వహించే సమయంలో పొరపాటున ఎవరైనా తప్పు చేసి వాళ్లకు దొరికారు అంటే అంతే రూల్స్ పాటించడం లేదని చలాన్లు వేయడంతో పాటు వాళ్ళ జులూమ్ సైతం చూపిస్తారు, కానీ వాళ్లు తప్పు చేస్తే ప్రశ్నించే వాళ్లు ఉండరు ప్రశ్నించిన వాళ్లు పట్టించుకోరు, ఒకవేళ ధైర్యం చేసి ఎవరైనా ప్రశ్నిస్తే తిరిగి వాళ్లపైనే అక్రమ కేసులు పెడతారు. ఇలా ఉంది పోలీసు శాఖలో కొంతమంది సిబ్బంది, అధికారుల తీరు. ఉన్నత అధికారులు ఎంత మార్పు తేవాలన్న అది జరగడం లేదు. ఇలా త్రిబుల్ రైడ్ తో పోలీసులు వెళ్లడంపై ప్రజలు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. రూల్స్ మాకే మీకు ఉండవు కదా అంటూ ముక్కున వేలేసుకుంటున్నారు.

# అక్రమ మట్టి, ఇసుక రవాణాపై ఉక్కుపాదం

- అనుమతిలేని తరలింపు పై ప్రత్యేక నిఘా
- కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, ఎస్పీ మహేష్ బీ గీతే ఆధ్వర్యంలో సంయుక్తంగా దాడులు
- కేసులు నమోదు వాహనాలు సీజ్- జరిమానా విధించి ప్రభుత్వ ఖజానాకు జమ



సిరిసిల్ల( ప్రశ్న న్యూస్) జిల్లాలో మట్టి, ఇసుక అక్రమ రవాణా పై జిల్లా అధికార యంత్రాంగం ఉక్కు పాదం మోపుతోంది. అనుమతి లేకుండా తరలింపుపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి వరుస దాడులు కొనసాగుతున్నాయి. అక్రమ రవాణా దారులు పై కేసులు నమోదు చేస్తూ, వాహనాలు సీజ్ చేయిస్తున్నది.

### సహజ వనరుల సంరక్షణ

కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, ఎస్పీ మహేష్ బీ గితే జిల్లాలోని సహజ వనరుల సంరక్షణకు ప్రత్యేక చర్యలు, ప్రణాళిక ప్రకారం తీసుకుంటున్నారు. ప్రభుత్వ పథకాలు, నిర్మాణాల కోసం నిబంధనల మేరకు తరలించేందుకు కలెక్టర్ అనుమతి ఇస్తున్నారు.

### పదుల సంఖ్యలో వాహనాలు సీజ్.

జూలై 21 వ తేదీన ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్ లో హిటాచి యంత్రం, 12 వ తేదీన ఇల్లంతకుంట మండలం గాలిపెల్లిలో జేసీబీ, ఐదు ట్రాక్టర్లు, 10వ తేదీన ముస్తాబాద్ మండలం చిప్పలపల్లిలో జేసీబీ, ఐదు ట్రాక్టర్లు, జూన్ 28వ తేదీన ఇందిరమ్మ ఇళ్లకు అని వాహనాలకు బ్యానర్ కట్టి వేములవాడ రూరల్ మండలంలోని కొడిముంజ-అనుపురం పరిసరాల్లో అక్రమ రవాణా చేస్తున్న 10 టిప్పర్లు, 2 ట్రాక్టర్లు, 2 జేసిబీలు, 2 హిటాచి యంత్రాలు, అదే నెల 22 వ తేదీన ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్ లో హిటాచీ, జేసీబీ, అలాగే ఒక టిప్పర్ ను సీజ్ చేసి, పోలీస్ స్టేషన్ల, ఎస్పీ కార్యాలయం కు తరలించారు.

### కేసులు నమోదు చేసి.. జరిమానా విధించి

ప్రభుత్వ పథకాలు, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల కోసం నిబంధనల మేరకు తరలించేందుకు కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అనుమతి ఇస్తున్నారు. నిర్మాణదారులకు ఇసుక, మట్టి కోసం ఇబ్బంది పడుకుండా పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నారు. ఇందిరమ్మ ఇండ్లకు కావాల్సిన ఇసుక, మట్టి సమకూర్చాలని ఆయా మండలాల తహసీల్దార్లను ఆదేశించారు.

### జరిమానా విధించి ప్రభుత్వ ఖజానాకు జమ

అనుమతి లేకుండా మొరం, మట్టి తరలిస్తున్న 691 వాహనాలను మైనింగ్ శాఖ ఆద్వర్యంలో సీజ్ చేసి రూ. 1,02,026 జరిమానా విధించారు.

అలాగే అధికారికంగా అనుమతి లేకుండా మొరం, మట్టి తవ్వకాలు చేస్తున్న జిల్లాలోని ఆయా మండలాల్లో నలుగురికి రూ. 2,87,515 జరిమానా విధించి ప్రభుత్వ ఖజానాకు జమ చేయడం జరిగింది.


### ప్రభుత్వ సెలవు రోజుల్లో అనుమతులు ఇవ్వవద్దు

ప్రభుత్వ పథకాలు, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల కోసం ప్రభుత్వ సెలవు దినాల్లో ఇసుక, మట్టి తరలించవద్దని, ఆయా మండలాలకు తెలిపిన ప్రభుత్వ పని దినాలలో మాత్రమే అనుమతులు ఇవ్వాలని కలెక్టర్ సూచించారు. జిల్లాలో అక్రమంగా మట్టి, ఇసుక తరలిస్తే ఉపేక్షించమని, కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# "ప్రెస్" ముసుగులో ప్రతిష్టను

# తగ్గించే వాహనాలు

- జర్నలిజం గౌరవాన్ని అపహాస్యం చేస్తున్న మోసగాళ్లు
- జర్నలిజంకి సంబంధం లేనివారు వాహనాలపై 'ప్రెస్' స్టిక్కర్లు అతికించి తిరుగుతున్న దుస్థితిని ఆపాలని నిజమైన విలేఖరుల వినతి
- చర్యల కోసం పోలీస్ కమిషనర్‌కు విజ్ఞప్తి


తెలంగాణ జర్నలిస్ట్ సంక్షేమ సంఘం
Telangana Journalists Sankshema Sangham
PRESIDENT B.L.N. CHARY
GENERAL SECRETARY
PRESIDENT

**నిజామాబాద్ (ప్రశ్న న్యూస్)** నిజమైన జర్నలిజం అంటే ప్రజా సమస్యలను వెలికి తీయడం, ప్రభుత్వాన్ని నిజాయితీగా ప్రశ్నించడం, ప్రజా సమస్యలను తీరుస్తూ సమాజానికి అద్దంపట్టే విధంగా వృత్తిపరంగా జీవించడమే. కానీ ఇటీవలకాలంలో యూట్యూబ్, సోషల్ మీడియా జర్నలిస్టులు అంటూ ఎలాంటి అర్హత లేకున్నా కొన్ని ప్రాంతాల్లో "జర్నలిస్ట్" అనే ప్రతిష్టత్మక పదాన్ని మాస్కుగా ఉపయోగించుకుని, వాహనాలపై "ప్రెస్" స్టిక్కర్లు అతికించి, నకిలీ ఐడి కార్డులు ఏర్పాటు చేసుకొని తిరిగే నకిలీ విలేఖరులు మన ప్రజావ్యవస్థపై మచ్చలుగానూ, నిజమైన విలేఖరుల గౌరవాన్ని అపహాస్యం చేసే స్థితికి తీసుకువచ్చారు.

### ప్రెస్ స్టిక్కర్ల దుర్వినియోగం నిజామాబాద్‌లో విచిత్ర దృశ్యం

నిజామాబాద్ జిల్లా ముఖ్యంగా అర్బన్ పరిధిలో రోజుకు వందల వాహనాలు "ప్రెస్" స్టిక్కర్లు వేసుకుని తిరుగుతున్నాయని, వీటిలో అనేకం జర్నలిజంతో సంబంధం లేనివారని ప్రజలు గమనిస్తు ఆరోపిస్తున్నారు. వీరి లక్ష్యం ట్రాఫిక్ ఆంక్షలు దాటడం, పోలీసు తనిఖీలను తప్పించుకోవడం మాత్రమే కాకుండా అక్రమ వసూళ్లకు పాల్పడడం జరుగుతుంది. తెలంగాణ రాష్ట్రంలో నిజమైన విలేఖరుల మాదిరిగానే నకిలీ విలేకరులు ముసుగు ధరించి ప్రయోజనాలు పొందే ప్రయత్నం కొంతమంది చేస్తున్న వైనం బాధాకరం.

### నిజమైన జర్నలిస్ట్‌ల ఆవేదన గౌరవాన్ని రక్షించండి

ఈ పరిస్థితుల నేపథ్యంలో తెలంగాణ జర్నలిస్టుల సంక్షేమ సంఘం సభ్యులు,పోలీస్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. ఇందులో "ప్రెస్" ముసుగులో తిరుగుతున్న నకిలీ విలేఖరులపై చర్యలు తీసుకోవాలని, ఎవరి ఐడెంటి కార్డు వారే తయారు చేసుకోవడం ఏమిటని, ప్రభుత్వం గుర్తింపు లేకుండానే సొంతంగా ఒక సంస్థ పేరు పెట్టుకొని వాళ్లే ఐడి కార్డులు తయారు చేసుకొని అమ్ముకోవడం జరుగుతుందని ఈ ఐడి కార్డుల ముసుగులో అనేక అక్రమాలకు పాల్పడుతున్నారని వీరిపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించి వారి వాహనాలపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని కోరారు.

### జర్నలిజం ఒక వృత్తి కాదు - అది సమాజ సేవా మార్గం

కచ్చితంగా విద్య, అనుభవం, సమాజపట్ల నిబద్ధతతో నిజాయితీగా పనిచేస్తున్న జర్నలిస్టుల ఆవేదనను అలక్ష్యం చేయరాదు. 20-30 ఏళ్లుగా ప్రజల కోసం శ్రమిస్తున్న సీనియర్ జర్నలిస్టులు ప్రస్తుతం నకిలీ విలేఖరుల వల్ల తాము గౌరవం కోల్పోతున్నామనే బాధను వ్యక్తపరుస్తున్నారు.

పత్రికా స్వేచ్ఛను నిలబెట్టాలి అంటే ముందుగా దాని గౌరవాన్ని కాపాడాలి. జర్నలిజం వ్యాపారం కాదు, బాధ్యతగా భావించాల్సిన సమయం ఇదే.నిజమైన విలేఖరుల ఆవేదన ప్రభుత్వ వ్యవస్థ గమనించాల్సిన అవసరం ఉంది. "ప్రెస్" అనే పదం కలిగిన స్టిక్కర్‌తో ఎటు పోతే అటు అనుకునే దుర్వినియోగాలను నియంత్రించాలి.

మీడియా గౌరవాన్ని కాపాడే చర్యలకు అధికారులు తక్షణం ముందుకు రావాలని తెలంగాణ జర్నలిస్టు సంక్షేమ సంఘం ఆశాభావం వ్యక్తం చేస్తోంది.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.No : 8-2-293/82/10/80, Womens Co-operative Housing Society, Road No - 7, Jubilee Hills, Hyderabad - 500033, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588